





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



నేనూ ఒక 'దిమాగి నక్సల్'

80% భారతీయులు మాంసాహారులు

తమిళనాడు ఉప ఎన్నికల్లో వామపక్షాలు స్వతంత్రంగా పోటీ 07


సంపుటి 09, సంచిక: 285 | సోమవారం | 14 -09-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ప్రజాపక్షం' వినాయక చవితి శుభాకాంక్షలు

### సెలవు

వినాయక చవితి సందర్భంగా 'ప్రజాపక్షం' కార్యాలయానికి సోమవారం సెలవు. మంగళవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

\- ఎడిటర్



## విస్తారంగా వర్షాలు

పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

మూడు రోజుల్లో భారీ వర్షాలు : ఐఎండి

ప్రజాపక్షం/హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండు నుంచి మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తరువాయి 12లో




## సాంకేతికతను
# ఆయుధంగా మార్చొద్దు

- అది ఉమ్మడి పురోగతికి, శ్రేయస్సుకు ఆటంకం కలిగించొచ్చు
- బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ హెచ్చరిక

BRICS INDIA 2026

**న్యూఢిల్లీ :** పెరుగుతోన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా సామాన్య ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న నేపథ్యంలో, ఈ సవాళ్లను ఎదుర్కొని, మానవాళి కోసం వర్ధిల్లేందుకు 'బ్రిక్స్' కూటమి సహకారం, సమ్మిళిత వృద్ధి ద్వారా ఎదగాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఆకాంక్షించారు. భారతదేశం ఆతిథ్యం ఇచ్చిన తరువాయి 8లో

### నియమాలు లేని ప్రపంచం...
### ట్రాఫిక్ లైట్లు లేని కూడలి

**చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్**

వాణిజ్యం, తయారీ, పెట్టుబడులు, సాంకేతిక సహకారాన్ని పెంపొందించేందుకు 'బ్రిక్స్' దేశాలు వర్ధమాన మార్కెట్లు, గ్లోబల్ సౌత్‌లో తమకున్న సన్నిహిత సంబంధాలను ఉపయోగించుకోవాలని, సరఫరా గొలుసులను కాపాడాలని, ఒక పెద్ద సమీకృత మార్కెట్‌ను ప్రోత్సహించాలని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆదివారం అన్నారు. 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశం ముగింపు సభలో చేసిన ప్రసంగంలో 'బలమే హక్కు' అనే తర్కాన్ని ఎప్పుడో విడనాడాల్సిందని నొక్కిచెబుతూ 'గ్లోబల్ సౌత్ కోసం ఐక్యత ద్వారా బలానికి సంబంధించిన ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించే దిశగా తరువాయి 8లో

### సవాళ్లను ఎదుర్కొనేందుకు
### సమగ్ర విధానం

**'బ్రిక్స్' దేశాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ పిలుపు**

అత్యవసరమైన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో సమగ్ర విధానాన్ని అవలంభించాలని 'బ్రిక్స్' దేశాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఆ కూటమి దేశాల మధ్య ధాన్యం మార్కెట్‌కు సంబంధించి ఒక కొత్త బీమా విధానాన్ని, ఉమ్మడి కార్యాచరణను ప్రతిపాదించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం కారణంగా పాశ్చాత్య శక్తులు మాస్కోపై విధించిన తీవ్రమైన ఆంక్షల మధ్య పుతిన్ బ్రిక్స్ దేశాలతో పాటు గ్లోబల్ సౌత్ దేశాల మధ్య ఆర్థిక వృద్ధి కోసం కొత్త కార్యక్రమాలను ప్రతిపాదించారు. ఒక నిర్దిష్ట ధర పరిమితికి లోబడి లేదా అంతకంటే తక్కువ తరువాయి 8లో

### ఆహారభద్రత, ప్రజా సంక్షేమంపై
### ఏకపక్ష ఆంక్షల ప్రభావం

**ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్**

ప్రస్తుత ఆర్థిక, వాణిజ్య వ్యవస్థలపై అధికంగా ఆధారపడటం వల్ల, వర్ధమాన దేశ ఆర్థికవ్యవస్థలు రాజకీయ ఒడిదుడుకులకు గురయ్యే అవకాశం ఉన్నందున, బ్రిక్స్ దేశాలు జాతీయ కరెన్సీలలో వాణిజ్యాన్ని విస్తరించాలని, సమ్మిళిత ప్రపంచ ఆర్థిక చట్రం దిశగా కృషి చేయాలని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ కోరారు. ఆదివారం ఇక్కడ 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశం ముగింపు సభలో పెజెష్కియన్ ప్రసంగిస్తూ, పాశ్చాత్య శక్తులను ఘాటుగా విమర్శించారు. ఏకపక్ష ఆంక్షలు ప్రపంచ ఆహార భద్రత, ప్రజల సంక్షేమంపై నేరుగా ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ఇరుపక్షాల తరువాయి 8లో



# సంఘటితమవ్వండి

## ఏకతాటిపైకి వస్తే అందరూ గౌరవిస్తారు



- ఆర్యవైశ్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- సౌమ్యంగా, ఆత్మాభిమానంతో, ఆత్మ గౌరవంతో నిలబడేవారే ఆర్యవైశ్యులని ప్రశంస
- హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు శంకుస్థాపన

ప్రజాపక్షం/ఉప్పల్ (హైదరాబాద్)

కష్టాలు, బాధలు ఎన్ని ఉన్నప్పటికీ ఆర్యవైశ్యులు వాటిని కనపడనీయకుండా సమాజంలో సౌమ్యంగా, ఆత్మాభిమానంతో, ఆత్మ గౌరవాన్ని కాపాడుకొంటూ ప్రతి ఒక్కరికి చేదోడు వాదోడుగా ఉంటారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమైక్యంగా ఒక్క తాటిపై నడిస్తే అందరూ గౌరవిస్తారన్నారు. హైదరాబాద్ ఉప్పల్ నియోజకవర్గం ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేసారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ప్రాముఖ్యతని కొనియాడుతూ ప్రపంచ స్థాయి నాయకుడిగా ఆర్యవైశ్య బిడ్డ మహాత్మా గాంధీ ఎదిగారని, ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా గాంధీ గొప్పతనం తెలియని వారుండరన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషించారని, పొట్టి శ్రీరాములు పోరాటంతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, దేశ సమగ్రత కోసం గాంధీ ప్రాణాలిస్తే పొట్టి శ్రీరాములు రాష్ట్రం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఆర్యవైశ్యులకు రావాల్సిన గుర్తింపు రాలేదని, ఆర్యవైశ్యుల పట్ల తమ ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం ఉందని, పేదల ఆర్యవైశ్య బిడ్డలకు నూతనంగా నిర్మిస్తున్న ఆత్మగౌరవ భవనం సంపూర్ణంగా ఉపయోగపడాలని, రాష్ట్ర ప్రభుత్వం భవన తరువాయి 8లో



## పూజలకు బడా గణేశ్ సిద్ధం

- భక్తులకు దర్శనమివ్వనున్న 70 అడుగుల ఖైరతాబాద్ పంచముఖ సంకటహర మహాగణపతి
- నేడు 11 గంటలకు గవర్నర్ దంపతుల చేతులమీదుగా తొలిపూజ

12




### రాహుల్‌గాంధీని
## ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యం

- వరంగల్ ఈస్ట్ నుంచి నా గెలుపులో ఆయన పాత్ర కీలకం
- కాంగ్రెస్‌లోనే ఉంటాం: 2028లోనూ గెలుస్తా
- మాజీమంత్రి కొండా సురేఖ ప్రకటన
- బర్తరఫ్ తరువాత తొలిసారిగా కార్యకర్తలతో భేటీ

ప్రజాపక్షం/హనుమకొండ

వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి తాను ఎమ్మెల్యేగా గెలవడంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాత్ర ఉందని మాజీ మంత్రి కొండా సురేఖ, కొండా మురళీ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేయడమే తమ లక్ష్యమన్నారు. కాంగ్రెస్‌ను వీడేది లేదని వారు స్పష్టం చేశారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికవుతా, ప్రభుత్వంలోకి వస్తా అని సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తమ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సారీ చెప్పమన్నారని, కానీ చెప్పలేదన్నారు. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ తర్వాత, వరంగల్‌లో తొలిసారి కొండా సురేఖ, కొండా మురళీ ఆదివారం కార్యకర్తలతో సమావేశం తరువాయి 8లో



### సౌదీ సైనికస్థావరంపై
# హౌతీల దాడి

- దెబ్బతిన్న మసీదు, పౌర నివాసాలు
- ఓడిపోతున్న యెమెన్ సైన్యం : వేలాదిగా ప్రజలు పరార్
- హోర్ముజ్‌లో ఇరాన్ నౌక ధ్వంసం : ఒకరు మృతి



**కైరో:** ఇరాన్ మద్దతు ఇస్తున్న యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై ఆదివారం తెల్లవారకముందుగానే కొత్త దాడులకు దిగారు. యెమెన్‌లో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన హౌతీ వ్యతిరేక, సౌదీ అరేబియా మద్దతు ఇస్తున్న ప్రభుత్వంతో తిరుగుబాటుదారులు పోరాటం చేస్తూనే సౌదీ ప్రాంతాలపై దాడులు చేశారు.మరోవైపు యెమెన్‌లో హౌతీల ప్రభావం కారణంగా వేలాదిమంది ప్రజలు భయంతో నివాసిత ప్రాంతాలు వదిలి పారిపోతున్నారు. గడచిన తరువాయి 12లో

## ఈ వారంలోనే కేటాయింపులు

- తుది దశకు చేరిన ఇందిరమ్మ టవర్స్ ఎల్ఐజి గృహాల కేటాయింపు ప్రక్రియ
- లక్కీ డ్రా ద్వారా 7,340 మంది అభ్యర్థుల ఎంపిక
- హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్

ప్రజాపక్షం/హైదరాబాద్


ఇందిరమ్మ టవర్స్ ఎల్ఐజి గృహాల కేటాయింపు ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌసింగ్ కమిషనర్ వి.పి. గౌతమ్ స్పష్టం చేశారు. లక్కీ డ్రా విధానం ద్వారా మొత్తం 7,340 మంది అభ్యర్థులను ఎంపిక చేయగా, వారిలో 6,643 మందికి క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తయిందన్నారు. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు 5,521 మంది అర్హులుగా నిర్ధారించబడ్డారని, మిగిలిన తరువాయి 12లో

# తెలంగాణ పోరాటంలో ఆయుధం పట్టిన సాహిత్యం


తెలంగాణ సాయుధ పోరాటానికి అనేకానేక కారణాలు ఉన్నాయి. అదే విధంగా కమ్యూనిజం నుంచి జానపదాల వరకూ ఎన్నో అంశాలు పోరాటానికి ఊపిరి పోశాయి. సాహిత్యం పోషించిన పాత్ర అద్వితీయం. అందుకే, తెలంగాణ సాయుధ పోరాటాన్ని కేవలం తుపాకులు పట్టిన రైతుల తిరుగుబాటుగా అర్థం చేసుకుంటే దాని చరిత్రలోని ఒక ముఖ్యమైన పార్శ్వాన్ని కోల్పోయినట్టు అవుతుంది. 1946 నుంచి 1951 వరకు సాగిన ఈ పోరాటం భూమి, భుక్తి, విముక్తి కోసం రైతాంగం సాగించిన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఉద్యమం. నిజాం నిరంకుశ పాలన, దేశ్‌ముఖ్‌లు, జమీందార్ల దోపిడీ, వెట్టి చాకిరీ, అధిక పన్నులు, భూస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా గ్రామీణ తెలంగాణ తిరుగుబాటు చేసింది. కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ ఈ అసంతృప్తికి రాజకీయ రూపాన్ని ఇచ్చాయి. ఆ పోరాటానికి సాహిత్యం ప్రజల భాషలో స్వరమిచ్చింది. అవసరమైన బలాన్ని అందించింది. ఉద్యమ నెగడులు రాజేసింది. పోరాట స్ఫూర్తిని రగిలించింది. అక్షరాస్యత పరిమితంగా ఉన్న గ్రామీణ సమాజంలో పుస్తకం కంటే పాట వేగంగా ప్రయాణిస్తుంది. వార్తాపత్రిక చదవని రైతు కూడా పాట వింటాడు. సభకు వెళ్లని మహిళ కూడా బుర్రకథ వింటుంది. అక్షరం తెలియని కూలీ కూడా జానపద గేయాన్ని గుర్తుంచుకుంటాడు. అందుకే తెలంగాణ సాయుధ పోరాటంలో సాహిత్యం ఒక అలంకారంగా కాకుండా, ప్రజా సమీకరణానికి పనిచేసిన రాజకీయ సాధనంగా ఉపయోగపడింది. ఆ కాలంలో వందలాది పాటలు, కథలు పుట్టాయి. కొన్ని నాటకాలు, నవలలు కూడా వెలువడ్డాయి. పోరాటం సాగుతున్న సమయంలో దీర్ఘమైన నవల రాయడానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో పాట, గేయం, కథ, నాటకం వంటి తక్షణ ప్రసార రూపాలే ఎక్కువ ప్రభావం చూపాయి. ఎన్నో విప్లవాల మాదిరిగానే తెలంగాణ సాయుధ పోరాటంలోనూ సాహిత్యం కీలక భూమిక పోషించింది. ఈ క్రమంలో వచ్చిన సాహిత్య ప్రత్యేకత దాని భాషలోనే ఉంది. అది గ్రంథాలయాల్లో మాత్రమే కనిపించే భాష కానేకాదు. గ్రామాల మాట.. రైతుల నుడికారం.. కూలీల అనుభవం.. దొరల దౌర్జన్యంపై నిరసన గళం.. వెట్టి చాకిరీ బాధను మోసిన అక్షర రూపం.. పోలీసురజాకార్ల హింసను కళ్లకు కట్టిన ఇవన్నీ పాటల్లోకి వచ్చాయి. అందువల్ల ఆ పాటలు ప్రజల సొంత అనుభవాలుగా మారాయి. సుద్దాల హనుమంతు, కాళోజీ నారాయణరావు, దాశరథి రంగాచార్య, దాశరథి కృష్ణమాచార్య, వట్టికోట ఆళ్వార్‌స్వామి.. ఇలా ఎంతో మంది రచయితలు తెలంగాణ సాయుధ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. పేరు కూడా ప్రకటించుకోని ఎంతో మంది జానపద రచయితలు రాసిన పాటలు వాడవాడలా మారుమోగాయి. ప్రజలకు స్ఫూర్తిమంత్రాలయ్యాయి. అలాంటి ప్రజా కవిత్వానికి సుద్దాల హనుమంతు అత్యంత ముఖ్యమైన ప్రతినిధి. ఆయన అసాధారణ కవి. పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సాంస్కృతిక కార్యకర్త. ఆయన పాటలు వెట్టి చాకిరీ, దోపిడీ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచాయి. 'పల్లెటూరి పిల్లగాడా...' వంటి పాటలు గ్రామీణ తెలంగాణలో అపారమైన ప్రజాదరణ పొందాయి. 'వేయ్ వేయ్.. దెబ్బకు దెబ్బ' వంటి గేయాలు పోరాటానికి ప్రతిఘటన స్వరాన్ని ఇచ్చాయి. హనుమంతు పాటలపై జరిగిన పరిశోధనలు ఆయన గేయాలు అణగారిన వర్గాలను సమీకరించడంలో కీలక పాత్ర పోషించాయని స్పష్టం చేస్తున్నాయి. అదే సమయంలో బండి యాదగిరి వంటి ప్రజా కవులు పుస్తక రచయితలుగా కాకుండా, ప్రజల మధ్య పాడే కవులుగా చరిత్రలో నిలిచారు. 'బండెనక బండి కట్టి...' అనే గేయం తెలంగాణ సాయుధ పోరాటపు సామూహిక జ్ఞాపకంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఈ పాటలో రైతు ప్రపంచం, దోపిడీపై ఆగ్రహం, దొరలపై తిరుగుబాటు అన్నీ ఒకేసారి వినిపిస్తాయి. బండి యాదగిరి వంటి కవులు ప్రజల కోసం పాటలు రాయకుండా, ప్రజల మధ్య నుంచే పాటను సృష్టించారు. ఇలాంటి పాటలకు రచయిత పేరు ఉండటం కూడా అవసరం లేని పరిస్థితి. కొన్ని పాటలు ఒకరి దగ్గర పుట్టి మరొకరి గొంతులో మారాయి. గ్రామం నుంచి గ్రామానికి వెళ్లే కొద్దీ పదాలు మారాయి, బాణీ మారింది, సందర్భం మారింది. చివరకు ఆ పాట వ్యక్తిగత రచనగా కాకుండా ప్రజల సామూహిక సృష్టిగా మారింది. తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ మౌఖిక సాహిత్య సంప్రదాయాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.




సురవరం ప్రతాపరెడ్డి



మఖ్దూమ్ మొహియుద్దీన్



కాళోజీ



దాశరథి

ఇక తెలంగాణ సాయుధ పోరాట కాలపు ప్రముఖ కవుల్లో ఒకరైన దాశరథి కృష్ణమాచార్య కవిత్వంలో నిజాం పాలనపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుంది. 1947లో ఆయన అరెస్టయ్యాడు. వరంగల్, నిజామాబాద్ జైళ్లలో నిర్బంధాన్ని అనుభవించాడు. జైలు జీవితంలోనూ ఆయన కవిత్వం ఆగలేదు. ఆ అనుభవాలే తరువాత ఆయన విప్లవ కవిత్వానికి పదును పెట్టాయి. ఆయన తొలి ప్రముఖ కృతి అగ్నిధారలో తెలంగాణ 'పోరాటపు అగ్ని' స్పష్టంగా కనిపిస్తుంది. దాశరథి కవిత్వంలో తెలంగాణ భూమి ఒక భౌగోళిక ప్రాంతంగా మాత్రమేగాక, దోపిడీకి వ్యతిరేకంగా నిలిచిన ప్రజల ప్రతీకగా ఆవిష్కృతమవుతుంది. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అనే భావప్రపంచం తరువాతి తరాలకు తెలంగాణను పరిపాలనా ప్రాంతం గా కాకుండా ఒక సాంస్కృతిక అస్తిత్వంగా చూడటానికి సహకరించింది. దాశరథి ప్రాముఖ్యత నిజాం వ్యతిరేక కవిత్వానికి పరిమితం కాలేదు. ఆయన కవిత్వం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని వ్యక్తం చేసింది. జైలు, నిర్బంధం, దౌర్జన్యం మధ్య కూడా కవి స్వరం కొనసాగుతుందనే నమ్మకాన్ని ఆయన రచనలు కలిగించాయి. 'జనపదం', 'మోదుగుపూలు' వంటి అద్భుత రచనలతో తెలంగాణలో దొరల దౌర్జన్యాలను కళ్లకు కట్టిన దాశరథి రంగాచార్య చేసిన సాహితీ సేవలు అద్వితీయం. ప్రజల తరపున మాట్లాడిన స్వరం కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజా కవిత్వంలో మరో విశిష్టమైన పేరు. ఆయనకు కవిత్వం ఒక సాహిత్య వ్యాయామం. సమాజంతో కవికి ఉండే నైతిక సంబంధం. నిజాం పాలనను, నిరంకుశత్వాన్ని, ఫాసిజాన్ని, సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించే తీవ్రమైన గళం. కాళోజీ తన రచనల్లో సాధారణ మనిషికి పట్టం కట్టాడు. ఆయన భాషలో పాండిత్య ప్రదర్శన కంటే సంభాషణా ధోరణి ఎక్కువ. అందువల్ల ఆయన కవిత్వం సభలో చదివే పద్యంగా కాకుండా ప్రజలతో మాట్లాడే మాటగా మారింది. 'నా గొడవ' అనే రచనలో ఈ స్వభావం స్పష్టంగా కనిపిస్తుంది. తెలంగాణ ప్రత్యేక అస్తిత్వం గురించి కూడా కాళోజీ చాలా ముందుగానే ఆలోచించాడు. ఆయన దృష్టిలో ప్రాంతీయ ఆత్మగౌరవం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరస్పరం సంబంధం ఉన్న అంశాలు. అందుకే ఆయన తెలంగాణ సమాజపు రాజకీయ చైతన్యానికి ఆయన ఒక ప్రజా మేధావిగా గుర్తింపు పొందాడు. తెలంగాణ సాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామి పాత్రను ప్రత్యేకంగా గుర్తించాలి. ఆయన రచయిత, పాత్రికేయుడు, ప్రచురణకర్త, గ్రంథాలయ ఉద్యమకారుడు, రాజకీయ కార్యకర్త. నిజాం పాలనకు వ్యతిరేకంగా పనిచేసినందుకు జైలుకు వెళ్లాడు. జైలు లోపలలో ఆయన జైలు అనుభవాలను నమోదు చేశాడు. 'ప్రజల మనిషి'లో తెలంగాణ సామాజిక వాస్తవికతను ప్రతిబింబించాడు. అంతకంటే ముఖ్యంగా దేశోద్ధారక గ్రంథమాల ద్వారా పుస్తకాలను సామాన్య ప్రజలకు చేరువ చేశాడు. సాహిత్యం అంటే చదువుకున్న వర్గం వినోదం కాదని, ప్రజలలో ఆలోచన పెంచే సాధనమని నమ్మాడు. ఆచరణలో చూపాడు. ఆయన ప్రచురణా కార్యక్రమం గ్రామీణ సమాజంలో పఠన సంస్కృతిని పెంచడంలో కీలకంగా పనిచేసింది. తెలంగాణ సాయుధ పోరాటానికి సాహిత్యం అందించిన మరో గొప్ప ఆయుధం పాట. ఎందుకంటే, ఒక పాట వెంటనే ప్రజలను కదిలిస్తుంది. ఒక పుస్తకం మాత్రం ఆలోచనను దీర్ఘకాలం నిలబెడుతుంది. పాట ప్రజలను సమీకరిస్తే, పుస్తకం ఆ సమీకరణానికి సిద్ధాంతపరమైన పునాది వేస్తుంది. ఆళ్వారుస్వామి ఈ రెండో పనిని చేశాడు.

సాహిత్యం పుస్తకంలోనే ఉండిపోతే తెలంగాణ సాయుధ పోరాటంలో దాని ప్రభావం ఇంతటి విస్తృతంగా ఉండేది కాదు. నాటకం, బుర్రకథ, గొల్లసుద్దులు, ఫకీర్, పిట్టలదొర, బైరాగులు వంటి స్థానిక జానపద కళారూపాలను రాజకీయ చైతన్యానికి ఉపయోగించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి సాంస్కృతిక బృందాలు గ్రామాలకు వెళ్లి ప్రదర్శనలు ఇచ్చాయి. సాయుధ పోరాటం తీవ్రమైన దశలో ఈ కళాకారులు గెరిల్లా దళాల రక్షణలో కూడా ప్రదర్శనలు నిర్వహించారు. 'మా భూమి' నాటకం ఈ సాంస్కృతిక ఉద్యమానికి ఒక ముఖ్యమైన ఉదాహరణ. సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు రచించిన ఈ నాటకం భూమి, దోపిడీ, రైతాంగ జీవితం వంటి అంశాలను రంగస్థలంపైకి తెచ్చింది. 1947లోనే ఈ నాటకాన్ని అనేక బృందాలు విస్తృతంగా ప్రదర్శించాయి. తరువాత అది నిషేధానికి గురైంది. సాహిత్యం రాజకీయ అధికారాన్ని ఎందుకు కలవరపెడుతుందో మా భూమి చరిత్ర స్పష్టం చేస్తుంది. స్థూలంగా చూస్తే, తెలంగాణ సాయుధ పోరాటంలో సాహిత్యం మూడు ప్రధాన పనులు చేసింది. మొదటిది, బాధకు పేరు పెట్టింది. వెట్టి చాకిరీ, దోపిడీ, భూస్వామ్య అణచివేత వంటి అనుభవాలను పాటగా మార్చినప్పుడు వ్యక్తిగత బాధ సామూహిక అనుభవంగా మారింది. రెండవది, భయాన్ని ప్రతిఘటనగా మార్చింది. దొరను, రజాకారును, అధికారాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని పాటలు, బుర్రకథలు, నాటకాలు ప్రజల్లో పెంచాయి. ఒక గ్రామంలో జరిగిన సంఘటన మరుసటి రోజే మరో గ్రామంలో పాటగా వినిపించేది. అలా సమాచారం, ఆగ్రహం, ధైర్యం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రయాణించాయి. మూడవది, పోరాటానికి జ్ఞాపకాన్ని నిర్మించింది. యుద్ధం ముగిసిన తరువాత కూడా పాటలు మిగిలాయి. పుస్తకాలు మిగిలాయి. కథలు మిగిలాయి. అందువల్ల పోరాటం ఒక చారిత్రక తేదీల సమాహారంగా కాకుండా ప్రజల స్మృతిలో జీవించే అనుభవంగా మారింది. ఈ విషయంలో మహిళా సాంస్కృతిక కార్యకర్తల పాత్రను కూడా విస్మరించలేం. బుర్రకథలు, నాటకాలు, పాటల ద్వారా మహిళలు కూడా రాజకీయ ప్రచారంలో పాల్గొన్నారు. జైలు జీవితంలో ఉన్నప్పటికీ సాంస్కృతిక రచనలు చేసిన కార్యకర్తల ఉదాహరణలు కూడా ఉన్నాయి. అంటే సాహిత్యసాంస్కృతిక పోరాటం పురుష రచయితల పరిధిలోనే నిలవలేదు. తెలంగాణ సాహిత్య సంప్రదాయం 1946లో మొదలుకాలేదు. నన్నయకు పూర్వపు జైన సాహిత్యం నుంచి పాల్కురికి సోమనాథుడు, బమ్మెర పోతన, మల్లినాథసూరి వరకు విస్తరించిన దీర్ఘమైన సాహిత్య పరంపర ఈ నేలపై ఉంది. కుతుబ్ షాహీ కాలంలో దక్కనీ ఉర్దూ వికసించింది. మహాలఖా బాయి చందా వంటి కవయిత్రులు హైదరాబాద్ సాంస్కృతిక ప్రపంచానికి విశిష్టమైన కృషి చేశారు. ఇరవయ్యో శతాబ్దంలో సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ, దాశరథి, మఖ్దూమ్ మొహియుద్దీన్, వట్టికోట ఆళ్వారుస్వామి, బిరుదురాజు రామరాజు వంటి మేధావులు తెలంగాణ సాంస్కృతిక చైతన్యాన్ని విస్తరించారు. సురవరం ప్రతాపరెడ్డి గోలకొండ పత్రిక ద్వారా సాహిత్య, సామాజిక చర్చలకు వేదిక నిర్మించారు. ఆయన గోలకొండ కవుల సంచిక తెలంగాణలో కవిత్వం లేదనే అపోహకు సమాధానంగా నిలిచింది. మఖ్దూమ్ మొహియుద్దీన్ ఉర్దూ కవిత్వంలో విప్లవ భావజాలాన్ని, ప్రేమను, మానవతను కలిపిన కవి. ఆయన సాహిత్య ప్రభావం తెలంగాణ భాషా సరిహద్దులను దాటి విస్తరించింది. ఈ బహుభాషా సాహిత్య వాతావరణం కూడా తెలంగాణ సాయుధ పోరాట సాంస్కృతిక నేపథ్యాన్ని అర్థం చేసుకోవడానికి అవసరం.

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను అధ్యయనం చేసినప్పుడు నాయకులు, గెరిల్లా దళాలు, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, రజాకార్ల హింస, నిజాం పాలన, పోలీస్ యాక్షన్ వంటి అంశాలకు సహజంగానే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తుంది. కానీ ప్రజల మనస్సులో ఆ పోరాటాన్ని నిలబెట్టింది మాత్రం సాహిత్యమే. తుపాకీ ఒక శత్రువును ఎదుర్కొంటుంది. పాట మాత్రం వేల మందిలో ఒకే భావాన్ని కలిగిస్తుంది. తుపాకీ ఒక యుద్ధాన్ని గెలిపించవచ్చు. కవిత్వం ఒక తరానికి తన చరిత్రను గుర్తుచేయగలదు. తుపాకీ కాలం ముగిసిన తరువాత మౌనమవుతుంది. పాట మాత్రం తరతరాలకు పాడబడుతుంది. అందుకే తెలంగాణ సాయుధ పోరాటాన్ని కేవలం సాయుధ తిరుగుబాటుగా చూడటం చారిత్రకంగా అసంపూర్ణమైన దృష్టి. అది ఒక సాంస్కృతిక విప్లవం కూడా. రైతు తన బాధను పాటగా చెప్పుకున్నాడు. కవి ఆ పాటకు పదం ఇచ్చాడు. కళాకారుడు దాన్ని వేదికపైకి తీసుకెళ్లాడు. రచయిత దాన్ని పుస్తకంలో నమోదు చేశాడు. పత్రిక దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఈ మొత్తం ప్రక్రియ ప్రజల రాజకీయ చైతన్యాన్ని నిర్మించింది. తెలంగాణ సాయుధ పోరాటం ముగిసిపోయినా, దాని సాహిత్యం ముగియలేదు. సుద్దాల హనుమంతు పాటలు, బండి యాదగిరి గేయాలు, దాశరథి కవిత్వం, కాళోజీ స్వరం, ఆళ్వారుస్వామి రచనలు, ప్రజానాట్యమండలి ప్రదర్శనల జ్ఞాపకం వంటివన్నీ తరువాతి తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాలకు పునాది అయ్యాయి. ఏదిఏమైనా, ప్రజలు తిరుగుబాటు చేయడానికి ముందు తమ బాధను భాషలో వ్యక్తం చేస్తారు. ఆ భాష పాటగా మారినప్పుడు అది ఒకరి గొంతులా కాకుండా, సమూహపు హోరులా మారుతుంది. తెలంగాణలో ఆ గొంతు భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం వినిపించింది. అందుకే తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో కవికి, గాయకుడికి, కథకుడికి, నాటకకర్తకు కూడా గెరిల్లా యోధుడి పక్కనే ఒక ప్రత్యేక స్థానం ఉంది.

– బిఎల్

## చదవాల్సిన పుస్తకం

### తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం

తెలంగాణ సాయుధ పోరాటంపై ఎన్నో పుస్తకాలు వెలువడ్డాయిగానీ, నాటి పోరాటానికి ఊపిరిలూదిన సాహిత్యంపై విశ్లేషణాత్మక పుస్తకాలు చాలా అరుదు. అలాంటి అరుదైన పుస్తకాల్లో ఆణిముత్యం ఆచార్య ఎస్వీ సత్యనారాయణ రాసిన 'తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం'. ఈ పుస్తకంలో మొదటి అధ్యాయంలో 'తెలంగాణ సాయుధ పోరాటం' రగిలిరగిలి ప్రళయ ఘోషలా ఎలా మారిందో... కార్చిచ్చులా ఎలా వ్యాపించి భూస్వామ్య విధానాలను, దోపిడీ వ్యవస్థలను ఎలా దహించివేసిందో వివరిస్తారు. చారిత్రక తెలంగాణ రైతాంగ పోరాటాన్ని వివరిస్తుంది. రెండో అధ్యాయం 'తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం'. ఇందులో నాటి పోరాట కాలంలో ఆవిర్భవించిన సాహిత్యాన్ని, అది పోరాటానికి ఊపిరిలూదిన వైనాన్ని ఆవిష్కరిస్తుంది. ఉద్యమం సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. సాహిత్యం ఉద్యమానికి ఊతమిచ్చింది. ఈ రెండూ పరస్పర పూరకాలు. పుస్తకాల్లో, అక్షరబద్ధమైన సాహిత్యమేగాక, వివిధ కళారూపాల్లో నిక్షిప్త, జనపదాల్లో జానపదాలై రైతాంగ పోరాటానికి బాటలు వేసిన ప్రజాసాహిత్యం కూడా ప్రపంచ చరిత్రలోనే గొప్ప ప్రజాతిరుగుబాటుల్లో ఒకటైన తెలంగాణ సాయుధ పోరాటానికి తన వంతు కృషి చేసింది. బుర్రకథలు, ఒగ్గు కథలు, గొల్ల సుద్దులు, నాటకాలు వంటి అనేకానేక రూపాల్లో ఉద్యమ సాహిత్యం ప్రజల మనసుల్లోకి దూసుకెళ్లింది. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా వారిలో పోరాట స్ఫూర్తిని నింపింది. ఈ రెండు రకాల సాహిత్య విధానాలను ఎస్వీ సోదాహరణంగా ఈ పుస్తకంలో మనకు అందిస్తారు. తిరునగరి రామాంజనేయులు నుంచి ఆరుద్ర వరకు, కాంచినపల్లి నుంచి గంగినేని వరకు, కొండేపూడి నుంచి గోగంటి వరకు ఎంతో మంది పోరాట కవులను పరిచయం చేస్తారు. వారి తెలంగాణ సాయుధ పోరాటానికి అందించిన అక్షరాల సమిధలను గుర్తుచేస్తారు. పోరాట కవులను ఆయన ప్రవాహికులు, ప్రవాహ ప్రభావితులు, ప్రవాహ ప్రేరితులు, తటస్థులుగా వర్గీకరించిన విధానం అద్భుతం. బండి యాదగిరి, అలువాల మాచయ్య, ఆవుల పిచ్చయ్య, బి. గంగారాం, అప్పన్న, సర్వదేవభట్ల నరసింహామూర్తి, పెండ్యాల వెంకటేశ్వరరావు మొదలైన వారు ప్రత్యక్షంగా గన్నుపట్టి పోరాటంలోనూ, పెన్నుబట్టి సాహితీ రంగంలోనూ చేసిన సేవలను ఎస్వీ వివరించారు. 1948 సెప్టెంబర్ 14వ తేదీన ఒడ్డు గ్రామానికి చెందిన భూమస్వామి రంగారెడ్డిని చంపారన్న అభియోగంపై 12 మందికి 1950 జులై 19న ఉరిశిక్ష విధించిన ఘటనపై స్పందించిన పోలిష్ యువకవి 'ఉరికంబం కదులుతోంది' కవిత తెలుగు అనువాదాన్ని ప్రస్తావించారు. 'బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి' అంటూ సాగే యాదగిరి రచించి, గానం చేసిన గీతాన్ని విశాలాంధ్ర మాసపత్రిక ప్రచురించింది. ఆ గీతం ఎంతటి ప్రాచుర్యం సంపాదించిందో, తెలంగాణ ప్రత్యేకతను నిలబట్టే రచనగా ఏ విధంగా వెలుగుతున్నదో మనకు తెలుసు. ఆ పాట వాస్తవ రూపాన్ని ఎస్వీ రాసిన 'తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం'లో చూడవచ్చు. ఒకరుకాదు... ఇద్దరు కాదు.. ఎంతో మంది రచయితలను, వారి రచనలను ఎస్వీ ఈ పుస్తకంలో పాఠకులకు పరిచయం చేస్తారు. బాధగాథల తెలంగాణ గురించి తెలుసుకోవడానికి, ఉద్యమ నేపథ్యం అర్థం కావడానికి, సాహిత్యం పోషించిన పాత్రను అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకాన్ని తప్పక చదవాలి. 1998లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ పుస్తకాన్ని ఉద్యమ గ్రంథ శీర్షికలో చేర్చడమే, దీని ప్రత్యేకత నిదర్శనం.




## సాయుధ పోరాట కాలం నాటి ప్రముఖుల కవితలు

నైజాము సర్కరోడా
నాజీల మించినోడా
యమబాధపెస్తివి కొడుకో
నైజాము సర్కరోడా!
పండిన పంటనంతా
తిండికైన ఉంచకుండా
తీసుకవెళ్ళినావు కొడుకో
నైజాము సర్కరోడా!

దున్నాను భూమిలేక
ఉండాను ఇల్లులేక
పరదేశమెల్తిమి కొడుకో
నైజాము సర్కారోడా!
పోలీసు మిల్ట్రి జూసి
మేము లొంగి వస్తమని
నువు ఆశపడ్తివి కొడుకో
నైజాము సర్కారోడా!

లారీల దెబ్బలు గాని
తుపాకీ కాల్పులు గాని
మిషీను గన్నులు గాని
తుపాకీ బాంబులుగాని
నీవెన్ని తెచ్చినగాని
మేం లొంగిరాము కొడుకో
నైజాము సర్కారోడా!
కంచారు గాడుదలాను
లంచగొండి పోలిసోల్లా
నువు పెంచినావు కొడుకో
నైజాము సర్కారోడా!

చుట్టుపట్ల సూర్యపేట
నట్టనడుమ నల్లగొండ
ఆవాల హైద్రాబాద్
తర్వాత గోలకొండ
గోలకొండ ఖిల్లా కింద –

నీ గోరి కర్తం కొడుకో
నైజాము సర్కరోడా!
గోలకొండ ఖిల్లా కింద
నీ గోరి కర్తం కొడుకో
నైజాము సర్కరోడా!

– యాదగిరి

ఒంటరి తుంటరి
ఒ తొండి దొరా!
ఎంతకు మారని మొండి దొరా!
చాలు చాలు నీ పెత్తనమిక
సాగించగ బోకుమోయ్'

– హన్మంతు

గ్రామాధికారులు భీమస్వరూపులై
పెక్కు టక్కుల వెతల్ బెట్టుచుండ
వ్యాపార వర్గంబులా
పూర్తి ధూర్తులై
లాభంబు పూర్తిగా
లాగుచుండ

పాలకోద్యోగులు పట్టాభిషిక్తులై
చిప్ప ముంతల పాలు
సేయుచుండె. '

– గంగుల శాయిరెడ్డి

ఓ నిజాము పిశాచమా!
కానరాదు. నిన్ను బోలిన
రాజు మాకెన్నడేని
తీగెలను తెంపి అగ్నిలో
దింపినావు
నా తెలంగాణా,
కోటి రత్నాల వీణ''

'ప్రాణము లొడ్డి ఘోర గహ
నాటవులన్ బడగొట్టి, మంచి
మాగాణములన్ సృజించి,

ఎము కల్ నుసి జేసి
పొలాలు దున్ని,
భో షాణములన్ నవాబునకు
స్వర్ణము నింపిన రైతుదే,
తెలంగాణము రైతుదే, ముసలి
నక్కకు రాజరికంబు దక్కునే?'

– దాశరథి




## సాంస్కృతిక పునరుజ్జీవనం


ఈ శతాబ్దారంభం నుండే తెలంగాణాలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రయత్నాలు ఆరంభమయ్యాయి. రావిచెట్టు రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావు, శ్రీ రాజా నాయని వేంకట రంగారావు వారి మిత్ర బృందంతో కలిసి 1901లోనే సుల్తాన్ బజార్లో 'శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం' స్థాపించారు. దీనికి గ్రంథాలను సమకూర్చడానికి 'విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి'ని ప్రారంభించారు. వరంగల్లు జిల్లాలోని 'ఇనుగుర్తి' అనే గ్రామంలో వర్ధిరాజు సీతారామచంద్రారావు రాఘవ రంగారావు అనేక నవలలు, నాటకాలు, భాషా విషయిక గ్రంథాలు రాయడమేగాక, 'విజ్ఞాన ప్రచారణీ గ్రంథమాల'ను నెలకొల్పి సారస్వత సృజనకు దోహదం చేశారు. 'తెలుగు పత్రిక' అనే వారపత్రికను కూడా వెలువరించారు. అదే కాలంలో నల్లగొండలో షబ్నవీసు వేంకట నరసింహారావు 'నీలగిరి పత్రిక' పేరుతో ఒక వారపత్రికను, 'వీరేశలింగ కంఠాభరణ గ్రంథమాల' ను నెలకొల్పారు. వీరు ప్రచురించిన గ్రంథాలన్నింటికీ రెండణాలే వెల, నల్లగొండ జిల్లా సూర్యాపేటలో పువ్వాడ వెంకటప్పయ్య' కృషి ప్రచారిణీ గ్రంథమాల' ను నెలకొల్పారు. సికింద్రాబాద్‌లో వట్టికోట ఆళ్వారెస్వామి' దేశోద్ధారక గ్రంథమాల' ను స్థాపించి, అభ్యుదయకరమైన అనేక పుస్తకాలను వెలువరించడమే కాక, సంచీ భుజాన వేసుకుని ఇంటింటికీ తిరిగి పుస్తకాలను అమ్మేవారు. శ్రీవెల్దుర్తి మాణిక్యరావు, కె.సి. గుప్తా 'అణా గ్రంథమాల'ను నెలకొల్పి చాలా చిరుపొత్తాలను ప్రచురించి అణాకే విక్రయించేవారు. వీరి ప్రచురణలపై తెలంగాణా సాయుధ పోరాట సాహిత్యం ప్రభుత్వం కన్నెర్ర జేయడం, కోర్టుకు పోవడం కూడా జరిగింది. 'సురవరం ప్రతాపరెడ్డి స్థాపించి చాలాకాలం పాటు సంపాదకత్వం వహించిన 'గోల్కొండ పత్రిక' ఖచ్చితమైన రాజకీయ దృక్పథంతో వెలువడటమే గాక, అనేక ప్రచురణలను వెలువరించింది. ప్రతాపరెడ్డి సంకలనం చేసిన గోలకొండ కవుల సంచిక' ద్వారా ఎందరో అజ్ఞాత తెలంగాణా కవుల వివరాలు వెలుగు చూశాయి.

– ఎస్వీ

## 'ది సైరెన్స్ ఆఫ్ సెప్టెంబర్'

### హైదరాబాద్ విలీనానికి నవలా రూపం

హైదరాబాద్ సంస్థానాన్ని 1948లో, భారతదేశంలో విలీనం చేసిన సంఘటన చరిత్ర పుస్తకాల్లో ఒక అధ్యాయంగా మిగిలిపోయింది. అయితే ఆ కాలపు రాజకీయ కుట్రలు, రాజసిక జీవితం, వ్యక్తిగత సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలు, ఒక ప్రపంచం కళ్లముందే కూలిపోతున్న అనుభూతిని నవలగా ఆవిష్కరించారు రచయిత్రి జీనత్ ఖాన్. ఆమె తొలి నవల 'ది సైరెన్స్ ఆఫ్ సెప్టెంబర్' హైదరాబాద్ విలీనానికి దారితీసిన పరిణామాలను వాస్తవ, కల్పిత పాత్రల ద్వారా చెప్పే చారిత్రక నవల. 2017 వేసవిలో ముంబయి సముద్రం వెంబడి ఉన్న రహదారిపై నడుస్తున్నప్పుడు ఈ నవలకు సంబంధించిన ఆలోచన తనకు వచ్చిందని ఖాన్ చెబుతున్నారు. హైదరాబాద్ చరిత్రలోని ఆ ఘట్టంలో ఒక ఆసక్తికరమైన నవలకు అవసరమైన అన్ని అంశాలూ ఉన్నాయని ఆమెకు అనిపించింది. వైభవమైన రాజసౌధాలు, విభిన్న స్వభావాల వ్యక్తులు, రాజకీయ ఎత్తుగడలు, రహస్యాలు, పలు కారణాలతో మారిన నిర్ణయాలు వంటి అంశాలన్నీ కలిసి ఒక ఉత్కంఠ భరితమైన కథకు నేపథ్యంగా నిలవగలవని ఆమె భావించారు. ఈ నవల 1948లో హైదరాబాద్ సంస్థానంపై భారతదేశం చేపట్టిన సైనిక చర్యను, ఆ పరిణామాల్లో చిక్కుకున్న వ్యక్తుల జీవితాలను కేంద్రంగా చేసుకుంటుంది. భారత విభజనపై అనేక పుస్తకాలు, సినిమాలు వెలువడినప్పటికీ, అదే సమయంలో దక్షిణ భారతదేశంలో చోటుచేసుకున్న హైదరాబాద్ రాజకీయ పరిణామాలు మాత్రం ఎక్కువగా చరిత్ర, అకడమిక్ పరిశోధనలకే పరిమితమయ్యాయని ఖాన్ అభిప్రాయం. ఆమె దృష్టిలో 'ది సైరెన్స్ ఆఫ్ సెప్టెంబర్' ఒక కనుమరుగైన ప్రపంచం కథ. అమెరికా దక్షిణాది జీవనాన్ని చిత్రించిన 'గాన్ విత్ ది విండ్', సిసిలీ సమాజం పతనాన్ని ప్రతిబింబించిన 'ది లెపర్డ్' వంటి రచనల్లో కనిపించే గతకాలపు ప్రపంచం పట్ల నాస్టాల్జియా ఈ నవలలోనూ కనిపిస్తుందని ఆమె చెబుతున్నారు. హైదరాబాద్ సంస్థానం కూలిపోతున్న సమయంలో అక్కడి జీవితం, ఆ సమాజంలోని వ్యక్తుల మనస్తత్వం, రాజకీయ అనిశ్చితిని పాఠకుడి ముందుకు తీసుకురావడమే తన ప్రయత్నమని అంటున్నారు. 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం ప్రారంభించిన ఆపరేషన్ పోలో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసే ప్రక్రియకు కీలక మలుపుగా నిలిచింది. అయితే ఈ నవల ఆ సంఘటనలను విజేతల దృష్టితో కాకుండా, ఓడిపోయిన పక్షం అనుభవించిన పరిణామాల కోణంలో చెబుతుంది. నవలలో ప్రధాన పాత్ర ఫరిష్తె. ఆమె 15 ఏళ్ల వయసున్న ఒక సంపన్న, కులీన కుటుంబానికి చెందిన యువతి. తన చుట్టూ ఉన్న ప్రపంచం రాజకీయ కల్లోలంలో కూరుకుపోతున్న సమయంలో ఆమె రాజకీయ కుట్రలు, అంతర్జాతీయ గూఢచర్యం, ఒక వైమానిక దళ క్యాడెట్తో దూర సంబంధం వంటి పరిణామాలను ఎదుర్కొంటుంది. ఫరిష్తె పాత్రను నవల కథాంశం పూర్తిగా రూపుదిద్దుకునే ముందే తన మనసులో సృష్టించుకున్నానని ఖాన్ చెబుతున్నారు. ఆదర్శవాది, తెలివైన, ధైర్యవంతమైన కులీన కుటుంబానికి చెందిన టీనేజ్ బాలికగా ఆమెను తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నానని అంటున్నారు. నవలలోని పెద్దల పాత్రలకు భిన్నంగా ఫరిష్తె వ్యక్తిత్వం ఉంటుంది. అధికారంలో ఉన్న పెద్దలలో స్వార్థం, క్రూరత్వం, కుతంత్రం వంటి లక్షణాలు బలంగా కనిపిస్తాయి. చారిత్రక కల్పనా రచనను ఒక యువతి దృష్టికోణంలో రాయడం అంత సులభం కాలేదని ఖాన్ అంటారు. 1948 నాటి సామాజిక పరిస్థితుల్లో ఒక యువతికి స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అవకాశాలు చాలా పరిమితంగా ఉంటాయి. అయినప్పటికీ కథను మధ్యవయస్కులైన పురుషుల దృష్టితో మాత్రమే చెప్పి ఉంటే అది మరింత విషాదభరితంగా మారేది. ఎందుకంటే పరిస్థితులు తమ చేతుల్లోంచి జారిపోతున్నాయని ఆ కాలపు అధికారంలో ఉన్నవారికి తెలిసినా, వారు ఒక మునిగిపోతున్న నౌకను నడిపిస్తున్నట్టే పరిస్థితిని ఎదుర్కొన్నారన్న రచయిత్రి వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. నవలా రచన కోసం ఖాన్ విస్తృతమైన పరిశోధన చేశారు. 1946 నుంచి 1948 మధ్య వెలువడిన తనకు అందుబాటులో ఉన్న పత్రికలను ఆమె పరిశీలించారు. అప్పటి వార్తలు, సామాజిక వాతావరణం, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి పాత దృశ్యచిత్రాలు కూడా ఉపయోగపడ్డాయని చెప్పారు. 1940ల జీవనశైలిని పాఠకుడి ముందుకు సజీవంగా తీసుకురావడానికి ఆ కాలానికి సంబంధించిన పుస్తకాలు, సినిమాలు పరిశీలించారు. రవాణా, సమాచార వ్యవస్థ, దుస్తులు వంటి అంశాలపై కూడా ఆమె ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. జీవిత చరిత్రలు, జ్ఞాపకాల పుస్తకాలు, ప్రత్యక్ష అనుభవ కథనాలు, ముఖ్యంగా ఆ కాలాన్ని స్వయంగా చూసిన కుటుంబ సభ్యుల అనుభవాలు తన పరిశోధనకు ఎంతో ఉపయోగపడ్డాయని ఖాన్ అంటారు. ఇలా చరిత్రలోని ఒక కీలక ఘట్టాన్ని కేవలం రాజకీయ లేదా సైనిక పరిణామంగా కాకుండా, ఒక ప్రపంచం కూలిపోతున్నప్పుడు అందులో జీవించిన వ్యక్తుల అనుభవాలుగా చెప్పే ప్రయత్నమే 'ది సైరెన్స్ ఆఫ్ సెప్టెంబర్'. వాస్తవ చరిత్రకు కల్పనను జోడించి, హైదరాబాద్ సంస్థానం చివరి దశను ఒక యువతి కళ్లతో చూపించడం ఈ నవలకు ప్రత్యేకతను తీసుకొచ్చింది.



STATE & REGIONAL NEWS
జనరల్
STATE & REGIONAL NEWS
మహబూబ్‌నగర్
సోమవారం
14-09-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily




# సిఆర్‌పిలను రెగ్యులర్ చేసి.. సిఎం హామీ నిలబెట్టుకోవాలి

'ప్రామిస్ డే' సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి సిఆర్‌పిల సమస్యలను పరిష్కరించాలని సిఆర్‌పి యూనియన్ తెలంగాణ గౌరవ సలహాదారు బాలరాజు అన్నారు. విద్యాశాఖ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ (సిఆర్‌పి)లుగా పనిచేస్తున్న సుమారు 2 వేల మంది ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి అనుబంధ సిఆర్‌పి యూనియన్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తవుతున్నా కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు, సిఆర్‌పిల డిమాండ్లు పరిష్కారం కాలేదని విమర్శించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పొద్ద నాగేశ్వరరావు మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 2023 సెప్టెంబర్ 13న వరంగల్ ఏకశిలా పార్క్ వద్ద ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సిఆర్‌పిలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని గుర్తుచేస్తూ ప్రతి ఏడాది సెప్టెంబర్ 13ను 'ప్రామిస్ డే'గా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకుని సిఆర్‌పిలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఆర్‌పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్ట దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి పోలే రమేష్, ఉపాధ్యక్షులు సేవియా, రాష్ట్ర నాయకులు మల్లేష్, యూసుఫ్ అలీ, శివరాజ్, కృష్ణశంకర్, మధునాయక్, యాదగిరి, జలంధర్, సుదర్శన్, అశోక్, వెంకటేష్, నర్సింహ, లింగం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పునర్విభజన శాస్త్రీయంగా జరగాలి

- ప్రజా సంక్షేమం ఫరిడవిల్లే రాజ్యాంగ సవరణ జరగాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి
- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి
- సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ప్రజాపక్షం/అమరచింత :** చట్టసభలకు అత్యంత కీలకమైన పార్లమెంటరీ అసెంబ్లీ స్థానాల పునర్విభజనను కేంద్ర ప్రభుత్వం ఒంటెత్తు పోకడలు పోకుండా ఇండియా, ఎన్‌డిఏ కూటమిలు రాష్ట్ర ప్రభుత్వాలు, మేధావులు విజ్ఞప్తులను పరిశీలించి శాస్త్రీయంగా జరపాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా పాలన సాగిస్తుందని రాజ్యాంగ హక్కులను ప్రాదేశిక సూత్రాలకు దేశ సమగ్రతకు విఘాతం కలిగించే విధంగా పరిపాలన విధానాలు కొనసాగుతున్నాయని ఇవి దేశ సార్వభౌమ అధికారానికి ప్రజాస్వామ్య మనుగడకు ఎంతో ప్రమాదకరమని అన్నారు. దేశంలో అన్ని రంగాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీఎస్టీ లాంటి పన్నులతో పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం దేశ ఆర్థిక నేరగాళ్ల అప్పులకు మాత్రం రుణాల మాఫీలు, రాయితీలు కల్పించడం సిగ్గుచేటని ఆయన కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. జన్‌జీ ఉద్యమం కేవలం పేపర్ లీకేజ్ ఉద్యమంగా చూడకూడదని ఇది దేశంలోని ప్రజల ఇబ్బందులకు ఆక్రోశాలకు పాలకులపై పెంచుకున్న పోరాట జ్వాల అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై డిసెంబర్ నెలలో దేశవ్యాప్తంగా సిపిఐ జైల్ భరో కార్యక్రమం నిర్వహిస్తున్నదని అక్టోబర్ రెండున గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ



శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చారిత్రాత్మక చరిత్ర ఆనవాలు లేకుండా పాలకులు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. భూమి కోసం, భుక్తి కోసం, పీడిత జన విముక్తి కోసం రజాకారులను, దేశకాముకులను, నైజాం సర్కారును, దొరలను, భూస్వాములను గ్రామ గ్రామాన తరిమికొట్టి లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర సిపిఐ పార్టీదని, తెలంగాణ గడ్డ విముక్తికై 4,500 మంది రక్తార్పణ చేశారని ఆయన వివరించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, వర్షాలు లేక రైతులు పంట పొలాలు ఎండిపోతు రైతుల కుమిలిపోతున్నారని ఆయన ఆందోళన చెందారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పర్యటించి కరువు ప్రాంతాలకు ప్రకటించి, రైతాంగానికి ఆదుకోవాలని డిమాండు చేశారు. లేనిచో పోరాటాల సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, సిపిఐ నాయకులు ఎ.అబ్రహం, శ్రీహరి, రమేష్, పి.సురేష్, శ్రీరాములు, రవీందర్, సి.నరసింహ శెట్టి, రాంపూర్ సర్పంచు నాగరాజు, శ్యాం సుందర్, పృథ్వీనాదం, భరత్, యం.డి.కుతుబ్, శివ, లక్ష్మి నారాయణ, రఘు, కథలప్ప, ఎర్రన్న, బాలస్వామి, కురుమూర్తి, నాగేంద్రం, సౌలు, కుమార్, గీత, పద్మ, శారద, శ్యామల, భారతి గోవిందమ్మ, లయ, వీణ పద్మ పాల్గొన్నారు.

## విజయ రాములు కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయ రాములు కుటుంబాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యంలు పరామర్శించారు. ఆదివారం వనపర్తి జిల్లా అమరచింత మండ ల కేంద్రంలో ఇటీవల సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు సతీమణి, కే.జ్యోతి అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం లు జ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతి మరణం విజయ రాములు కుటుంబానికి, సిపిఐకి తీరని నష్టం జరిగిందని విచారం వ్యక్తం చేశారు. జ్యోతి భౌతికంగా మన మధ్య లేకపోయిన ఆమె ఆశయాలను కొనసాగించాలి. పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు, పి.సురేష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్, సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, నాయకులు శ్రీహరి, సీఎన్ శెట్టి, రవీందర్, శ్యాంసుందర్, భరత్, ఎర్రన్న, ఆర్ఎన్ కుమార్, సైలు, లక్ష్మి నారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# సభను నడపాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదు

బిఆర్ఎస్ ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం, డొల్లతనం శాసన మండలి సమావేశాల్లో బయట పడిందని శాసన మండలి బిఆర్ఎస్ ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ఆరోపించారు. సభను నడపాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదని తేలిపోయిందన్నారు. ప్రభుత్వ అవసరాల కోసమే సభను నిర్వహించిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీలు ఎల్.రమణ, సురభివాణి దేవి, దేశపతి శ్రీనివాస్‌తో కలిసి మదుసూదనాచారి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపైన రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించడంలేదన్నారు. తమ ప్రశ్నలకు మంత్రుల సమాధానాలు సరిగ్గా ఇవ్వలేదని, బిఎసిలో జరిగిన నిర్ణయాలకు విలువ లేదన్నారు. ఆరు రోజుల శాసనమండలి సమావేశాల్లో ఏ ఒక్క స్వల్పకాలిక చర్చ సక్రమంగా జరగలేదన్నారు. తాము 20 అంశాలను తాము చర్చకు ప్రతిపాదించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. 'క్యూర్ బిల్లు'ను సెలెక్ట్ పంపాలని డిమాండ్ చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వినలేదన్నారు. ఎల్.రమణ మాట్లాడుతూ సాంకేతికంగా సభను నిర్వహించాలి కాబట్టే రాష్ట్ర ప్రభుత్వం సభను నిర్వహించిందని ఆరోపించారు. సురభి వాణి దేవీ మాట్లాడుతూ బిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు ఘోరమైన అవమానం జరిగిందని, ఇక్కడ న్యాయం జరగపోతేనే తాము ఢిల్లీకి వెళ్ళామని వివరించారు. దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ అనేక ఆంక్షలు ఉన్నప్పటికీ శాసనమండలిలో తమకు దక్కిన కొద్ది సమయాన్ని కూడా సక్రమంగా వాడుకున్నామన్నారు.

# 'భావన' ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలోని తెలంగాణ సాయుధ పోరాటాన్ని కొందరు పాలకులు తమ సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సీనియర్ పాత్రికేయులు కె.శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంతో తెలంగాణ ప్రాంతం భారతభూభాగంలో విలీనమైన 'సెప్టెంబర్ 17ను' పురస్కరించుకుని ప్రతి ఏటా తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11 నుంచి 17వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ''భావన'' కవితా సంకలనం' సాహిత్య కార్యక్రమం జరిగింది. ఈ సభకు అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా కె.శ్రీనివాస్, అతిథులుగా తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, సినీ దర్శకులు బాబ్జీ హాజరయ్యారు. రాపోలు సదర్శన్ సంపాదకత్వం వహించిన 85 మంది కవులకు చెందిన 'భావన 'కవితా సంకలనంలో పలువురు కవులు నాళేశ్వరం శంకరం, కందుకూరి శ్రీరాములు, పల్లేరు వీరస్వామి, నిధి, కెవిఎల్, రామకృష్ణ, చంద్రమౌళి, ఎస్.సూర్యప్రకాష్, పరమాత్మ, ఒద్దిరాజు, ప్రవీణ్ కుమార్, గులాబీల మల్లారెడ్డి, చందనాల చంద్రమోహన్ గౌడ్, హరనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిజాం వ్యతిరేక పోరాటమంటే హిందూ భూస్వాముల వ్యతిరేకపోరాటమేనని, ఈ భూస్వాముల సహాయ సహకారాలతోనే రజాకారులు ఎవరిపైనేతే దౌర్జన్యానికి పాల్పడ్డారో, వారిని కమ్యూనిస్టులు సంఘటీతం చేసి తెలంగాణ సాయుధ పోరాటం చేపట్టారని గుర్తు చేశారు.

# సైబర్ బాధితులకు భారీ ఊరట..
# రూ.139.68 కోట్లు రీఫండ్

- ఈ ఏడాది ఇప్పటివరకు 24,189 మంది బాధితులకు నగదు వెనక్కి..
- లోక్ అదాలత్, ఎంఆర్ఎం ద్వారా వేగంగా పరిష్కారం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ మోసాల బారి నపడిన బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) భారీ ఊరటనిచ్చింది. 2026లో ఇప్పటివరకు 24,189 మంది సైబర్ నేర బాధితులకు రూ.139.68 కోట్లను రీఫండ్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో శనివారం వెల్లడించింది. ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో టీజీసీఎస్‌బీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలు, పోలీస్ కమిషనరేట్లు, జిల్లా పోలీసు యూనిట్ల సమన్వయంతో 3,896 మంది బాధితులకు రూ.42.28 కోట్లను తిరిగి అందించేందుకు చర్యలు చేపట్టింది. లోక్ అదాలత్‌లో సైబర్ బాధితులకు ఆర్థిక సాయం అందించడంలో సైబరాబాద్ కమిషనరేట్ ముందంజలో నిలిచింది. 942 మంది బాధితులకు రూ.14.19 కోట్లు రీఫండ్ చేయగా, టిజిసిఎస్‌బి పరిధిలో 41 మంది బాధితులకు రూ.10.55 కోట్లు, మల్కాజిగిరిలో 1,024 మందికి రూ.5.27 కోట్లు, హైదరాబాద్‌లో 530 మందికి రూ.5.02 కోట్లు, సూర్యాపేటలో 34 మందికి రూ.0.76 కోట్లు రీఫండ్ చేయించారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోంశాఖ మంత్రిత్వ శాఖ మే 2026లో ప్రారంభించిన మనీ రెస్టొరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)ను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో జూన్ నుంచి అమలు చేస్తోంది. కోర్టు ఆదేశాలు అవసరం లేకుండానే సైబర్ మోసాల్లో కోల్పోయిన నగదును బాధితులకు తిరిగి అందించేందుకు ఈ విధానం ఉపయోగపడుతోంది. సెప్టెంబర్ 12 నాటికి ఎంఆర్ఎం ద్వారా 9,355 మంది బాధితులకు రూ.27.23 కోట్లు తిరిగి అందించినట్లు అధికారులు తెలిపారు. లోక్ అదాలత్, ఎంఆర్ఎం రెండు విధానాల ద్వారా ఈ ఏడాది ఇప్పటివరకు 13,251 మంది బాధితులకు ఆర్థిక ఉపశమనం లభించిందని టిజిసిఎస్‌బి పేర్కొంది. టిజిసిఎస్‌బి ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు 73,204 మంది బాధితులకు రూ.514.93 కోట్లను రీఫండ్ చేయడంలో సహకరించినట్లు తెలిపింది. సైబర్ మోసానికి గురైన బాధితులు నగదు రీఫండ్ కోసం ఎంఆర్ఎం విధానాన్ని వినియోగించుకోవాలని టిజిసిఎస్‌బి సూచించింది. సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయడం లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయడం ద్వారా 'గోల్డెన్ అవర్'లో చర్యలు తీసుకుంటే నగదును ఫ్రీజ్ చేసి తిరిగి పొందే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని అధికారులు తెలిపారు.ఒటిపి, పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని, కస్టమర్ కేర్ నంబర్లను అధికారిక వెబ్‌సైట్ల ద్వారానే నిర్ధారించుకోవాలని ప్రజలకు టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.



# టిఆర్ఎస్‌లో చేరిన నాగోబా ఆలయ ప్రధాన పూజారి

అక్టోబర్‌లో ఇంద్రవెల్లిలో టిఆర్ఎస్ భారీ బహిరంగ సభ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేస్లాపూర్‌లోని నాగోబా దేవాలయ ప్రధాన పూజారి మెస్రం ఆనంద రావు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో ఆ పార్టీలో ఆదివారం చేరారు. ఆయనతో పాటు పలువురు సర్పంచులు, నాయకులు పార్టీలో చేరారు. నాగోబా ఆశీస్సులు తమపై సంపూర్ణంగా ఉన్నాయని కవిత అన్నారు. మెస్రం ఆనందరావుతో పాటు గిన్నెర గ్రామ సర్పంచ్ మెస్రం భీమ్ రావు, ముత్తనూరు సర్పంచ్ రిట్టె విఠల్, ఆసోద గ్రామ సర్పంచ్ నగేశ్, మన్నూరు మాజీ ఎంపీటీసీ సభ్యుడు కాట్లె మనోహర్, సీనియర్ నాయకులు మెస్రం దయాకర్, తొడసం సాగర్, మెస్రం జంగురావు, కోట్నక్ లక్ష్మ ణ్, సాయిగౌడ్, కోట్నక్ కృష్ణా తదితరులు టిఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తదితరులు పాల్గొన్నారు. అక్టోబర్ నెలలో ఇంద్రవెల్లి కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు టిఆర్ఎస్ వ్యూహ రచన చేస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సంకల్ప సభ సక్సెస్‌తో కావడంతో పార్టీలో మరింత ఉత్సాహం నింపేందుకు ఈ నెల 20న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ నిర్వహిస్తున్నారు. అక్టోబర్‌లో ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా పార్టీ శ్రేణుల్లో జోష్ వస్తుందని టిఆర్ఎస్ భావిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు జగిత్యాల. కొడంగల్ బహిరంగ సభ అనంతరం ఇంద్రవెల్లి సభ నిర్వహించే తేదీలను ప్రకటించనున్నారు.

# తెలంగాణ భవన్‌ను నాటకాలలకు అద్దెకివ్వండి

- మాక్ అసెంబ్లీ జబర్దస్త్ కామెడీ షోకంటే దిగదుడుపు
- బిఆర్ఎస్ నేతలపై మెట్టు సాయికుమార్ ఘాటు విమర్శలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాక్ అసెంబ్లీ పేరుతో బిఆర్ఎస్ నేతలు కపట నాటకాలు, డ్రామాలు ప్రదర్శించారని తెలంగాణ మత్స్య అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఎద్దేవా చేశారు. ఆ కార్యక్రమాన్ని చూస్తే జబర్దస్త్ కామెడీ షో కూడా దిగదుడుపేనని వ్యాఖ్యానించారు. ఇకపై తెలంగాణ భవన్‌ను నాటకాలకు అద్దెకిచ్చి, 'ఇక్కడ నాటకాలు వేయబడును' అంటూ బోర్డు పెట్టుకోవాలని సూచించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, తలసాని తదితరులు ఆస్కార్ స్థాయి నటన ప్రదర్శించారని, వారికి 'గద్దర్ అవార్డులు' ఇవ్వాల్సిందేనని సాయికుమార్ వ్యంగ్యంగా అన్నారు. 'నవరస సార్వభౌమ', 'కళా ప్రపూర్ణ', 'కళా తపస్వి' వంటి బిరుదులు వారికి సరిపోతాయని పేర్కొన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీ సంప్రదాయాలను బిఆర్ఎస్ తుంగలో తొక్కిందని ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాలకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వని వారు ఇప్పుడు సభా సంస్కృతి గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ప్రజల చేతిలో ఓడిపోయినప్పటికీ బిఆర్ఎస్ నేతలు నంగనాచి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు.


**మాక్ అసెంబ్లీలో పాల్గొన్న వారంతా మాజీలే..**

బిఆర్ఎస్‌కు ఉన్న 35 మంది ఎమ్మెల్యేల్లో కొద్దిమంది మాత్రమే కెసిఆర్, కెటిఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని సాయికుమార్ అన్నారు. మాక్ అసెంబ్లీలో కేవలం కొద్దిమంది ఎమ్మెల్యేలే పాల్గొనడంపై ప్రశ్నలు లేవనెత్తారు. మాక్ అసెంబ్లీ సెట్‌లో నటించిన నేతలంతా వచ్చే ఎన్నికల్లో శాశ్వత మాజీలుగా మిగిలిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో ఆ మాక్ అసెంబ్లీ సెట్‌ను మరికొన్నేళ్లు అలాగే ఉంచుకోవాలని, ప్రజలు వారికి నిజమైన అసెంబ్లీ గేట్లు తెరిచే పరిస్థితి లేదని సాయికుమార్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

# కమ్యూనిస్టుల పురోగమనం తప్పదు

- జనరేషన్ జెడ్ చేస్తున్న డిమాండ్లు కమ్యూనిస్టులవే
- 'ప్రజాపక్షం'తో పువ్వాడ నాగేశ్వరరావు
- నేడు పువ్వాడ 89వ పుట్టినరోజు

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశంలో కమ్యూనిస్టుల పురోగమనం తప్పదని కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం లేదని సిపిఐ సీనియర్ నాయకులు, శాసనసభ, శాసన మండలి మాజీ సభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. పాలకులు ప్రజలను మరిచి పాలన సాగిస్తున్నారని తమ రాజకీయ అవసరాలు నెరవేర్చుకునేందుకు కొన్ని పథకాలను ప్రజలకు ఎరగా వేస్తున్నారని ఆయన ఆరోపించారు. కమ్యూనిస్టు ఉద్దండుడిగా సుదీర్ఘ కాలం ప్రజాప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పువ్వాడ నాగేశ్వరరావు సోమవారం 89వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. 88 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పువ్వాడ 70 సంవత్సరాల రాజకీయ జీవితాన్ని గడిపారు. ఉన్నత పాఠశాలలో చదువుతున్నప్పుడే సమస్యలపై ప్రశ్నించి ఆందోళనకారుడిగా ముద్రపడిన పువ్వాడ ఆ తర్వాత విద్యార్థి నాయకునిగా, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షునిగా పని చేశారు. 29 సంవత్సరాలకే భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా ఎన్నికైన పువ్వాడ అనేక రాజకీయ ఎత్తుపల్లాలను చూశారు. అధికార పార్టీ నేతలతో సానుకూలంగా ఉంటూ అభివృద్ధి పనులను మంజూరు చేయిస్తూనే మరో పక్క కమ్యూనిస్టు నేతగా అధికార పార్టీల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎడతెగని పోరాటం చేసే వారు. పువ్వాడ ఓ సమస్యను తీసుకున్నారంటే అది పరిష్కారం కావాల్సిందేనన్న భావన అప్పట్లో ఉండేది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పువ్వాడ తిరగని ప్రాంతం చూడని ఊరు, తన గొంతు విప్పని సమస్య లేదంటే అతిశయోక్తి కాదు. 1/70 సమస్య అయినా, పోడు సమస్య అయినా, గోదావరి జలాలైనా మరేదైనా ఆయన పోరాటం ద్వారానే పరిష్కారం చూపాలనే భావనతో పనిచేసే వారు. ఈ వయస్సులోనూ నిరంతరం సమాజాన్ని అధ్యయనం చేస్తున్న పువ్వాడ విపక్ష, అధికార పక్ష కదలికలను గమనిస్తున్న పువ్వాడ అధ్యయనాన్ని మాత్రం వదులుకోలేదు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలను సైతం గమనిస్తూ నిరంతరం సలహాలు ఇస్తున్న పువ్వాడ 88 సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రజాపక్షం ఖమ్మం ప్రతినిధి ఏనుగు వెంకటేశ్వరరావుతో అనేక విషయాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. కమ్యూనిస్టులు ఎన్నికల విషయంలో వెనకబడి ఉండవచ్చు. ఎన్నికలను డబ్బు, అధికారం, యంత్రాలు శాసిస్తున్న రోజుల్లో కమ్యూనిస్టులకు ఆశించిన గెలుపు దక్కడం లేదు. అంత మాత్రాన కమ్యూనిస్టుల పని అయిపోలేదు. రెండు దశాబ్దాలుగా కేంద్రం లో, రాష్ట్రంలో పాలన చూసిన ప్రజలు కమ్యూనిస్టుల గురించి ఆలోచించడంతో పాటు ఎర్ర జెండాల అవసరాన్ని గుర్తిస్తున్నారు. ఇప్పటికీ ఇప్పుడు సాధ్యం కాకపోవచ్చు కానీ కమ్యూనిస్టుల పురోగమనం తథ్యమని పువ్వాడ స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు బలహీనపడితే పేద, మధ్యతరగతి, కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.



**ఈ తరం డిమాండ్లు కమ్యూనిస్టులవే**

ప్రస్తుతం జనరేషన్ జెడ్ పేరుతో దేశంలో ఓ తరం ఆందోళన చేపట్టి పలు డిమాండ్లు ప్రభుత్వం ముందు ఉంచడం అభినందనీయమన్నారు. జనరేషన్ జెడ్ పేరుతో ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లు అన్ని కమ్యూనిస్టు పార్టీల డిమాండ్లేనని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, అవినీతి రహిత పాలన, అర్హులకు సంక్షేమం మొదలైనవి కమ్యూనిస్టుల డిమాండ్లేనని పువ్వాడ తెలిపారు. బలమైన ప్రజా పోరాటాలు ఉన్నప్పుడు ప్రజలకు అనుకూలమైన చట్టాలు రూపుదిద్దుకుంటాయని ఈ దేశంలో ప్రజా అనుకూల లేదా ప్రజా ప్రయోజన చట్టాలన్ని కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితమేనన్నారు. రాజకీయ అవినీతి అత్యంత ప్రమాదకరమని ఇది అన్ని వ్యవస్థలను ఛిద్రం చేస్తుందన్నారు. రాజకీయ పార్టీలు ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీలు స్వప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలన్నారు.

**మారిన పరిస్థితులకు అనుగుణంగా**

మారిన పరిస్థితులకు అనుగుణంగా మనము మారాలని ప్రతి మార్పును ప్రజలకు అనుకూలంగా మార్చగలిగినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కొంత కాలంగా అన్ని రంగాల్లోనూ విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఇవే మార్పులు కొన్ని రంగాలను కనుమరుగు చేశాయని కార్పొరేట్లు, సంపన్నులు తప్ప సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఇది అవాంఛనీయ పరిణామమన్నారు. సగటు మనిషి పురోభివృద్ధి లక్ష్యంగా మార్పు రావాలన్నారు. దేశ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావడం అత్యంత ప్రమాదకరమని ఇది దేశ అస్థిరతకు, అంతర్గత ఆందోళనలకు దారి తీస్తుందన్నారు. పాలకులే అక్రమ సంపాదనలకు ఆస్కారం ఇవ్వడం అత్యంత బాధాకరమని దీనిని కట్టడి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కమ్యూనిస్టులు సైతం మార్పులు అందిపుచ్చుకుని ప్రజా ఉద్యమాల తీరు మార్చుకున్నప్పుడు ఆశించిన ఫలితాలు దక్కుతాయన్నారు.

**కొరవడిన అంకిత భావం**

ఇప్పటి రాజకీయ నాయకుల్లో అంతకిభావం కొరవడిందని తన అవసరానుగుణంగా మసులు కోవడం ద్వారా ప్రజల విశ్వాసం పొందలేరని పువ్వాడ తెలిపారు. కార్యకర్తలను రక్షించుకోగలిగిన నాయకులు సుదీర్ఘ కాలం ప్రజా క్షేత్రంలో మనగలుగుతారని, ఏ ఎండకు ఆ గొడుగు పట్టే వారి గెలుపులు తాత్కాలికమేనని ఆయన అభిప్రాయ పడ్డారు. దేశంలో ఇప్పటికీ ఇప్పుడు మార్పు రాకపోవచ్చు కానీ మార్పు తథ్యమని ఆయన స్పష్టం చేశారు. యువత హక్కుల సాధన కోసం పోరు మార్గం ఎంచుకోవడం సరైనదే అన్నారు. మతం, కులం ఎన్నికల ఎజెండాలోకి రావడం దురదృష్టకర పరిణామమన్న పువ్వాడ ఆర్థిక అసమానతలు లేని, వివక్ష లేని సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షిస్తున్నానన్నారు. విలువలతో జీవించడం, ప్రజల మధ్య గడపడం, సమయపాలన పాటించడం ప్రజాప్రతినిధులు అలవర్చుకోవాలని ఆయన సూచించారు.

# 27న ఘనంగా ఎస్‌టియు 'ఎనభై వసంతాల వైభవోత్సవం'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) 80వ వార్షికోత్సవాన్ని ఈనెల 27న ఘనంగా నిర్వహించనున్నట్టు ఎస్‌టియు అధ్యక్షుడు జి.సదానందంగౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని నాగోల్ శుభం కన్వెన్షన్‌లో దాదాపు 10 వేల మంది ఉపాధ్యాయులతో 'ఎనభై వసంతాల వైభవోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులను కూడా ఆహ్వానించామన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌టియు కార్యాలయంలో 'ఎనభై వసంతాల వైభవోత్సవం' వాల్‌పేపర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సయ్యద్ సాబేర్ ఆలీ, నాయకులు ఎ.వి. సుధాకర్, దాసరి శ్రీధర్, రంగారావు, శంకర్, పోల్ రెడ్డి, పరమేశ, పున్నకుమార్‌లతోపాటు 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ గత ఎనిమిది దశాబ్దాలుగా ఉపాధ్యాయుల పక్షాన నిరంతరం పోరాడుతూ, అనేక సమస్యలకు పరిష్కారాలు సాధించిన ఘనత ఎస్‌టియుకు దక్కుతుందని, 1946లో నిజాం కాలంలో సంఘం ఏర్పడి, అంచలంచలుగా ఎదుగుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో తన వంతు పాత్రను పోషించిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వయస్సు 55 నుండి 58 సంవత్సరాలకు పెంపు, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, అప్రెంటీస్ రద్దు వంటి అనేక సౌకర్యాలను సాధించిన ఘనత ఎస్‌టియుదని వివరించారు. ఎస్‌టియు నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో పలువురు ముఖ్యమంత్రులు (నీలం సంజీవరెడ్డి, జలగం వెంగళ రావు, నారా చంద్రబాబు నాయుడు, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి) హాజరయ్యారన్నారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

## లోక్ అదాలత్‌లో 4475 కేసులు పరిష్కారం

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్ నందు న్యాయశాఖతో సమన్వయంగా పని చేసి సూర్యాపేట జిల్లా పోలీస్ పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 4475 కేసులను పరిష్కరించడం జరిగిందని సైబర్ మోసాలకు సంబంధించి 31 కేసుల్లో రూ.46లక్షల 81వేలను బాధితుల ఖాతాలో జమ చేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 851 క్రిమినల్ కేసులు, 1688 ఈపెట్టి కేసులు, 1936 డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. పోలీస్ శాఖ కోర్టులతో సమన్వయంగా పటిష్టంగా పనిచేయడం వల్ల ఈ కేసులు పరిష్కరించడం సాధ్యమైందని తెలిపారు. దీనికోసం ప్రణాళికతో పనిచేసి పరిష్కరించదగిన కేసులను ముందుగానే గుర్తించామన్నారు. అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, జిల్లా క్రైమ్ రికార్డు బ్యూరో సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో బాగా పనిచేసిన జిల్లా పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

**గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత**

గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి కె. నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సామరస్యానికి మనం పాటుపడాలి, సోదరభావంతో అందరూ కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. గణేష్ మండపాల నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని, డిజెలకు, బాణాసంచాకు అనుమతి లేదన్నారు.
ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

## తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని రోటిగడ్డ తాండా గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు ఆ గ్రాస్తులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. 600 జనాభా కలిగిన రోటిగడ్డ గ్రామంలో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు ఎమ్మెల్సీకి విన్నవించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల గతంలో ఉన్న బోరు బావులు ఎండిపోయాయని, ప్రస్తుతం కొత్త బోర్లు, మోటార్లు మంజూరు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. కృష్ణ తాగునీరు కూడా గ్రామానికి సరఫర కావడం లేదని దీంతో సమస్య మరింత తీవ్రంగా పెరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సత్యం స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కొత్త బోర్లు , మోటర్లు మంజూరు చేయించి తాగునీటి సమస్య ను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మనుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావ్, కార్యవర్గ సభ్యులు మల్లోజు శేఖరచారి, ఏఐవైఎఫ్ మండల కోశాధికారి ఎన్ కృష్ణ, గమ్య, పాపాలి, పద్మ, రవీందర్ పాల్గొన్నారు.

## సాగర్‌లో ప్రముఖుల సందడి



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు సందర్శించారు. సీఆర్‌పీఎఫ్ సౌత్ జోన్ డీఐజీ సతీష్ కుమార్ లిండా,తెలంగాణ రాష్ట్ర పోలీస్ విజిలెన్స్ ఎస్పీ బాలస్వామిలు వేర్వేరుగా సాగర్‌కు విచ్చేసి, నాగార్జునకొండ సందర్శన అనంతరం బుద్ధవనాన్ని సందర్శించారు.సందర్శనలో భాగంగా వారు బుద్ధవనంలోని బుద్ధచరిత వనం, ధ్యానవనం, స్థూపవనంలను సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు.అనంతరం మహాస్తూపంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం ప్రాశస్తం, చారిత్రక విశిష్టతలను తెలియజేసే లఘుచిత్రాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధుని విగ్రహం వద్ద ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన మరియు ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్రలు ప్రముఖులతో బుద్ధజ్యోతులను వెలిగింపజేశారు.అనంతరం బుద్ధవనం కండువాలు, బ్రోచర్లతో వారిని ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా, అమలాపురం ఆదుర్రు బౌద్ధ విహారం నుంచి 40 మంది బౌద్ధ ఉపాసకులు కూడా బుద్ధవనాన్ని సందర్శించారు. వర్షావాస కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం బుద్ధవనంలో ఆవాసం ఉంటున్న థాయిలాండ్, కంబోడియా దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులకు వారు భోజన దానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో పాలకవర్గాలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గానికి ప్రత్యక్షంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని చౌటుప్పల్ సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చౌటుప్పల్ సింగిల్‌విండో కార్యాలయంలో ఆదివారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘాల 1964 చట్టం ప్రకారం సహకార సంఘాలు స్వయంప్రతిపత్తి సంఘాలుగా స్వంత నిధులతో కార్యాకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు.స్వయంగా నడుపుకునే సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ చేస్తూ పాలకవర్గాన్ని నియమించడం ఆక్షేపనీయమని అన్నారు.ఈ విధానం సరికాదని పాలకవర్గ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని జైకేసారం గ్రామంలో సర్వేనెంబర్178లో కలెక్టర్ కేటాయించిన 314ఎకరాల భూమిలో గోదాం నిర్మించాలని,మండలంలో దీర్ఘకాలిక రుణాల కోసం రూ.1.50 కోట్లకు దరఖాస్తు చేసుకున్న వారికి రుణాలు ఇవ్వాలని,మార్ట్‌గేజ్ రుణాలను ఎకరాకు రూ.3లక్షల నుండి రూ.5లక్షలకు పెంచి 5 ఎకరాల వరకు రుణాలు ఇవ్వాలని,చౌటుప్పల్‌లో ఉన్న గోదాం బిల్డింగ్‌పైన చైర్మన్ ఆఫీస్‌తో పాటు సమావేశ హాల్ నిర్మించాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు గుండెబోయిన రూపమ్మ, దూర్క కృష్ణ, వెంకటయ్య,డి.శ్రీశైలం,బాతరాజు సాయిలు, దుబ్బాక శశిధర్ రెడ్డి,సూర, డి.బాలరాజు, కార్యదర్శి ఎరుకల రమేష్ పాల్గొన్నారు.



# నోరు జారితే 'ఖబడ్దార్'

### ప్రతిపక్షాలకు మంత్రి ఉత్తమ్ హెచ్చరిక
### రైతులు ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలి
### యువతకు ఉద్యోగావకాశాలే లక్ష్యం
### 300 కంపెనీలు, 25వేల ఉద్యోగాలు
### 19న కోదాడలో 'మెగా జాబ్‌మేళా'



**ప్రజాపక్షం/కోదాడ:** సమాజంలో మాట్లాడే హక్కు ఉందని, ఇష్టానుసారంగా నోరు జారితే బాగోదని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రతిపక్షాలను హెచ్చరించారు. ఆదివారం కోదాడ పట్టణంలోని సిసిరెడ్డి కాన్వెంట్లో జాబ్‌మేళా స్థలాన్ని పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడారు. బాధ్యతారహిత్యంగా మాట్లాడటం సరికాదని, ప్రజా సమస్యలపై వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతాంగానికి ఆశించిన స్థాయిలో నీటిని అందించలేకపోతున్నా పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటితో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. రైతుల పరిస్థితిని గమనించి భవిష్యత్‌లో ఆరుతడి పంటలు సాగు చేసుకునేలా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజల కోసమే మా జీవితాలు తాను, తన భార్య ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తమ జీవితాలను ప్రజలకే అంకితం చేశామని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ప్రజల అవసరాలు, ప్రాంత అభివృద్ధి, యువత భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని పని చేస్తున్నామని తెలిపారు. 25వేల ఉద్యోగాలే లక్ష్యం కోదాడలో ఈనెల 19న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళా విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 కంపెనీలు పాల్గొన్నానున్నాయని, దాదాపు 25వేల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

**విస్తృత ప్రచారం చేయాలి**

జాబ్‌మేళాలో ప్రతి ఒక్క యువతి, యువకుడు పాల్గొనేలా అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరు జాబ్‌మేళా వివరాలను నిరుద్యోగులకు చేరవేయాలని సూచించారు. మండల, గ్రామస్థాయిలోనూ యువత సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ప్రతి ఒక్కరికి ఈ అవకాశాన్ని చేరువ చేయాలని అన్నారు. కార్యకర్తలు, అధికారులు సమన్వయంతోఓ పనిచేసి యువతలో అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. కోదాడ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకరావడమే లక్ష్యంగా ఈ మెగా జాబ్ మేళాను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

## భారతీయ సంస్కృతి, కళలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు ఇస్కఫ్ కృషి

**ఇస్కఫ్ నల్లగొండ జిల్లా మహాసభలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కడారు ప్రభాకర్‌రావు**




**ప్రజాపక్షం/నల్లగొండ :** భారతీయ సంస్కృతి, కళలు,సాంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు భారత సాంస్కృతిక సహకార, స్నేహ సంఘం (ఇస్కఫ్) నిరంతరం కృషి చేస్తోందని ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు అన్నారు. దేశ సమైక్యత,సమగ్రతతో పాటు ప్రపంచ శాంతి,స్నేహ సంబంధాల బలోపేతానికి ఇస్కఫ్ గత 80 ఏళ్లుగా కృషి చేస్తోందని తెలిపారు.ఆదివారం నల్లగొండలోని ఐఎంఏ హాల్‌లో డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు అధ్యక్షతన నిర్వహించిన ఇస్కఫ్ నల్లగొండ జిల్లా మహాసభకు కడారు ప్రభాకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ దేశాల సమావేశంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల కోసం అంతర్జాతీయ వేదికలపై ప్రశ్నలు లేవనెత్తడాన్ని ఆయన అభినందించారు.అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్),ప్రపంచ బ్యాంకులో అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ప్రాతినిధ్యం,ప్రాధాన్యత కల్పించాలని కోరారు.అంతర్జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాద,ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య, శాంతి ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు సంబంధించిన అంశంలో అమెరికా వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు.ప్రపంచ దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తూ సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఐఎల్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు,ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా యుద్ధ చర్యలను తీవ్రంగా ఖండించారు.ప్రపంచ శాంతి,అలీన ఉద్యమ బలోపేతం,పాలస్తీనా సమస్యతో పాటు అంతర్జాతీయ వివాదాల పరిష్కారం కోసం ఇస్కఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. ఈ మహాసభలో ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.దుర్గాప్రసాద్,ఉపాధ్యక్షులు కారింగు భిక్షమయ్య,కరీం, కోశాధికారి అవ్వ విజయలక్ష్మి, న్యాయవాదులు మునగాల నారాయణరావు,గుండె వెంకటేశ్వర్లు,కట్ట అనంతరెడ్డి,కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం, ఐఎంఏ పట్టణ అధ్యక్షులు ఆర్.రమేష్ పాల్గొన్నారు.

**ఇస్కఫ్ నల్లగొండ జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

అనంతరం ఇస్కఫ్ నల్లగొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా గౌరవాధ్యక్షులుగా ప్రముఖ న్యాయవాది మల్లెపల్లి ఆదిరెడ్డి, అధ్యక్షులుగా డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా కస్తాల సర్పంచ్ ఎల్. సత్యం,కోశాధికారిగా బి.రామలింగం తో పాటు మొత్తం 35 మందితో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## పల్లా నర్సింహారెడ్డిని పరామర్శించిన సిపిఐ సీనియర్ నాయకులు

**ప్రజాపక్షం/దేవరకొండ:** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్‌రెడ్డి మృతికి సంతాపంగా స్వగ్రామం పడమటిపల్లిలో ఆదివారం సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అన్ని విధాలుగా సహకారం అందిస్తుందన్నారు. నివాళులర్పించిన వారిలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు బి. వెంకటేశం, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఇమ్రాన్, సిపిఐ జిల్లా క్యావర్గ సభ్యులు బుచ్చిరెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిషన్, నాయకులు రంగారెడ్డి, గోవర్ధన్, యాదయ్య, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



## రేవెల్లిలో మహిళలు,యువత సిపిఐలో చేరికలు

### పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం సిపిఐ పోరాటం :ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
### పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానం

**ప్రజాపక్షం/నాంపల్లి:** పేదలు,అణగారిన వర్గాల సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరాటం చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. రేవెల్లి గ్రామంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సమక్షంలో మహిళలు,యువత పెద్ద సంఖ్యలో సిపిఐలో చేరారు.వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.అదేవిధంగా తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పలువురు ప్రజలు కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం నాటి నుంచి నేటి వరకు ఎర్రజెండా నాయకత్వంలో అనేక పోరాటాలు జరిగాయని తెలిపారు.ఎర్రజెండా అంటేనే నీతి, నిజాయితీ,త్యాగానికి నిలువెత్తు రూపమని ఆయన అన్నారు. సిపిఐ నిర్వహించిన ప్రజా ఉద్యమాలను గుర్తించి పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.నూతనంగా చేరిన కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు,గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యచారి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, మండల కార్యదర్శి సుద్దనబోయిన రమేష్,సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,ప్రజానాట్యమండలి అధ్యక్షులు బి. జగన్,కలకొండ సంజీవ,కోరి సత్తయ్య,ఉరిపాక వెంకటయ్య,నేరెళ్ల సైదులు,దండిగ వెంకటయ్య,పల్లె సైదులు,వెంకటాచారి,బుషిపాక యాదయ్య,రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను, ఉపసర్పంచ్ వంగూరి సాయిలు,సత్తిరెడ్డి,గిరిస్వామి,సైదమ్మ, కొనిరెడ్డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




## చౌటుప్పల్‌లో వర్ష బీభత్సం

### పట్టణంలో పలు కాలనీలు జలమయం
### ఇండ్లలోకి చేరిన వరదనీరు
### కాలనీలను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని







**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షపు నీరుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లోని వాగుల్లో వరద నీరు భారీగా వచ్చింది. దీంతో కుంటలు,చిన్నపాటి చెరువులు నిండా యి. మండలంలోని ఆరెగూడెం, కాట్రెవు, నేలపట్ల,కుంట్లగూడెం గ్రామాలతో పాటు ఎనగంటి తండా,పిపల్‌పహడ్ గ్రామాల్లోని వాగులు పొంగిపోర్లాయి.నేలపట్లవర్కట్‌పల్లి గ్రామాల మధ్య ఉదయం కొద్దిసేపు రాకపోకలు నిలిచాయి.

**నిండిన కుంటలు,చెరువులు.......**

మండలంలోని ఆరెగూడెం,నేలపట్ల,కుంట్లగూడెం,రెడ్డిబాయి గ్రామాల్లోని కుంటలు నిండిపోయాయి. డి.నాగారం, దండుమల్కాపురం,లక్కారం, చౌటుప్పల్, తంగడిపల్లి చెరువుల్లోకి నీరు వచ్చి చెరుతుంది.ఈ ఏడాది సరైన వర్షాలు కురవక రైతులు,ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఈ సమయంలో శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షంతో పంటపోలాలకు నీరు అవసరం సమృద్ధిగా లభించింది.ఎండిపోతున్న ప్రత్తి చేనులకు వర్షంతో నీరు అందిింది.దీంతో రైతులకు కొంతమేరకు ఉపశమనం కలిగింది. భారీ వర్షం వల్ల చౌటుప్పల్ పట్టణంలోని శాంతినగర్, వినాయక నగర్,రాంనగర్‌తో పాటు పలు కాలనీలు జలమయమైయ్యాయి. పట్టణంలోని 12వ వార్డులోని ఇండ్లలోకి నీరు చేరింది. కూరగాయల మార్కెట్‌లోకి నీరు రావడం వల్ల కూరగాయాలు నీళ్ళలో మునిగిపోయాయి. వలిగొండ రోడ్డు,తంగడిపల్లి రోడ్డులో నీరు రోడ్డుపై వచ్చి చెరింది.నాగులకుంటకు భారీగా ఆయా కాలనీల నీరు రావడంతో కుంట నిండిపోయి ఉప్పోంగడంతో నీరు రోడ్ల పైకి వచ్చింది. దీంతో వాహనదారులు,ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.జలమయమైన కాలనీలను చౌటుప్పల్ మునిసిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు.కాలనీల రోడ్లపై నిలిచిన నీరును పోయే విధంగా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ సిబ్బందిని ఆదేశించారు.



## అమరవీరుల ఆశయాల సాధన కోసం, పోరాటాలకు పునరంకిత మవుదాం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాల సాధన కోసం మనందరం పునరంకితం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా ఆదివారం మండలంలోని రంగాపురం గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోదులు పోటు ఎర్రమ్మ, రాఘవయ్య స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం రజాకార్లు, భూస్వాములకు, దేశ్‌ముఖ్‌లు, దొరలకు వ్యతిరేకంగా తుపాకులను చేతపట్టి పోరాట చేసి లక్షలాది ఎకరాల భూములను పేదలకు పంచిపెట్టి వేలాది గ్రామాలను విముక్తి చేసి, ప్రజలను వెట్టిచాకిరి నుండి విముక్తి చేయటానికి తెగించి పోరాడి వేలాది మంది అమరవీరుల అమరుల చరిత్ర సిపిఐ పార్టీ అని వారి వారసులుగా మనం కూడా నేడు సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై పోరాటాలను నిర్వహించి, వారి ఆశయ సాధన కోసం మనందరం పని చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,పోటు సక్కుబాయమ్మ, పోకల వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, త్రిపురం సుధాకర్ రెడ్డి, బిల్లా కనకయ్య, ఎడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, రంగాపురం సర్పంచ్ కట్టా కళ్యాణి, కుంభం వెంకటి, పగడాల శ్రీనివాస్, బాలశౌరి, నవీన్‌చారి, వెంకన్న పాల్గొన్నారు.

## సాగర్ ఆయకట్టు కింద పూర్తిగా నాట్లు వేయండి

### నీళ్ల కోసం పేగులు తెగేదాకా కొట్లాడుతాం: మాజీ మంత్రి




**ప్రజాపక్షం/నల్లగొండ:** సాగర్ ఆయకట్టు కింద రైతులు పూర్తి స్థాయిలో నాట్లు వేసుకోవాలని,నీళ్ల కోసం పేగులు తెగేదాకా కొట్లాడుతామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు.నల్లగొండ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు.సాగర్ ఆయకట్టు కింద పంటలకు నీళ్లు ఇచ్చి తీరాలని,ఎడమ కాల్వ,వరద కాల్వ, ఏఎంఆర్‌పిలో లెవల్,ఎస్‌ఎల్‌బిసీ కింద మొత్తం ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు.నీళ్లు ఇవ్వకపోతే బరాబర్ కొట్లాడుతామని,ఎలా ఇవ్వరో చూస్తామని, ఈ ప్రభుత్వం అంతు చూస్తామని హెచ్చరించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ లో 200 టీఎంసీల నీళ్లు ఉన్నాయని,ఆనీళ్లు మనవే, మన హక్కు అని,ఆనీళ్లను మాకు ఇవ్వాలని అన్నారు.కేసీఆర్,కేటీఆర్ నాయకత్వంలో ఎంత వరకైనా కొట్లాడుతామన్నారు.ఆంధ్ర నీటి దోపిడీపై ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కేఆర్‌ఎంబీకి ఒక్క లేఖ కూడా రాయలేదని, ప్రభుత్వానికి ఎలాంటి బాధ్యత లేదని విమర్శించారు.వెలిగొండ ప్రాజెక్టు,పోతిరెడ్డిపాడు ద్వారా జరుగుతున్న నీటి దోపిడీని అరికట్టాలని కేఆర్‌ఎంబీకి లేఖ రాయాలని డిమాండ్ చేశారు.భూ భారతి పేరుతో భూములను కొల్లగొడుతున్నారని, కోటికి పైగా ఎకరాలను బ్లాక్‌లో పెట్టి 22ఏ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ముఖ్యమంత్రి, మంత్రులు దోచుకునే పనిలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఈ ప్రెస్ మీట్ లో ఎమ్మెల్సీ ఎం.సి.కోటిరెడ్డి,మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి,పార్టీ నేతలు రెగట్టే మల్లికార్జున రెడ్డి,సింగం రాంమోహన్,నిరంజన్ వలీ,నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్,పల్ రెడ్డి రవీందర్ రెడ్డి,మారగోని భవాని గణేష్,పెఠిక యాదయ్య దొడ్డి రమేష్,జమాల్ ఖాద్రి,రావుల శ్రీనివాసరెడ్డి,,కన్నారావు,కాసం శేఖర్,గుండెబోయిన జంగయ్య, గంజి రాజేందర్ తదితరులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని 2వ వార్డు కోమటికుంటలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కొత్త బోరు మోటార్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తమ శక్తి మేరకు కృషి చేస్తున్నామన్నారు. కోమటికుంటలో ఇప్పటికే మూడు బోర్లు ఉన్నప్పటికి ప్రజ అవసరాల దృష్ట్యా మరో బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త బోరు ద్వారా వచ్చే నీటిని 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకుకు అనుసంధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తన్వీర్ హుస్సేన్, కౌన్సిలర్లు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కొండపల్లి దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.





## పేదలకు వైద్య భరోసా... ఆపన్నులకు అండగా ప్రజా ప్రభుత్వం

### మక్తల్ క్యాంపు కార్యాలయంలో 229 మంది లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని మంత్రి వాకిటి శ్రీహరి క్యాంపు కార్యాలయంలో 229 మంది లబ్ధిదారులకు 88 లక్షల 97 వేల 890 రూపాయల సిఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయనిధి) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అనారోగ్యంతో చికిత్స పొందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఖరీదైన వైద్య చికిత్సల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తూ వారికి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అందించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు.



## మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మున్సిపాల్ కార్యాలయంలో ఆదివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా 450 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన సాంప్రదాయ వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించాలని, గణేష్ నవరాత్రులను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఅప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆగమన కార్యక్రమం

**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకరవ్గంలోని పట్లూర్ గ్రామంలో బాల వినాయక 10 వ వార్షికోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు ఆగమన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నరులు భారతనాట్యం తో గ్రామస్తులను ఆకర్శితులను చేశారు. అనంతరం చిన్నరులకు బహుమతులు శలువలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు యువతి యువకులు పెద్దత్తున పాల్గోన్నారు.

## మట్టి వినాయకులనే పూజిద్దాం

### మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

**ప్రజాపక్షం/పరిగి:** మట్టి వినాయకులనే పూజి ద్దాం అని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. పోస్టఆఫీస్ సమీపంలో గల దాసాంజనేయ స్వా మి ఆలయంలో మట్టి వినాయకుల విగ్రహాలను పంఫిణి చేశారు. ఈకార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పార్థసారది పంతులు , పట్టణ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి , కౌన్సిలర్లు లక్ష్మీ చంద్రయ్య, నాయకులు ఘనేమునశ్రీనివాస్ , ఘర్కని బాలు ,రాజేందర్,సురేఖ రెడ్డి , నివాస్‌చారి ,గణేష్ ,వంశీ ,శ్రీకాంత్ తదితరులు పాల్గోన్నారు.




## 'ముత్తూట్' భారీ వితరణ

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** ఖైరతాబాద్ మహా గణపతి మహోత్సవాలకు హిమాయత్‌నగర్‌కు చెందిన ముత్తూట్ ఫైనాన్స్ వారు భక్తుల సౌకర్యార్థం భద్రత ఏర్పాట్లకు సంబంధించి భారీ వితరణ చేశారు. ముత్తూట్ సంస్థ సామాజిక సేవా, బాధ్యత కార్యక్రమాలలో భాగంగా సిఐ సైదిరెడ్డి సమక్షంలో 30 ట్రాఫిక్ బారికేడ్లు, 70 డైరెక్షన్ బోర్డులను సైఫాబాద్ ట్రాఫిక్ ఎసిపి మోహన్‌కుమార్‌కు ఆదివారం హైదరాబాద్ 2 ఆర్ఎం సత్య నారాయణ అందజేశారు. ఎసిపి మోహన్ కుమార్ మాట్లాడుతూ లక్షల మంది భక్తుల సౌకర్యార్థం సహాయం చేసిన ముథూట్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాల ముత్తూట్ మేనేజర్‌లు లక్ష్మి నారాయణ, అవినాశ్, హేమంత్ రెడ్డి, ఫణీంద్ర, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## గణేష్ ఉత్సవ సమితి పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ సందీప్ కిరణ్ కప్పెర ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎఎస్ భాస్కర్ గిరి ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రవిప్రసాద్ గౌడ్, సురేష్ ముదిరాజ్, అజయ్ నాయుడు, జ్ఞానేశ్వర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

### రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ



**ప్రజాపక్షం/జడ్చర్ల :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార దినాల సందర్భంగా జడ్చర్ల నియోజకవర్గం ఇఆర్ఒ, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ ఆదివారం బాలానగర్ మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రచార దినాల్లో చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, స్వీకరిస్తున్న దరఖాస్తులు, అభ్యంతరాలు, అలాగే నోటీసు విచారణలు, డిస్క్రెపెన్సీలు, మ్యాపింగ్‌కాని దరఖాస్తులకు సంబంధించి చేపడుతున్న తదుపరి చర్యలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్దాయిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు నెంబర్ 82,83 కేతిరెడ్డిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు నెంబర్ 104,105 లను రెవెన్యూ అదనపు కలెక్టర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న రికార్డులు, దరఖాస్తులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి, సవరణ ప్రక్రియలో చేపడుతున్న చర్యలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా నోటీసు విచారణ డిస్క్రెపెన్సీలు, మ్యాపింగ్ కాని దరఖాస్తులు తదితర అంశాలను సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఆమె ప్రత్యేకంగా పరిశీలించారు. ఆయా అంశాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా తదుపరి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపులు, చిరునామా తదితర వివరాల సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిబంధనల ప్రకారం పారదర్శకంగా విధులు నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరిస్తున్న దరఖాస్తులు, అభ్యంతరాలను నిర్ణీత విధానంలో క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. అర్హత కలిగిన ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితాలో నమోదయ్యే ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని, సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత ఎంపిడిఒ, సీనియర అసిస్టెంట్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, పంచాయతీ కార్యదర్శి, బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# బండ తిరుపతయ్యస్వామి ఆలయ పునర్నిర్మాణం



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో అత్యంత ప్రాచీనమైన పవిత్ర క్షేత్రంగా స్వయంభూ శ్రీ బండ తిరుమలయ్య స్వామి దేవాలయం పునర్నిర్మాణంతో హోమాలు, అహుతి, ప్రత్యేక పూజలు శనివారం వేద పండితుడు రాఘవేంద్ర చారి, కౌశిక్ జోషి, ఆనంద తీర్థ, శ్యామ సుందరా చారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారు బండపై స్వయంభూ స్వరూపంగా వెలసిందున స్వామిని భక్తులు ప్రేమతో బండ తిరుమలయ్య స్వామి అని పిలుస్తారని భక్తుల ప్రతీతి. ఒకప్పుడు ఆలయం అత్యంత వైభవంగా వెలుగొందిన బండ తిరుమలయ్య దేవాలయం శిథిలావస్థకు చేరుకుని, దానికి తోడు సంగంబండ రిజర్వాయర్ ఏర్పడినప్పుడు మక్తల్ పట్టణం వేల్పన భీమా అంతర్భాగం ఫేజ్44 సంప్ హౌస్ నిర్మాణం కోసం బ్లాస్టింగ్ చేయగా, కొద్ది దూరంలో ఉన్న దేవాలయానికి పగుళ్లు ఏర్పడి శిథాలావస్థకు చేరుకుంది. ఆలయాన్ని పునర్నిర్మాణం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను, అధికారులను పట్టణ ప్రజలు, భక్తులు ఒత్తిడి చేసినా ఫలితం లేకపోవడంతో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లోనే ఆలయంలో పూజారులు నిత్య పూజలు నిర్వహించే వారు. ఆలయ దుస్థితిని మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి భక్తులు తీసుకెళ్లగా, సోదరుడు వాకిటి శేషగిరి పర్యవేక్షణలో ఈ దేవాలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చట్టడం జరిగింది. ఆలయ పునర్మిర్మాణంతో బండ తిరుమలయ్య స్వామి ఆలయానికి తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకురావడం కోసం రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి, శనివారం ఉదయం నుంచి అభిషేకాలు, హోమాలు, ఆహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, పట్టణ మాజీ ఉపసర్పంచ్ వాకిటి శేషగిరి దంపతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ మానస దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సురేష్ గుప్తా, మాజీ ఎంపిటిసి కోళ వెంకటేష్, ప్రస్తుతం మున్సిపల్ కౌన్సిలర్లు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.



## కల్వకుర్తిలో నూతన ఎలక్ట్రీషియన్ కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాలిటీ, మండల ఎలక్ట్రీషియన్ల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవర్ల పర్వతాలు, ఉపాధ్యక్షుడిగా రషీద్ ఖాన్, గౌరవ అధ్యక్షుడిగా ఉస్మాన్, ప్రధాన కార్యదర్శులుగా ఎం.డి.ఇంతియాజ్, గజ్జ ఆంజనేయులుగౌడ్, కోశాధికారిగా సాయిలు, సహాయ కార్యదర్శులుగా పి.మల్లేశం, అబుబకర్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా జమీల్, ఇమ్రాన్ ఖాన్, శాంతయ్య, రమేష్, ముఖ్య సలహాదారులుగా గన్నోజు బాబిదేవ్, ఎం.డి.అశ్ఫాక్, నాని యాదవ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు పాత కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి పట్టణ, మండలానికి చెందిన ఎలక్ట్రీషియన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబానికి ఉప్పల వెంకటేష్ ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మండల పంజుగుల గ్రామానికి చెందిన హెచ్.గోపాల్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్పందించి మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకుడు దారమోని గణేష్, మాజీ వార్డు సభ్యులు రోడ్డ ప్రభాకర్, మహ్మద్ ఖాజా, పెద్దరాజు చంద్రయ్య, రామస్వామి, రొడ్డ ఎలిశా, మండ హెచ్ చంద్రయ్య, ఆంధ్రయ్య, అంజయ్య, సాయిలు, మొగులయ్యతో పాటు గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు దళిత సమాజంపై దాడి

### డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము భరత్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు స్పీకర్‌పై దాడి చేయడమే కాకుండా దళిత సమాజాన్ని అవమానించడమేనని డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ము భరత్ అన్నారు. తాడూరు మండల కేంద్రంలోని శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలోకి వెళ్లేందుకు నిరసన పేరుతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుచితంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అసభ్యకరమైన భాషలో దూషించడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీలో అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌ను దూషించిన వ్యక్తి చట్ట సభల్లో కొనసాగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే ఆయన సభ్యత్వాన్ని రద్దు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత స్పీకర్‌ను దుర్భాషలాడటమే కాకుండా ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లు కెసిఆర్‌ను కలిసేందుకు వెళ్లిన దళితులు నిలిచిన ప్రదేశాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దుర్మార్గమైన చర్య అని, ఇది దళిత సమాజాన్ని అవమానించడమేనని భరత్ అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక, దళిత సమాజ వ్యతిరేక చర్యలకు పాల్పడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.



## ప్రతిభకు పట్టం నరక్క విష్ణుకు ఘన సత్కారం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి బొమ్మల పల్లకి వీడియోగ్రఫీ పోటీల్లో ద్వితీయ బహుమతితో ప్రతిభా పురస్కారం అందుకున్న మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన నరక్క విష్ణును సాహితీ కళావేదిక ప్రతినిధులు ఆదివారం ఘనంగా సన్మానించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని రేడియంట్ హైస్కూల్ ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీరంగాపురంపై నరక్క విష్ణు రూపొందించిన లఘు డాక్యుమెంటరీ రాష్ట్రస్థాయి పోటీల్లో అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఆయన ప్రతిభను గుర్తించి ప్రశంసాపత్రంతో పాటు శాలువా, రూ.6వేల నగదు పారితోషికంతో సత్కరించినట్లు తెలిపారు. జిల్లాలో అనేక చారిత్రక, ప్రాచీన కట్టడాలు, విశిష్ట ప్రదేశాలు ఉన్నాయని, వాటి విశిష్టతను ప్రజలకు పరిచయం చేసి వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. యువత తమ సృజనాత్మకతను వినియోగించి చారిత్రక, సాంస్కృతిక అంశాలను డాక్యుమెంటరీలు, వీడియోగ్రఫీ ద్వారా ప్రజలకు చేరువచేయాలని పిలుపునిచ్చారు. ప్రతిభను గుర్తించి అందించే అవార్డులు వ్యక్తుల్లో మరింత ఉత్సాహాన్ని, సృతజనాత్మకతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పలుస శేఖర్‌గౌడ్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం జిల్లా కన్వీనర్ డా.బైరోజు శ్యాంసుందర్, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, డా.కంటే నిరంజనయ్య, బండారు శ్రీనివాస్, డా.తూర్పింటి నరేశ్ కుమార్, పేరుమాళ్ల శ్రీనివాస్, డా.తూర్పింటి నరేశ్ కుమార్, పేరుమాళ్ల శ్రీనివాస్, దేశీ రాములు, యాదవ్ దినేశ్ పాల్గొన్నారు.

## మోటార్ చోరీ

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** తూముకుంట గ్రామానికి చెందిన రైతు చెట్ల రాజుకు చెందిన 7.5హెచ్‌పి పంప్‌సెట్ మోటార్ చోరీకి గురైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని జురాల కాల్వ వద్ద వ్యవసాయ అవసరాల కోసం ఇటీవల మోటార్‌ను బిగించినట్లు రైతు రాజు తెలిపారు. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు మోటార్‌ను అపహరించుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై రైతు రాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించి మోటార్ చోరీపై విచారణ చేపట్టినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. రైతుల పొలాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## గంగా జమునా తెహజీబ్



**ప్రజాపక్షం/చార్మినార్ :** మతాలు వేరైనా తామంతా కలిసి జీవిస్తామని ఇద్దరు స్నేహితులు మరోమారు నిరూపించారు. ఈ మేరకు వినాయకచవితిని పురస్కరించుకుని ఆదివారం పాతబస్తీకి చెందిన మొహ్మద్ ఫజల్ అనే ముస్లిం తన స్నేహితుడైన ప్రకాష్ ముదిరాజ్‌కు వినాయక ప్రతిమ అందించాడు. పండుగలకు కుల, మతాలు అడ్డుకాదని తమ స్నేహం ద్వారా చాటిచెప్పిన వారిని స్నేహితులు, స్థానికులు ప్రశంసిస్తున్నారు.

## ఘనంగా గాంధీ వైద్య కళాశాల 72వ వ్యవస్థాపక దినోత్సవం




**ప్రజాపక్షం/సికింద్రాబాద్ :** వైద్యరంగంలో ఎంతోమంది నిపుణులను తీర్చిదిద్ది, ప్రజారోగ్య రక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న ప్రతిష్ఠాత్మక గాంధీ మెడికల్ కాలేజ్ 72వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. గాంధీ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జిఆర్.లింగమూర్తి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎవి.రత్నంల అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆలుమ్ని అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ డి.రాజారెడ్డి, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఇందిర, గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తోట ఉషారాణి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. గాంధీ వైద్య కళాశాల దశాబ్దాలుగా పేద ప్రజలకు విశిష్ట వైద్య సేవలు అందిస్తూనే, అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచిన వైద్యులను సమాజానికి అందించిందని కొనియాడారు.

# 24 గంటల్లో ముగ్గురు మృతి

- పని ఒత్తిడి కారణంగానే మరణాలు
- బాధితులకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- అరెస్టులు, పోలీసుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం
- తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** 24 గంటల వ్యవధిలో ముగ్గురు ఔట్‌సోర్సింగ్ బిల్లింగ్ ఉద్యోగులు మృతిచెందడంతో జలమండలిలో కలకలం మొదలయ్యింది. మృతుడి ఇంటి వద్ద జరిగిన ఘర్షణ వాతావరణంలో జలమండలి ఉద్యోగ సంఘాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. ఫతేనగర్‌లోని మృతిచెందిన మీటర్‌రీడర్ కిరణ్ ముదిరాజ్ ఇంటి వద్ద కుటుంబ సభ్యులు ఆవేదనలో ఉంటే.. పోలీసులు ఆందోళనకారుల పట్ల కర్కషంగా మానవత్వం లేకుండా వ్యవహరించడం ఏమిటని తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్, జలమండలి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, పులి లక్ష్మయ్య, తెలంగాణ ఉద్యమ కారుడు పృథ్వీరాజ్, జలమండలి ఉద్యోగ నాయకులు బాలకృష్ణారెడ్డి, సురేష్ గౌడ్, విక్రమ్, ఉపేందర్ నాయకుల అరెస్టు పట్ల జెఏసి తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా పులి లక్ష్మయ్య, పృథ్వీరాజ్, బాలకృష్ణారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. జలమండలిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితులు రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నాయని వాపోయారు. ఉద్యోగ భద్రత లేకుండా తీవ్రమైన పని ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై ప్రభుత్వం, జలమండలి యాజమాన్యం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కేవలం 24 గంటల వ్యవధిలో ముగ్గురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మృతి చెందడం అత్యంత విషాదకరమైన, ఆందోళన కలిగించే ఘటన అని జేఏసీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల మృతులు సంభవిస్తున్న నేపథ్యంలో వారి కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, జలమండలిలో పనిచేస్తున్న వేలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పని పరిస్థితులు, ఉద్యోగ భద్రత, జీతాల చెల్లింపులు, పని ఒత్తిడి తదితర అంశాలపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన శ్రీహరి, పెద్దాపూర్‌కు చెందిన వినయ్ మృతి చెందడం.. వారి అంత్యక్రియలు పూర్తికాకముందే కుత్బుల్లాపూర్‌లో పనిచేస్తున్న కిరణ్ గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదకరమని జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని జలమండలి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర చర్యలకు కార్యాచరణ రూపొందించాలని వారు డిమాండ్ చేశారు.

## అట్టహాసంగా ఖ్యాతి' కూచిపూడి రంగప్రవేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ నాట్య గురువు బొంపల్లి సుధీర్‌రావు శిష్యురాలు ఖ్యాతి పుట్ట కూచిపూడి రంగ ప్రవేశం అట్టహాసంగా జరిగింది. హైదరాబాద్ మాదాపూర్ శిల్పకళా వేదికలో సద్గురు శ్రీ శివానంద నృత్యమాల అకాడమీ (వరంగల్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పద్మశ్రీ సినీనటుడు మురళీ మోహన్, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల హాజరై, ఖ్యాతి నృత్య ప్రదర్శనలు వీక్షించి, అభినందించారు. తల్లిదండ్రులు పుట్ట రవి,రాణి కుమార్తె అయిన ఖ్యాతి ఆ రేళ్ల ఉన్నప్పటి నుంచే గురు సుధీర్‌రావు వద్ద కూ చిపూడి శిక్షణ ప్రారంభించింది. అచంచలమైన అంకితభావంతో తన శిక్షణ పూర్తిచేసి, పలు వేదికలపై ప్రదర్శలిచ్చి వీక్షకులను ఆకట్టుకొన్నది. ప్రస్తుతం ఖ్యాతి గీతం యూనివర్సిటీలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నది. విద్యతోపాటు నృత్యం, కర్ణాటక సంగీతం, టెన్నిస్ రంగాల్లో ఆమె ప్రతిభ చాటుతూ ముందుకెళ్తున్నారు.

# సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు

## సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలను బలోపేతం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నియోజకవర్గం ఇన్చార్జి కె.రామస్వామి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలమాకుల జంగయ్య హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశ చరిత్రలోనే ఒక మహత్తర ప్రజా పోరాటమని, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వేలాది మంది రైతులు, కూలీలు, పేద ప్రజలు ధైర్యంగా పోరాడారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా ప్రజలు తమ హక్కుల కోసం సంఘటితంగా పోరాడితే ఎలాంటి దోపిడీ వ్యవస్థనైనా ఎదుర్కోగలమనే స్ఫూర్తి ఏర్పడిందన్నారు. ఆ పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ,వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల, కౌలు సంఘం రాష్ట్ర నాయకులు సుబన్ రెడ్డి, పాపయ్య, ఎఐఎస్‌కె రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, చేవెళ్ల మండలకార్యదర్శి ఎం సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి శ్రీనివాస్, షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, శంకర్పల్లి మండల కార్యదర్శి సుదీర్, ఎఐటియుసి మండల అధ్యక్ష కార్యదర్శులు బాబురావు, కృష్ణ, మండల బి ఒ సి కార్యదర్శి శ్రీనివాస్ హనుమంత్, లలిత, వెంకటమ్మ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు

### నిజాం మెడలు వంచిన గొప్ప చరిత్ర రైతాంగ సాయుధ పోరాటానిది

హైదరాబాద్ సంస్థానాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని ప్రజలని బానిసలుగా చేసిన నిజాం నిజాం మెడలు వంచిన గొప్ప చరిత్ర రైతాంగ సాయుధ పోరాటానిది అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సెప్టెంబర్ 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని ఆర్కే నగర్‌లో శాఖ సహాయ కార్యదర్శి పేరాల గోపి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముత్యాల యాదిరెడ్డి హాజరై పార్టీ జెండా ఆవిష్కరణ చేసి అమరులకు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్, సహాయకార్యదర్శి కేతరాజు నర్సింహా, బిఓసి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు పొన్నాల యాదగిరి, కారంపోడి నర్సింహా, మిడతపల్లి ఉప్పలయ్య, కనకయ్య, మల్లేష్, నర్సింహా, యాదగిరి, శైలజ, శోభన్, రామ, అడిమయ్య, గంగ, ఎల్లేష్, నర్సింహా, మల్లేష్, రమేష్, లింగమ్మ, రేణుక, నర్సమ్మ, అంజమ్మ, అడిమయ్య, శ్రీను, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళెందుకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు నర్సింలు గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకొని నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు హీరునాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, సింగిల్ విండో చైర్మెన్ చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి శ్రీశైలం ముదిరాజ్, సదుల ఆంజనేయులు, కమ్మదనం నవీన్, ఎన్.పుల్లారెడ్డి, బుడ్డ నర్సింహులు, భరత్‌రెడ్డి, భరత్ రఘునాథ్, రామకృష్ణ, యాదయ్య, లక్ష్మ య్య, బాబా, మున్నా, రాజు పాల్గొన్నారు.

## ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి లక్ష్యం



**ప్రజాపక్షం/కొత్తూరు:** ఆదర్శ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. ఆదివారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో నూతనంగా సింగిల్ ఫేస్ బోరు మోటర్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ గ్రామంలోని వార్డులో తాగునీటి సమస్య ఉందన్న విషయాన్ని గ్రహించి పంచాయతీ నిధుల ద్వారా కొత్తగా సింగిల్ ఫెస్ బోరు మోటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పార్టీ నిర్ణయాలకు కట్టుబడి పని చేసేందుకు కార్యకర్తలు కృషిచేయాలని మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ సూచించారు.ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామంలో సదుల రామప్ప, సింగారం సుదర్శన్‌ల ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. వారందరికి నియామక పత్రాలను అంధించారు. బిజెపి కార్యకర్త నవీన్‌కుమార్, బిఆర్ఎస్‌కార్యకర్త భానూరి సురేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి హస్తం కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు గుండ్రాతి విష్ణుగౌడ్, సింగిల్‌విండో చైర్మెన్ చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ర్యాకల శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి శ్రీశైలం ముదిరాజ్, సదుల ఆంజనేయులు పాల్గొన్నారు.

## నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం భవనానికి స్థలం కేటాయించండి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నాయిబ్రాహ్మణ సంక్షేమ సంఘం భవనానికి స్థలం కేటాయించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అంధించారు. కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం షాద్‌నగర్ శాఖ అధ్యక్షుడు గద్వాల బాలరాజ్, ప్రధాన కార్యదర్శి మందుల రమేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవునిపల్లి బసప్ప, ఉపాధ్యక్షులు మందారం నర్సింలు ముత్యాల రామలింగం, మహిళా కార్యదర్శి ఆర్.జ్యోతి, కోశాధికారి పసుపుల శ్రీనివాస్, తక్కశిల వెంకటముని, సురేష్, పుష్ప తక్కశిల పావని, వెంకటేష్, పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కౌన్సిలర్లు ఎస్పీ శివ, సుదీర్‌లు పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని ఆర్‌టిసి కాలనీ, శ్రీనివాస కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ టౌన్ ఆధ్వర్యంలో ఎలుకుర్తి శ్రీనివాస్‌ఆర్థిక సహకారంతో ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ అధ్యక్షుడు ఎల్ఎన్ కమ్మదనం సుధాకర్, ఎంఎఫ్‌జే కార్యదర్శి ఎల్ఎన్ శరత్‌చంద్రబాబు, బ్రహ్మచారి, రామకృష్ణారెడ్డి, సాయికృష్ణ, నారాయణ, దుగ్గు శేఖర్, రవీందర్‌రెడ్డి, ఎంఎఫ్‌జే వెంకట్‌రాంరెడ్డి, బాలబ్రహ్మచారి, మాధవచారి, సందీప్ పాల్గొన్నారు.

## కెసిఆర్‌తోనే గ్రామీణ ప్రాంతాల ప్రగతి



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామీణ ప్రాంతాల ప్రగతి మాజీ సిఎం కెసిఆర్‌తోనే సాధ్యమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేశంపేట మండలం బోదునంపల్లి గ్రామానికి చెందిన పిప్పల శేఖర్, మాజీ సర్పంచ్ లింగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు చెందిన కార్యకర్తలు బిఆర్ఎస్‌లో చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, కౌన్సిలర్ అనిత రఘునాథ్‌యాదవ్, కేశంపేట సర్పంచ్ శ్రీశైలంయాదవ్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, నాగిళ్ల వెంకట్, కమ్మదనం సర్పంచ్ లత కిరణ్‌గౌడ్, మహదేవ్‌పూర్ సర్పంచ్ అనూష రవీందర్‌రెడ్డి, నాయకులు శేఖర్ పంతులు, ఆంజనేయులు, జయసింగ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాంచందర్ పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్..292 కేసులు నమోదు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 292 మందిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డిసిపి(అడ్మిన్) జి.నరేందర్ తెలిపారు. నమోదైన కేసుల్లో 240 ద్విచక్ర వాహనదారులు,12 ఆటో డ్రైవర్లు,మరో 40 మంది కార్ల డ్రైవర్లు ఉన్నారు.కాగా హెవీ వాహనదారులపై ఎలాంటి కేసులు నమోదు కాలేదు. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్‌ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను పరిశీలించగా.. 248 మందిలో 36 నుంచి 200 ఎంజి/100 ఎంఎల్,30 మందిలో 201 నుంచి 300 ఎంజి/100 ఎంఎల్,14 మందిలో 301 నుంచి 550 ఎంజి/100 ఎంఎల్ వరకు ఆల్కహాల్ ఉన్నట్లు గుర్తించినట్లు వివరించారు. పట్టుబడిన వారందరినీ చట్టపరమైన చర్యల్లో భాగంగా కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు మరోసారి హెచ్చరించారు.మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.ఈ నేరానికి గరిష్టంగా 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పోలీసులు స్పష్టం చేశారు.



### 681 డ్రంక్ డ్రైవింగ్ కేసులకు శిక్షలు

గత వారం 07.09.2026 నుంచి 12.09.2026 వరకు కోర్టులు 681 డ్రంక్ డ్రైవింగ్ కేసులను పరిష్కరించయన్నారు. వీటిలో 18 మందికి జరిమానాలు విధించగా జైలు శిక్ష, 7 మందికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్, 656 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులకు సహకరించాలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## ప్రిన్స్ ఆగాఖాన్ పర్యటనకు బందోబస్తు

### ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** హెచ్‌హెచ్ ప్రిన్స్ రహీమ్ ఆగాఖాన్ వి పర్యటన నేపథ్యంలో సెప్టెంబర్ 15న నిర్వహించనున్న ఇస్మాయిలీ కమ్యూనిటీ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్(సిపి) డాక్టర్ తరుణ్ జోషి పోలీసు అధికారులను ఆదేశించారు. పర్యటన సందర్భంగా చేపట్టనున్న బందోబస్తు ఏర్పాట్లపై ఆదివారం పోలీసు అధికారులు, సిబ్బందికి సిపి బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, రూట్ బందోబస్తు, పార్కింగ్, భద్రత, శాంతిభద్రతల ఏర్పాట్ల ను సమీక్షించారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన విధులపై పూర్తి అవగాహనతో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమైన జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను నిరంతరం పర్యవేక్షించాలని, రూట్ బందోబస్తు సమయంలో రద్దీ ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను క్రమబద్ధంగా నిలిపి, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు సజావుగా ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.



### విధుల్లో నిర్లక్ష్యం సహించం

బందోబస్తు విధుల్లో సమయపాలన, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని సిపి డాక్టర్ తరుణ్ జోషి స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. భద్రతా నిబంధనల్లో భాగంగా కార్యక్రమ ప్రాంగణంలో ఎస్ఐ స్థాయి,అంతకంటే పైస్థాయి అధికారులకు మాత్రమే మొబైల్ ఫోన్లు అనుమతించనున్నట్లు తెలిపారు. కానిస్టేబుళ్లు తమ మొబైల్ ఫోన్లను సూచించిన ప్రదేశంలో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ డిసిపి శివమ్ ఉపాధ్యాయ, షాద్‌నగర్ జోన్ డిసిపి సిరిష, ట్రాఫిక్ ఎసిపి ఎ.చంద్రశేఖర్, ఎస్‌బి ఎసిపి ఎం.హుస్సైనీ నాయుడు, హెడ్‌క్వార్టర్స్ ఎసిపి అరుణ్ కుమార్ తోపాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ పేరుతో ఘరానా మోసం

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** ఆన్‌లైన్‌లో అధిక లాభాలతో పాటు అధిక వడ్డీ వస్తుందని భారీ మోసం జరిగిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు, భాధితులు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో పరిసర ప్రాంతాలలోని బాధితులు క్యాస్ అనే ఫోన్ ఆఫ్ ఆన్‌లైన్ పేరుతో డాలర్లలో భారీ లాభాలు జయించవచ్చని ఆశాతో దాదాపు 300ల మంది బాధితుల దగ్గర నుంచి సుమారు 25కోట్ల రూపాయల వసూళ్ళు చేసినట్టు బాధితులు తెలిపారు. నియోజకవర్గంలో నాగన్‌పల్లి, రాయపోల్, దండుమైలారంతో పాటు పలు గ్రామాలలో వేల సంఖ్యలో బాధితులు ఉన్నారు. ఘటనకు సంబందించి గుజ్జ అమరేందర్ రెడ్డితో పాటు పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## సిఐ మహేందర్‌రెడ్డికి సన్మానం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం** :ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ సివిల్ ఫోర్స్ పోలీస్ ఆఫీసర్స్ కార్యదర్శిగా ఇబ్రహీంపట్నం సిఐ మద్ది మహేందర్‌రెడ్డి ఎన్నికైన సందర్భంగా ఆదివారం భూదాన బోర్డ్ చైర్మెన్ గున్నా రాజేందర్‌రెడ్డి సిఐ మహేందర్‌రెడ్డిని కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## మట్టి వినాయక ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ

### -ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండాలి
### పిసిబి ఇఇ వెంకటనర్సు

ప్రజాపక్షం/రంగారెడ్డి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని రంగారెడ్డి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి(పిఒపి) ఇఇ వెంకటనర్సు పిలుపునిచ్చారు. వినాయక చవితిని పురస్కరించుకుని పిఒపి ఆధ్వర్యంలో పలువురికి మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇఇ వెంకటనర్సు మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఒపి),రసాయన రంగులతో తయారు చేసిన ప్రతిమలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని సూచించారు. మట్టి ప్రతిమలను పూజించి నిమజ్జనం చేయడం ద్వారా నీటి కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు.పిఒపి,రసాయన రంగులతో తయారైన విగ్రహాలను జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి నాణ్యత దెబ్బతినడంతో పాటు జలచరాలకు హాని కలిగే అవకాశం ఉందన్నారు.అందుకు భిన్నంగా మట్టి విగ్రహాలు సహజంగా నీటిలో కలిసిపోతాయని తెలిపారు.

### ఇంటి వద్దే నిమజ్జనం

చిన్న పరిమాణంలో ఉన్న మట్టి వినాయక ప్రతిమలను ఇంటి వద్దే బకెట్ లేదా పూలకుండీలో నిమజ్జనం చేసి, ఆ నీటిని మొక్కలకు వినియోగించవచ్చని అధికారులు సూచించారు.అలాగే విత్తనాలతో తయారు చేసే సీడ్ వినాయక ప్రతిమలను వినియోగిస్తే నిమజ్జనం అనంతరం మొక్కలను పెంచే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన కల్పించేందుకు పిసిబి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెంకటనర్సు పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ పర్యావరణహిత పద్ధతులను పాటిస్తూ పండుగలను భక్తిశ్రద్ధలతో పాటు సామాజిక బాధ్యతతో నిర్వహించాలని కోరారు.భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ఈ వినాయక చవితికి మట్టి వినాయక ప్రతిమలనే ఎంచుకోవాలని పిసిబి ఇఇ వెంకటనర్సు విజ్ఞప్తి చేశారు.



## భారీగా గంజాయి పట్టివేత..పలువురి అరెస్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోల్కొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్టీఎఫ్ అధికారులు పట్టుకున్నారు. కార్వాన్ రోడ్డులోని అన్నపూర్ణ టెంపుల్ సమీపంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్‌టిఎఫ్ సిబ్బంది దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న రాజేందర్ సింగ్ (38)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 580 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడితో పాటు గంజాయిని గోల్కొండ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్టీఎఫ్ డీటీమ్ సీఐ నాగరాజు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఫ్యూచర్ సిటీలో భారీగా బెల్లం పట్టివేత..

ఫ్యూచర్ సిటీలో లోని ఎక్సైజ్ స్టేషన్ ఇబ్రహీంపట్నం పరిధిలో ఎక్సైజ్ పోలీసులు ఒక ఇంట్లో నిల్వచేసిన 1860 కేజీల బెల్లం 1160 కేజీల ఆలయంలో స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బెల్లం ఆలం విలువ రూ. 3 లక్షలు గా ఉంటుందని అంచనా వేశారు. ఈ నిల్వచేసిన బెల్లం ఎవరిదైన విషయంపై ఎక్సైజ్ పోలీసులు విచారణ ప్రారంభించారు.



### గోవా, కర్ణాటక నుంచి వచ్చే బస్సులపై నిఘా

గంజాయి, అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఎక్సైజ్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని శంషాబాద్ ప్రాంతంలో గోవా, కర్ణాటక నుంచి వస్తున్న బస్సులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. షాపూర్‌గేట్ వద్ద బస్సులను నిలిపి తనిఖీ చేశారు. అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగానే తనిఖీలు చేపట్టినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

### ఒడిశా నుంచి గంజాయి దిగుమతి..ఇద్దరి అరెస్ట్

గంజాయి అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు చేపట్టిన చర్యల్లో మొత్తం 2.815 కిలోల గంజాయి పట్టుబడింది. మాదాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒడిశా ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న 2.545 కిలోల గంజాయిని, మరో కేసులో కుత్బుల్లాపూర్ డిడిఎఫ్ పరిధిలో 270గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ రెండు కేసులకు సంబంధించి ప్రదీప్ గూగల్, షరీఫుల్ అనే ఇద్దరిని అరెస్ట్ చేసి కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

## రాజీమార్గమే రాజమార్గం

### జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** రాజీ మార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయ పరిష్కారం దిశగా ఉంటుందని 16వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి అన్నారు. ఆదివారం షాద్‌నగర్ కోర్టు సముదాయంలో మండల న్యాయసేవ అధికార సంస్థ షాద్‌నగర్ వారి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 16వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.స్వాతిరెడ్డి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ద్వారా క్రిమినల్ కేసులు 255, మోటర్ వెహికిల్ కేసులు 01, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 3753, మొత్తం 4011కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. కేసులు పెండింగ్‌లో పెట్టుకొని కక్షలు పెంచుకునే దాని కంటే ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు కృషి చేయాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో జీవించేందుకు ప్రజలందరు కృషి చేయాలని పేర్కొన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షరీనా మహ్మద్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సాహితి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శేఖర్‌చారి, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జగన్మోహన్‌రెడ్డితోపాటు న్యాయవాదులు, కక్షదారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



# నేనూ ఒక ‘దిమాగి నక్సల్’

## రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్



**కొచ్చి :** తాను కూడా ఒక ‘దిమాగి నక్సల్’ అని రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ అన్నారు. నక్సలిజం భావజాలంగల వారిపై ఆరోపణలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, బిజెపి ‘దిమాగి నక్సల్’ అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. ఆదివారం కేరళంలోని కొచ్చిలో జరిగిన ‘భేర సారాలు, ప్రజాస్వామ్యం’ అనే అంశంపై కపిల్ సిబల్ మాట్లాడుతూ తాను కూడా ఒక ‘దిమాగి నక్సల్’ అని అన్నారు. తన ప్రసంగం ప్రారంభంలో తాను ఒక దిమాగి నక్సల్ అని ఒప్పుకోవాలని చెప్పారు. హార్స్ ట్రేడింగ్‌పై కపిల్ సిబల్ మాట్లాడుతూ ప్రాచీన కాలంలో యుద్ధాల ఫలితాలను నిర్ణయించడంలో అశ్వ జాతి కీలక పాత్ర పోషించేదని అన్నారు. అప్పట్లో గుర్రాలకున్న ప్రాముఖ్యత కారణంగా, వాటిని అమ్మేవారు కొనుగోలుదారులకు విక్రయించేటప్పుడు రకరకాల ఎత్తుగడలు వేసేవారని ఆయన అన్నారు. ‘ఇప్పుడు ఇది వేరే రంగు పులుముకుంది. ఆ సమయంలో, అమ్మేవాడే మోసగాడుగా ఉండేవాడు. ఈ సమయంలో, కొనుగోలుదారుడే మోసగాడు. అదే తేడా’ అని లైవ్‌లా నిర్వహించిన కార్యక్రమంలో సిబల్ అన్నారు. భేరసారాలు ‘తాత్కాలిక రాజకీయ కుంభకోణం’ కాదు, అది ఒక ‘రాజ్యాంగ సంక్షోభం’ అని ఆయన అన్నారు. ఇది ప్రాతినిధ్య ప్రభుత్వంపై, ఓటు సమగ్రతపై, పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రాథమిక నిర్మాణంపై దెబ్బ కొడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ‘హార్స్ ట్రేడింగ్’ ఒక నీచమైన పద్ధతికి పెట్టే నీచమైన పదం అని కపిల్ సిబల్ చెప్పారు. ప్రజలు ఎన్నుకున్న మెజారిటీ స్థానంలో, ఎన్నికల తర్వాత సృష్టించబడిన మెజారిటీని తీసుకురావడానికి, ఎన్నికైన ప్రతినిధులను వ్యవస్థీకృతంగా కొనుగోలు చేయడం లేదా ప్రలోభపెట్టడమే ఈ పద్ధతి అన్నారు. కొన్నిసార్లు ఇది నగదు, పదవి, విచారణ నుండి రక్షణ వంటి క్రూరమైన రూపాల్లో ఉంటుందని, మరికొన్నిసార్లు ఇది విలీనం అనే గౌరవప్రదమైన ముసుగులో బయటపడుతుందని చెప్పారు.

# మూడు రోజులు..15 మంది ప్రపంచనేతలు...

## బ్రిక్స్‌దేశాలతో వాణిజ్య, రక్షణ, ప్రజా సంబంధాలపై ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు












**న్యూఢిల్లీ:** బ్రిక్స్ 18వ సదస్సుకు న్యూఢిల్లీ వేదికగా ఆతిథ్యం ఇచ్చిన సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఒక్కరోజే నాలుగు దేశాల నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా, ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్–సిసి, కజఖ్ అధ్యక్షుడు కస్సెమ్ జోమాత్ తోకయేవ్‌లతో సమావేశాలు జరిపారు. అదేవిధంగా బురుండీ అధ్యక్షుడు అవరిస్తే ఎన్‌డయిషిమియే,ఉగాండా ఉపాధ్యక్షుడు జెస్సికా అలుపో, నైజీరియా ఉపాధ్యక్షుడు కాషిమ్ షెట్టిమాలతో ఈ సమావేశాలు నిర్వహించారు. వాణిజ్యంలో సహకారం,పెట్టుబడులు,రక్షణరంగ సహభాగస్వామ్యంతోపాటు ప్రజలకు ప్రజలకు మధ్య సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం వంటి విషయాలపై ప్రధానంగా దృష్టి సారించి ప్రపంచ నాయకులతో చర్చించారు. మొత్తంగా మూడు రోజుల్లో 15 బ్రిక్స్ సభ్యదేశాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు.

మోదీ సోషల్ మీడియాలో ఒక పోస్టింగ్ పెడుతూ, రామఫోసాతో సంపూర్ణస్థాయిలో భారత్–దక్షిణాఫ్రికా సంబంధాలపై సమీక్ష చేసినట్లు పేర్కొన్నారు. ఆ దేశంతో వ్యూహాత్మక భాగస్వామ్యంతోపాటు గనుల తవ్వకాల్లో సహకారం, కీలక ఖనిజాలు, మౌలిక సదుపాయాలు, ఆహార భద్రత, ప్రజలకు బహిరంగ మౌలిక సదుపాయాల డిజిటలీకరణ, సరికొత్త సాంకేతికతలను అందుబాటులోకి తీసుకురావడం వంటి విషయాలపై చర్చించారు. ‘‘మన రెండు దేశాల భాగస్వామ్యానికి చారిత్రక నేపథ్యం ఉంది,ఇప్పుడు ప్రధానంగా భవిష్యత్‌పై దృష్టి సారించాం, ఆఫ్రికాతో భారత్ సన్నిహితంగా కలిసి పని చేస్తుంది, దక్షిణార్థగోళ దేశాలతో సంబంధాలకు ప్రాధాన్యత ఇస్తుంది, ప్రపంచ నియమాలను పాటించడంలో, శాంతి సాధనలో మరింత సమతుల్యత పాటిస్తుంది’’ అని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. భారత విదేశీ మంత్రిత్వశాఖ ఒక ప్రకటన చేస్తూ, రామఫోసా–మోదీ ఇద్దరూ పరస్పర ఆసక్తిగల ప్రపంచ సమస్యలపై అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకున్నారని, బహుళపక్ష వేదికలపై సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించాలని ఇద్దరు నాయకులూ అంగీకరించారని తెలియజేసింది. ‘‘చిఱుత పులులకు దక్షిణాఫ్రికా నుండి భారత్‌కు తరలించి విజయవంతంగా పునరావాసం కల్పించిన నేపథ్యంలో పులి,చిరుతపులి,మంచులో ఉండే చిరుతలు,అమెరికా పులి,చారలు,చుక్కలు లేని పులి,సింహం వంటి ఆరు రకాల ఫెలిస్‌జాతి అడవి మృగాల రక్షణకోసం ప్రాజెక్టు టైగర్ 50వ వార్షికోత్సవం సందర్భంగా 2023లో మోదీ ప్రారంభించిన ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ కూటమి (ఐబిసిఎ)లో చేరాల్సిందిగా దక్షిణాఫ్రికాకు ఆహ్వానం పలికారు’’ అని ఎంఇఎ తెలియజేసింది.

అదేవిధంగా మార్కోస్ జూనియర్‌తో సమావేశంలో భారత్–ఫిలిప్పీన్స మధ్య ఆర్థిక సంబంధాలలో వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్ష జరిపారు. సాంకేతికత,వాణిజ్యం,అంతరిక్షం,నవీన ఆవిష్కరణలకు సంబంధాలను మెరుగుపరచుకోవాలని ఆశించారు.భారత్–ఏసియన్ కార్యకలాపాలపై కూడా చర్చించినట్లు మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. అన్ని రంగాలలోనూ ద్వైపాక్షిక సంబంధాలపై ఇరు దేశాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అధ్యక్షుడు ఎల్–సిసితో మీడియా అద్భుతమైన ఇష్టాగోష్టి నిర్వహించిందని కూడా మోదీ తెలియజేశారు. అదేవిధంగా కజఖస్థాన్ అధ్యక్షుడు తకయేవ్‌తో చర్చలు ఎంతో ఫలవంతంగా జరిగాయని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. వాణిజ్యం,పెట్టుబడులు,ఇంధనం,సాంకేతికత,అనుసంధానం,నవీన ఆవిష్కరణలు వంటి విషయాల్లో గాఢ సహకారం పెంచుకోవాలని నాయకులు ఇద్దరూ నిర్ణయించారు.

భారత్–బురుండీ దేశాలమధ్య సంబంధాలపై ఆ దేశ అధ్యక్షుడితో మోదీ చర్చించారు. అభివృద్ధి సహకారం,సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం,యువతరం నైపుణ్యాలు,వ్యవసాయం,శుద్ధ ఇంధనం రంగాలలో సహకారాన్ని ఇనుమడింపజేయాలని నాయకులు ఇద్దరూ అంగీకరించారు. అదేవిధంగా నైజీరియా ఉపాధ్యక్షుడు షెట్టిమాతో వాణిజ్య,విద్యుత్,శుద్ధ ఇంధనం,ఎరువులు,రక్షణ రంగాల అంశాలపై మోదీ చర్చించారు. ఆరోగ్యం,సాంకేతికతపై కూడా చర్చించారు. అధ్యక్షుడు సుబియంతో కూడా మోదీతో సమావేశమై భారత్–ఇండోనేసియా భాగస్వామ్యంపై చర్చించారు.

మొత్తంగా చూస్తే సెప్టెంబరు 11–12–13 తేదీలలో 15 మంది ప్రపంచ నాయకులతో విస్తారంగా వేరు వేరు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.మోదీ ఊపిరిసలపకుండా దౌత్య కార్యకలాపాలు నిర్వహించారని ఆదివారం నాడు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.అదేవిధంగా మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం,వియత్నాం ప్రధానమంత్రి లే మిన్ హంగ్, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియంతో,తదితర నాయకులతో ప్రధానమంత్రి మోదీ సమావేశాలు నిర్వహించారు. బ్రిక్స్ సదస్సుకు 11 సభ్యదేశాలు,10 భాగస్వామ్య దేశాలతోపాటు కొన్ని అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

ఈ ద్వైపాక్షిక సమావేశాలతోపాటు అదనంగా వివిధ దేశాల నాయకులతో సమావేశాలతోపాటు సదస్సులో పాల్గొన్న వివిధ అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కూడా సమావేశాలు నిర్వహించారు. మొదట బ్రిక్స్ సమావేశాల ముందురోజు శుక్రవారం సాయంత్రం రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో ద్వైపాక్షిక సమావేశం జరిపారు. మరుసటిరోజు సాయంత్రం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్,ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్,అబుధాబి యువరాజు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌లతో ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ దేశాలన్నీ భారత్‌కు కీలక వాణిజ్య భాగస్వాములే.

# 80% భారతీయులు మాంసాహారులు

## ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** భారత దేశంలో 80 శాతం మంది మాంసాహారులని, భారతీయ మాంసాహారం చాలా రుచికరంగా ఉంటుందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. అయితే దేశంలో జరుగుతున్న బిక్స్‌లో సదస్సులో శుక్రవారం పూర్తిగా శాకాహార భోజనం వడ్డించడంతో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం భారత్ మండపంలో బ్రిక్స్ సదస్సు నాయకులు, ప్రతినిధుల కోసం ఈ విందు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రాహుల్‌గాంధీ పోస్ట్ చేస్తూ ‘రికార్డు కోసం చెబుతున్నాను: 80 శాతం భారతీయులు మాంసాహారులు. భారతీయ మాంసాహారం చాలా రుచికరంగా ఉంటుంది. మా సోదరి చేసే చోలే భటూరే కూడా అంతే’ అని అన్నారు. భోజన బల్లపై ఉన్న చోలే భటూరే చిత్రాన్ని రాహుల్ పోస్ట్ చేశారు. బ్రిక్స్ సదస్సులో స్టార్టర్స్‌గా ‘ఖండ్వీ మిల్లే’ (ఆవిరి మీద ఉడికించిన శనగపిండి రోల్), పుదీనా గింజలతో పెనం మీద కాల్చిన పుట్టగొడుగుల కబాబ్‌లైన ‘ఖుంబ్ గలౌటి’ని వడ్డించారు. ప్రధాన వంటకాలలో ‘పనీర్ లబబ్దార్’, ‘గుచ్చి మర్మిక్’ (హిమాలయన్ మోరెల్ పుట్టగొడుగులు, లేత ఆస్పరాగస్), ‘క్యారెట్ బీన్ పొరియల్’ అందించారు. మెనూలోని ఇతర వంటకాలలో ‘తక్కాలి బెల్లె సారూ’ (తేలికపాటి పప్పు పులుసు), మిల్లెట్ పులావ్, బీట్‌రూట్ రైతా, రకరకాల భారతీయ రొట్టెలు ఉన్నాయి. డెజర్ట్‌ల విషయానికొస్తే, వివిఐపి అతిథుల కోసం ‘ఓల్డ్ ఢిల్లీ ఫ్రూట్ క్రీమ్ విత్ జలేబి’ ‘షాహటూట్ ఫిర్నీ’తో మెనూ ముగిసింది. ప్రధానంగా భారత దేశం, అలాగే బ్రిక్స్ సభ్య దేశాల నుండి వచ్చిన 100 మందికి పైగా కళాకారుల బృందం ప్రదర్శన ఇస్తుండగా ఈ విందు భోజనం అందించారు.

**మలేషియా ప్రధానమంత్రితో రాహుల్ భేటీ**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆదివారం ఢిల్లీలో మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో అల్పాహార సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్–మలేషియా సంబంధాలపై చర్చించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. ఇబ్రహీంతో జరిగిన అల్పాహార సమావేశంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల ఫోటోలను కాంగ్రెస్ విడుదల చేసింది. వాణిజ్యం, సెమీకండక్టర్లు, మౌలిక సదుపాయాలు, రక్షణ రంగాలలో సహకారంపై దృష్టి సారించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇబ్రహీం చర్చలు జరిపిన ఒక రోజు తర్వాత ఈ సమావేశం జరిగింది. బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఈ ఇద్దరు నాయకులు సమావేశమయ్యారు. మలేషియా బ్రిక్స్ కూటమిలో భాగస్వామ్య దేశం. అలాగే ఆసియాన్ కూటమిలో భారత్‌కు ఇది ఒక కీలక భాగస్వామ్య దేశం.

# వరద గుప్పిట్లో 48 లక్షల మంది

## సెప్టెంబర్‌లో ఇప్పటివరకు బిహార్‌లో 108.8 మి.మీ వర్షపాతం




**పాట్నా :** బిహార్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. వరదల పెద్ద ఎత్తున పోటెత్తాయి. అయితే ఆదివారం నాటికి 48 లక్షల మందికి పైగా ప్రజలు ఇంకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, ప్రమాద స్థాయికి పైన ప్రవహిస్తున్న చాలా నదులలో నీటి మట్టాలు తగ్గుముఖం పట్టడం ప్రారంభించిందని అధికారులు తెలిపారు. 15 జిల్లాల్లోని 87 బ్లాకుల పరిధిలోని 575 గ్రామ పంచాయతీలలో సుమారు 48.35 లక్షల మంది ప్రజలు ఈ వరదల వల్ల ప్రభావితమయ్యారని వారు పేర్కొన్నారు. విపత్తు నిర్వహణ శాఖ (డిఎండి) ప్రకారం, పాట్నా, భోజ్‌పూర్, సరన్, వైశాలి, భాగల్‌పూర్, బేగుసరాయ్, అరారియా జిల్లాలు అత్యంత తీవ్రంగా ప్రభావితమైన వాటిలో ఉన్నాయి. సెప్టెంబర్ నెలలో ఇప్పటివరకు బిహార్‌లో 108.8 మి.మీ వర్షపాతం నమోదైందని, ఇది సాధారణం కంటే సుమారు 20 శాతం ఎక్కువని అధికారులు తెలిపారు. బల్తార్, కుర్సెలా వద్ద కోసి నది, ఖగారియా వద్ద బుర్హి గండక్, దిఘా, గాంధీ ఘాట్, హతిదా, భాగల్‌పూర్, కహల్‌గావ్, ముంగేర్ వద్ద గంగా నది, శ్రీపాల్‌పూర్ వద్ద పున్‌పున్, బెనిబాద్ వద్ద బాగ్మతి, అలాగే దరౌలి, గంగ్‌పూర్ సిస్వాన్ వద్ద ఘఘ్రా నదులు ప్రమాద స్థాయికి పైన ప్రవహిస్తున్నాయని డిఎండి తెలిపింది. ప్రభుత్వ యంత్రాంగం 1,251 సామాజిక వంటశాలలను (కమ్యూనిటీ కిచెన్స్) నిర్వహిస్తుండగా, వరద ప్రభావిత ప్రాంతాల్లో 13 సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో సుమారు 12,260 మందికి వసతి, ఆహారం, వైద్య సేవలు, ఇతర నిత్యావసర వస్తువుల ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి, రవాణా కోసం సుమారు 1,790 పడవలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల్లో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్)కు చెందిన పది బృందాలు, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్)కు చెందిన 27 బృందాలను మోహరించారు.

**బిహార్ పట్ల కేంద్ర సవతి తల్లి ప్రేమ**

వరద సహాయం విషయంలో కేంద్ర ప్రభుత్వం బిహార్ పట్ల ‘సవతి తల్లి’ వైఖరిని ప్రదర్శిస్తోందని రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆదివారం పాట్నాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్‌జెడి వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తేజస్వీ మాట్లాడుతూ బిహార్‌కు సహాయక ప్యాకేజీని సాధించడంలో విఫలమైనందుకు ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులపై విమర్శలు గుప్పించారు. గుజరాత్‌లో వరదలు వచ్చినప్పుడల్లా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే సహాయంపై హామీలు ఇవ్వడం, రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడటం, భారత వైమానిక దళంతో సహా సహాయక దళాలను పంపాలని ఆదేశించడం వంటివి చేస్తారు. కానీ, ఎన్నికల ప్రచారానికి వచ్చి ‘లిట్టిచోఖా’ తినే బిహార్ పట్ల మాత్రం సవతి తల్లిలా వ్యవహరిస్తున్నారు అని యాదవ్ ఆరోపించారు. వరదలను ‘జాతీయ విపత్తు’గా ప్రకటించాలని, తక్షణమే రూ. 5,000 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ 7న ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాసినట్లు యాదవ్ తెలిపారు. బిహార్‌లోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వ ఇంజిన్లు విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి ప్రధాని మోదీతో ఎంత తరచుగా మాట్లాడతారో నాకు తెలియదు, కానీ కేంద్ర సహాయాన్ని ఎందుకు సాధించలేకపోయారో అర్థం కావడం లేదన్నారు. బిహార్ నుండి చాలా మంది కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ, రాష్ట్రానికి కేంద్ర సహాయాన్ని తీసుకువచ్చేంత ప్రభావం వారిలో ఎవరికీ లేదన్నారు. మోదీ, చౌదరిలకు తాను రాసిన లేఖలకు ఎటువంటి స్పందన రాలేదని యాదవ్ పేర్కొన్నారు. వరదల సమయంలో ప్రధాని బిహార్‌ను ఎలాగైతే విస్మరించారో, భవిష్యత్తులో ప్రజలు ఆయన్ని అలాగే విస్మరిస్తారు అని ఆయన అన్నారు.

# ‘సిఎం పదవి సద్వినియోగంలో స్పష్టంగా విఫలమయ్యా’!

## సిజెపి కన్వీనర్ దీప్కే వ్యంగ్య పోస్టు



**భోపాల్ :** మధ్యప్రదేశ్ బాలాఘాట్ జిల్లాలో గిరిజన పిల్లల మరణాల విషయంలో మోహన్ యాదవ్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ‘కాక్రోచ్ జనతా పార్టీ’ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆదివారం వ్యంగ్యాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు పేర్కొంటూ ఎక్స్‌లో ఒక వ్యంగ్య లేఖను పోస్ట్ చేశారు. ఆగస్టు 13 నాటి ఆ లేఖలో, మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల్‌ను ఉద్దేశించి దీప్కే ‘బాలాఘాట్‌లో 30 మందికి పైగా గిరిజన పిల్లలు మరణించిన తర్వాత, ఈ పదవిలో కొనసాగడానికి నా అంతరాత్మ అంగీకరించడం లేదు, అందుకే రాజీనామా చేస్తున్నాను’ అని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా ఆయన కృతజ్ఞతలు తెలుపుతున్నా అని, అయితే, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో తాను స్పష్టంగా విఫలమయ్యానని పేర్కొన్నారు. బాలాఘాట్ మరణాల విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును, ముఖ్యంగా బాధితుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారాన్ని ఈ వ్యంగ్య లేఖ లక్ష్యంగా చేసుకుంది. ఒకవేళ మరణించిన వారు మంత్రులు లేదా ఎమ్మెల్యేల పిల్లలై ఉంటే, రూ. 24 లక్షల పరిహారం సరిపోయేదా అని కూడా దీప్కే ప్రశ్నించారు. బాలాఘాట్ అదనపు కలెక్టర్ డి.పి. బర్మన్ తెలిపిన వివరాల ప్రకారం, మరణించిన 24 మంది పిల్లల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షల చొప్పున పరిహారం అందించారు, మిగిలిన వారికి సహాయం అందించే ప్రక్రియ కొనసాగుతోంది. అమాయక పిల్లల మరణాలు అత్యున్నత స్థాయిలో జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తున్నాయని దీప్కే ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ తర్వాత ఆ పోస్ట్ తన పరిధిని విస్తరించి, కుళాయి నీటి సరఫరా, విద్య, గిరిజన సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న వాదనలను ఎండగట్టింది. బాలాఘాట్‌లోని కొన్ని గిరిజన కుటుంబాలు ఇప్పటికీ నదీ జలాలపైనే ఆధారపడుతున్నాయని, అనేక గ్రామాల్లోని పాఠశాలలు పశువుల కొట్టాల కంటే అధ్వాన్నమైన స్థితిలో ఉన్నాయని దీప్కే ఎత్తిచూపారు. రాష్ట్రంలో వరుసగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వాల వైఫల్యాలను నొక్కిచెప్పేందుకు... విద్యుత్ సౌకర్యం లేని గిరిజన కుటుంబాలు, షెడ్యూల్డ్ తెగలపై నేరాలు, పిల్లలలో పోషకాహార లోపం వంటి అంశాలపై ప్రభుత్వ గణాంకాలను కూడా ఆయన ప్రస్తావించారు. తన నకిలీ రాజీనామా లేఖను ముగిస్తూ, ‘బాలాఘాట్ ప్రజలకే కాకుండా రాష్ట్రంలోని గిరిజనులందరికీ తాను అన్యాయం చేశానని’ దీప్కే అన్నారు. ఇంతమంది అమాయక పిల్లలు మరణించిన తర్వాత, ‘ఈ పదవిలో కొనసాగే నైతిక హక్కు తనకు ఉందని తాను భావించడం లేదని’ ఆయన పేర్కొన్నారు. బాలాఘాట్‌లోని వ్యాధిగ్రస్త గ్రామాలలో దీప్కే పర్యటించిన ఒక రోజు తర్వాత ఈ పోస్ట్ వచ్చింది. అక్కడ, కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో జరిగిన ఘర్షణ కారణంగా కుటుంబాలతో ఆయన సంభాషణకు అంతరాయం కలిగింది. ఈ వారం ప్రారంభంలో, బాలాఘాట్ జిల్లాలో అంటువ్యాధుల కారణంగా 30 మందికి పైగా పిల్లలు మరణించిన ఘటనపై మధ్యప్రదేశ్ హైకోర్టు జబల్‌పూర్ బెంచ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని స్పందన కోరింది. ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరుపుతూ, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి వివేక్ రుసియా, జస్టిస్ ప్రదీప్ మిట్టల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ, మహిళా, శిశు అభివృద్ధి శాఖ, బాలాఘాట్ కలెక్టర్, ఇతరులకు నోటీసులు జారీ చేసింది. పిల్లలకు సరైన చికిత్స అందడం లేదని, 50 పడకల సామర్థ్యం ఉన్న ఆసుపత్రిలో సుమారు 400 మంది పిల్లలకు చికిత్స అందిస్తున్నారని ఆ పిఐఎల్ ఆరోపించింది. ప్రభావిత ప్రాంతాల్లోని చేతిపంపుల నుండి పసుపు రంగు నీరు వస్తోందని, పిల్లలకు, మహిళలకు చాలా నెలలుగా సకాలంలో పోషకాహారం అందడం లేదని కూడా ఆరోపించింది.

## తమిళనాడులో ఉప ఎన్నికల్లో

# వామపక్షాలు స్వతంత్రంగా పోటీ

## ధరాపురం నుంచి సిపిఐ, మధురాంతకం నుంచి సిపిఐ(ఎం) పోటీ



**చెన్నై/తిరుచిరాపల్లి :** తమిళనాడులో వచ్చే నెలలో అసెంబ్లీ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికార టివికెకు బయటి నుంచి మద్దతు ఇస్తున్న సిపిఐ, సిపిఐ(ఎం) పార్టీలు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం చొప్పున పోటీ చేయనున్నట్లు ఆదివారం ప్రకటించాయి. అక్టోబర్ 6న జరిగే ఈ ఉప ఎన్నికల్లో ధరాపురం నుంచి సిపిఐ, మధురాంతకం నుంచి సిపిఐ(ఎం) పోటీ చేయనున్నాయి. ఆదివారం చెన్నైలో విలేకరులతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. వీరపాండియన్ మాట్లాడుతూ రాష్ట్రంలో అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికలు సహజంగా వచ్చినవి కావని, అవి అధినాయకత్వం లేదా పరిస్థితుల వల్ల బలవంతంగా రుద్దబడినవి అని పేర్కొన్నారు. ఏ ఎన్నికల కూటమిలోనూ చేరకూడదనే తమ విధానానికి కట్టుబడి ఉంటూనే, సిపిఐ ఈ ఉప ఎన్నికల్లో సిపిఐ(ఎం)తో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకుందన్నారు. తాము తాము ఎన్నికల్లో పోటీ చేయాలనే మా అభిప్రాయాన్ని సిపిఐ(ఎం)కు తెలియజేశాము, వారు కూడా అదే నిర్ణయానికి వచ్చారని చెప్పారు. సిపిఐ ధరాపురం నుంచి పోటీ చేస్తుందన్నారు. తిరుచిరాపల్లిలో విలేకరులతో మాట్లాడిన మార్క్సిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం. షణ్ముగం, ఉప ఎన్నికల్లో పోటీ చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్ణయించిందని, ఇది వామపక్ష పార్టీలైన సిపిఐ(ఎం), సిపిఐ, సిపిఐ (మార్క్సిస్ట్‌లెనినిస్ట్)ల స్వతంత్ర పోరాటంగా ఉంటుందని చెప్పారు.

# శబరిమల యాత్రకు రూ. 551 కోట్లు

**తిరువనంతపురం :** శబరిమల యాత్ర ఏర్పాట్ల కోసం ప్రజా పనుల శాఖ (పిడబ్ల్యుడి)కు ప్రభుత్వం రూ. 551.5 కోట్లు కేటాయించిందని కేరళం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఆదివారం తెలిపారు. తన కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో, గత ప్రభుత్వం శబరిమల యాత్ర ఏర్పాట్ల కోసం 2025–26లో రూ. 377.80 కోట్లు, 2024–25లో రూ. 326.97 కోట్లు కేటాయించిందని సతీశన్ పేర్కొన్నారు. యాత్ర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం అనంతరం రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి పి.కె. బషీర్ సమర్పించిన ప్రతిపాదన మేరకు ఈ రూ. 551.5 కోట్ల నిధులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. శబరిమలలో రాబోయే మండలకాల–మకరవిళక్కు యాత్ర సీజన్‌లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యాత్ర సాగేలా చూసేందుకు ప్రభుత్వం, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టిడిబి) కలిసి పనిచేస్తాయని సతీశన్ ఈ వారం ప్రారంభంలోనే వెల్లడించారు. ఈ ఏడాది మండలకాల–మకరవిళక్కు యాత్ర సీజన్ నవంబర్ మధ్యలో ప్రారంభమై, వచ్చే ఏడాది జనవరి మూడవ వారంలో ముగుస్తుంది.

# అడ్రస్ లేని పార్టీలకు రూ. వేల కోట్ల విరాళాలా?

- ఇలాంటి ఆరు చిన్న పార్టీలకు 2023-24లో రూ.1,700 కోట్లకు పైగా నిధులు..
- కాంగ్రెస్, వామపక్ష, బిఎస్‌పి, ఆప్ జాతీయ పార్టీలకు రూ.1480.43 కోట్లు మాత్రమే




**ప్రజాపక్షం/హైదరాబాద్:** గుజరాత్ రాజకీయాల్లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పెద్దగా కార్యకలాపాలు కనిపించని, ప్రజల్లో కూడా పెద్దగా ఉనికి లేని కొన్ని చిన్న రాజకీయ పార్టీలకు వేల కోట్ల రూపాయల విరాళాలు అందినట్లు ఓ పరిశోధనాత్మక నివేదిక వెల్లడించింది. 201920 నుంచి 202324 వరకు ఐదేళ్ల కాలంలో గుజరాత్‌లో నమోదైన పది గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు దాదాపు రూ.4,300 కోట్ల మేర విరాళాలు వచ్చినట్లు నివేదిక పేర్కొంది. ఆ పార్టీలు దేశంలో రాజకీయ పార్టీగా నమోదై ఉన్నప్పటికీ అసలు కార్యాలయాలు ఎక్కడున్నాయో, కార్యకలాపాలు ఏమిటో స్పష్టంగా కనిపించని కొన్ని పార్టీలకు వందల కోట్ల రూపాయల విరాళాలు అందుతున్నాయన్న అంశం తీవ్ర చర్చకు దారితీస్తోంది. గుజరాత్‌కు చెందిన ఆమ్ జన్మత్ పార్టీ, గరీబ్ కళ్యాణ్ పార్టీ, సత్యవాదీ రక్షక్ పార్టీ, స్వతంత్ర అభివ్యక్తి పార్టీ, న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ, భారతీయ జాతీయ జనతా పార్టీతో పాటు మరో నాలుగు పార్టీలకు భారీగా నిధులు అందినట్లు వెల్లడైనట్లు తెలుస్తుంది. 202324లో జాతీయపార్టీలైన కాంగ్రెస్, వాపక్షపార్టీ, బిఎస్‌పి, ఆమ్‌ఆద్మీకి కేవలం రూ. 1480.43 కోట్లు మాత్రమే నిధులు రాగా గుజరాత్‌లోని పైన పేర్కొన్న ఆరు చిన్నపార్టీలకు రూ.1,700 కోట్లకు పైగా విరాళాలు వచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా 2023 24 ఆర్థిక సంవత్సరంలో ఆమ్ జన్మత్ పార్టీకి ఆరు వందల కోట్ల రూపాయల నిధులు అందినట్లు పేర్కొనడం సంచలనంగా మారింది. సత్యవాదీ రక్షక్ పార్టీకి సుమారు రూ.330 కోట్లు, గరీబ్ కళ్యాణ్ పార్టీకి రూ.138 కోట్ల మేర విరాళాలు వచ్చినట్లు తెలుస్తుంది.అయితే భారీగా నిధులు అందుకున్న ఈ పార్టీల కార్యకలాపాలు మాత్రం క్షేత్రస్థాయిలో కనిపించకపోవడం ప్రశ్నలకు తావిస్తోంది. ఎన్నికల సంఘం వద్ద నమోదైన చిరునామాలను అనుసరించి ఓ మహిళా జర్నలిస్టు ఆయా కార్యాలయాలను సందర్శించగా, కొన్ని కార్యాలయాలు మూసివేసి ఉండటం, మరికొన్ని చోట్ల పార్టీ ప్రతినిధులు అందుబాటులో లేకపోవడం వంటి పరిస్థితులు ఎదురైనట్లు ఆమె పేర్కొన్నారు. కొందరు పార్టీ అధ్యక్షులు తాము పదవులకు రాజీనామా చేశామని, పార్టీలతో తమకు సంబంధం లేదని చెప్పినట్లు వెల్లడించారు. మరోవైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ ఆరు పార్టీలు కలిపి కేవలం 15 మంది అభ్యర్థులను మాత్రమే బరిలోకి దించినట్లు తేలిందని ఆమె పేర్కొన్నారు. భారీగా విరాళాలు అందుకున్న ఆమ్ జన్మత్ పార్టీ ఒక్క అభ్యర్థినే పోటీకి నిలబెట్టినట్లు తెలిపారు. సత్యవాదీ రక్షక్ పార్టీకి భారీగా నిధులు వచ్చినప్పటికీ ఎన్నికల ఖర్చుగా సుమారు రూ.8.48 కోట్లు మాత్రమే చూపించినట్లు పేర్కొన్నారు. మిగిలిన మొత్తంలో రూ.316 కోట్లను ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసినట్లు లెక్కల్లో చూపించినప్పటికీ, ఆ సంక్షేమ కార్యక్రమాలపై స్పష్టత లేదన్న ప్రశ్నలు తలెత్తాయి.రాజకీయ కార్యకలాపాలు, కార్యాలయాల నిర్వహణ, ఎన్నికల్లో పోటీ వంటి అంశాల్లో పెద్దగా ఉనికి కనిపించని పార్టీలకు ఇంత భారీ మొత్తంలో విరాళాలు ఎలా వస్తున్నాయి? ఆ నిధుల మూలాలు ఏమిటి? వాటిని ఎలా ఖర్చు చేస్తున్నారు? అన్న అంశాలపై సమగ్ర పరిశీలన అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే మరో పరిశోధనాత్మక నివేదిక కూడా వెలువడినట్లు సమాచారం.

**విరాళాల ముసుగులో నల్లధనాన్ని తెల్లధనంగా మార్చేందుకే ..**

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. భారీగా విరాళాలు అందుకున్న ఈ రాజకీయ పార్టీలకు నిధులు అందించిన వారు ఎవరు? ఏ సంస్థలు లేదా వ్యక్తులు ఈ విరాళాలు ఇచ్చారు? విరాళాలు ఏ ప్రయోజనం కోసం అందాయి? ఆ మొత్తాన్ని ఎన్నికల ప్రచారానికి కాకుండా ఇతర కార్యకలాపాలకు ఖర్చు చేశారా? లేక లెక్కల్లో మాత్రమే భారీ మొత్తాలు చూపించారా? అన్న అంశాలపై సమగ్ర దర్యాప్తు అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఆయా కంపెనీలు నల్లధనాన్ని తెల్లధనంగా మార్చుకునేందుకే ఈ చిన్న పార్టీలకు విరాళలలో రూపంలో నిధులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాజకీయ పార్టీలకు వచ్చే విరాళాలు, వాటి ఖర్చుల విషయంలో పారదర్శకత ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకం. ముఖ్యంగా ఎన్నికల్లో ప్రభావం చూపని పార్టీలకు వేల కోట్ల రూపాయల మేర నిధులు రావడం, అదే సమయంలో ఎన్నికల సంఘానికి సమర్పించిన వ్యయ వివరాల్లో కొన్ని లక్షల రూపాయలే చూపించడం వంటి వ్యత్యాసాలు ఉంటే వాటిపై సంబంధిత సంస్థలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. ఈ ఆరు పార్టీలతో పాటు మరో నాలుగు చిన్న పార్టీలకు కలుపుకుని 2023 24లో రూ.4,300 కోట్ల విరాళాలు ఎక్కడి నుంచి వచ్చాయి? రూ.3,500 కోట్ల ఖర్చు ఎక్కడ జరిగింది? ఎన్నికల సంఘానికి రూ.39.02 లక్షలే ఎందుకు చూపించారు? అనే మూడు ప్రధాన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లభిస్తేనే ఈ భారీ ఆర్థిక వ్యవహారం వెనుక ఉన్న అసలు చిత్రం బయటపడే అవకాశం ఉంది.

# స్వీడన్ పోలింగ్ పూర్తి: ఉత్కంఠ



**స్టాక్‌హోం:** అతివాదం విజృంభిస్తున్న యూరప్ ఖండంలో స్వీడన్ పార్లమెంటు రిక్స్‌డాగ్‌కు ఆదివారం ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. అభ్యుదయవాదులు–పచ్చిమితవాదులకు చెందిన రెండు ప్రధాన కూటములు ఈ ఎన్నికల్లో నువ్వా–నేనా అనే రీతిలో పోటీపడ్డాయి.1.06 కోట్లమంది జనాభాగల స్వీడన్‌లో 80 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు.భారత కాలమానం ప్రకారం,ఆదివారం అర్థరాత్రి దాటిన తర్వాత సోమవారం కొత్త తేదీలోకి క్యాలెండర్ ప్రవేశించేనాటికి ఎన్నికల ప్రాథమిక ఫలితాలు వెలువడతాయి. అప్పటివరకూ తీవ్రస్థాయిలో ఉత్కంఠ కొనసాగుతోంది. జర్మనీలో హిట్లర్ నాజీ వారసుల ఎ.ఎఫ్.డి.పార్టీ విజయం సాధించిన తర్వాత స్వీడన్ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఐతే ముందస్తు పోలింగ్ నివేదికల ప్రకారం వామపక్షాల నాయకత్వంలోని ప్రగతిశీలవాదులు స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. 349 స్థానాలున్న పార్లమెంటులో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ రాజకీయ కూటమికైనా నాలుగూశాతం ఓట్లు లభించాల్సి ఉంటుంది. వామపక్షాల తరపున సోషల్ డెమక్రటిక్‌పార్టీకి చెందిన మాగ్డలినా ఆండర్‌సన్ ప్రధానమంత్రి అభ్యర్థిగా ఉన్నారు. గతంలో ఆమె ప్రధానమంత్రి పదవి నిర్వహించారు.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత స్వీడన్‌లో అత్యధికకాలం అధికారంలో ఉన్నది వామపక్షాలు,సోషల్ డెమోక్రటిక్‌పార్టీయే.వామపక్ష కూటమిలో నాలుగు పార్టీలు,మితవాదుల కూటమిలో నాలుగుపార్టీలు ఉన్నాయి.మితవాద కూటమిలో మోడరేట్స్ తరపున ప్రస్తుతం ప్రధానమంత్రిగా ఉన్న క్రిస్టెర్‌సన్ పార్టీ (ఎం.పార్టీ) నాయకుడు ఉల్ఫ్ క్రిస్టెర్‌సన్ తానే మళ్ళీ రాబోయే నాలుగు సంవత్సరాలు ప్రధానమంత్రిగా ఉంటానని అప్పుడే మంకుపట్టు పడుతున్నారు.ఈ మితవాద కూటమిలో స్వీడన్ డెమోక్రాట్స్ ఆధిపత్యంలో ఉన్నప్పటికీ ఎం.పార్టీ నేత తానే ప్రధానిగా ఉంటానంటున్నారు.ఉత్తర యూరప్ స్కాండినేవియన్ ద్వీపకల్పదేశం స్వీడన్‌లో సోషల్ డెమోక్రాట్స్ తరపున మాగ్డలీనా ఆండర్‌సన్‌కు ప్రధానమంత్రిగా అవకాశాలు ఉన్నాయి. సర్వే నివేదికల ప్రకారం వామపక్ష కూటమికి 50.8 శాతం,మితవాదులకు 47.6 ప్రజల మద్దతు ఉందిజ ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ కూటమి అయినా 175 సీట్లు గెలుచుకోవాలి.1980లో నయా నాజీలు,మితవాదులు స్వీడన్ డెమోక్రటిక్‌పార్టీని స్థాపించారు.

# జావా సముద్రంలో నౌక బోల్తా


**140 మంది గల్లంతు**
**107 మంది సురక్షితం**



**జకర్తా:** ఇండోనేసియా జావా సముద్రంలో ప్రయాణికుల నౌకలో 140 మంది జాడ ఇంకా తెలియరాలేదు. వారి కోసం సహాయ బృందాలు హెలికాప్టర్ల ద్వారా ముమ్మర గాలింపు చేస్తున్నాయి. గాలింపు నిమిత్తం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. 243 మంది ప్రయాణికులతో వెళుతున్న 'వర్గో ట్రాన్స్‌పోర్ట్ 8' నౌక ప్రతికూల వాతావరణంలో చిక్కుకోవడంతో ఆ ఫెర్రీతో భూతలకేంద్రానికి సంబంధాలు తెగిపోయాయి. ఈ ఫెర్రీ కెప్టెన్ చివరిసారి డిస్‌ట్రెస్ మెసేజ్ పంపించారు. సముద్రంలో అలలు 10 అడుగుల కంటే చాలా ఎత్తుగా పైకి ఎగసిపడుతున్నాయని ఆందోళన చెందుతూ ఒక తుది సందేశం పంపించారు. తర్వాత నౌక తిరగబడిందని భావిస్తున్నారు. ఈ నౌకలో ఆరుగురు మరణించారు. వారి మృతదేహాలు స్వాధీనం చేసుకున్నారు. మరో 107 మందిని కాపాడారు. కానీ 140 మంది జాడ తెలియడంలేదు. వారికోసం గాలింపు కొనసాగుతోంది.ఈ నౌకను చివరిసారిగా బంజార్‌మాసిన్‌కు 148 కి.మీ దూరంలో ఉన్నట్లు గుర్తించారు. సురబయ నుండి బయలుదేరిన ఈ ఫెర్రీ ఆదివారం మధ్యాహ్నంనాటికి దక్షిణ కాళీమంతన్‌లోని బంజర్‌మాసిన్ నగరానికి చేరుకోవాల్సి ఉంది. కానీ మధ్యలోనే ఈ ఫెర్రీతో సంబంధాలు తెగిపోయాయి.జావా సముద్రంలో ఇతర నౌకలన్నింటినీ అప్రమత్తం చేశారు. అందరికీ సమాచారం పంపించారు. ఎవరైనా గల్లంతైనట్లు కనిపిస్తే తక్షణం కాపాడి నౌకలోకి ఎక్కించుకోవాలని ఆదేశాలు వెళ్ళాయి.త్రిసాక్తి ఓడరేవు వద్ద ప్రయాణికుల బంధువులు తక్షణ సమాచారం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఇండోనేసియా 17000 కు పైగా ఉన్న ద్వీపాల సమూహదేశం. ఇక్కడ చవుకగా రవాణాకోసం ఎక్కువగా ఫెర్రీలను ఉపయోగిస్తారు.గతనెలలో కూడా 211 మంది ప్రయాణికులతో వెళుతున్న ఇండోనేసియా ఫెర్రీలో మంటలు చెలరేగాయి. టూరిస్టు ఐలాండ్‌కు సమీపంలో ఆనాడు ప్రమాదం సంభవించింది. కేవలం రెండు వారాల క్రితమే ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. అదేవిధంగా ఫిలిప్పీన్స్‌లో కూడా ఒక ప్రయాణికుల ఫెర్రీలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 76 మంది మరణించారు. మరో 10 మంది కనిపించకుండాపోయారు. నాలుగురోజుల క్రితమే ఫిలిప్పీన్స్‌లో ఈ ఘటన జరిగింది.

# యోధులైతే మా సైన్యాన్ని ఎదుర్కోండి

**అమెరికాకు పెజెష్కియన్ సవాల్**



**టెహ్రాన్:** బెదిరింపులకు, ఒత్తిళ్లకు ఇరాన్ దేశం, ఇరాన్ ప్రజలు లొంగిపోయే ప్రశ్నే ఉత్పన్నంకాబోదని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామున ఎక్స్‌వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ,బెదిరింపులతో ఇరాన్ ప్రజలను లొంగదీసుకోలేరన్నారు.''మీరు యోధులైతే మా సైన్యాన్ని ఎదుర్కోండి'' అని సవాలు చేశారు. అదేవిధంగా అత్యవసర సేవలపై దాడులు చేయడంవల్ల మానవతాసేవలు,పౌరసేవలకు తీవ్ర విఘాతం కలుగుతోందని చెబుతూ ఇది యుద్ధనేరం కాదన్నారు. ఈ దాడుల చెల్లుబాటును,చట్టబద్ధతను ప్రశ్నించారు.పౌర మౌలిక సదుపాయాలపైన,ఆహార సరఫరాలపైన,ప్రజల జీవనోపాధిపైనా ఎందుకు దాడులు చేస్తున్నారు? అని ఎక్స్ వేదికగా ఆయన ప్రశ్నించారు.''వారు మనుషులైతే ఎందుకు ప్రజలకు ఔషధాలు,ఆహారం,నీటిని సరఫరా కాకుండా అడ్డుకుంటున్నారు.'' అని ప్రశ్నించారు.ఇరాన్ ప్రజలను బెదిరించి లొంగదీసుకోలేరు,కష్టకాలంలో వారు పాలకులకు అండగా నిలబడ్డారు అని పేర్కొన్నారు. ఇరాన్‌పై ఎకనామిక్ డి డే ను అమలు చేస్తున్నట్లు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఇరాన్‌కు సహాయం చేసే దేశాలు కూడా మూల్యం చెల్లించాల్సివస్తుందని ఆయన హెచ్చరించారు. కానీ ట్రంప్ ప్రస్తుతం ఏకాకిగా మారుతున్నారు. కాగా ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లో ఇరాన్ బుషెర్ రాష్ట్రం నుండి 2,364 బిలియన్ డాలర్లు విలువైన ఎగుమతులు చేసినట్లు ఆ రాష్ట్ర కస్టమ్స్ విభాగాధిపతి అలీ సొలోమైనీ ప్రకటించారు.రాష్ట్రంలో వ్యాపారులు 32 దేశాలకు ఈ మేరకు ఎగుమతులు చేశారని చెప్పారు.

# చేతల రాజకీయ శకానికి నాంది పలికిన మోదీ

- పత్రికాగోష్ఠిలో అమిత్ షా భజన
- మోదీ పనితీరుపై 17 నుండి 'సేవా సంకల్ప్ అభియాన్'
- 2029 నాటికి 21 రాష్ట్రాలో యుసిసి అమలు

**ముంబయి:** దేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతల రాజకీయ శకానికి నాంది పలికారని కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా ముంబైలో ఆదివారం జరిగిన పత్రికాగోష్ఠిలో చెప్పారు. సెప్టెంబరు 17వ తేదీన నరేంద్రమోదీ జన్మదినోత్సవంతోపాటు గుజరాత్‌లోముఖ్యమంత్రిగా,కేంద్రంలో ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు పరిపాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన సాధించిన రాజకీయ విజయాలపై నెలరోజులపాటు ప్రచార కార్యక్రమాలను ప్రకటించడంకోసం అమిత్ షా ముంబైలో పత్రికాగోష్ఠి నిర్వహించారు.మోదీ రాజకీయ పనితీరుపై ''సేవాసంకల్ప్ అభియాన్'' పేరుతో నెలరోజులపాటు దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లుఅమిత్ షా ప్రకటించారు.''ప్రజాసేవే దైవ సేవ'' అనే నినాదంతో ''సేవా సంకల్ప్ అభియాన్' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2047వ సంవత్సరం నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో ప్రజలు భాగస్వాములు కావాల్సిందిగా ఈ ప్రచారం సందర్భంగా విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఈ ప్రచారంలో యువకులకు ప్రయోజనం చేకూర్చేవిధంగా రక్తదానం,పెయింటింగ్,వక్తృత్వపోటీలు సహా 12 ప్రధాన కార్యక్రమాలుంటాయన్నారు. మోదీ జన్మస్థలం వాద్‌నగర్‌కు ఆయన ప్రాతినిధ్యం వహించే వారణాసి లోక్‌సభ నియోజకవర్గం మధ్య మోటార్ సైకిల్ యాత్ర నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు భరోసా ఇస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ''ఇండియా ఫస్ట్'' అనే సూత్రం ఆధారంగా భారతదేశం బలమైన విదేశీ,రక్షణపరమైన విధానాలకు సాక్ష్యంగా నిలిచిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడి ప్రపంచంలోనే ఐదు పెద్ద దేశాల సరసన చేరిందన్నారు. దేశ జిడిపి వృద్ధి మొదటి త్రైమాసికంలో 7.8 శాతానికి ఎదిగిందని,ఇది బలమైన ఆర్థిక పనితీరుకు చిహ్నమన్నారు.దేశంలో 25 కోట్లమందిని పేదరికం నుండి విముక్తి చేశామన్నారు. 81 కోట్లమది ప్రజలకు ఆహార గింజలు సరఫరా చేస్తున్నామని చెప్పారు. 44 కోట్లమందికి ఉజ్వల గ్యాస్,రూ.5 లక్షల వరకూ ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా రిజర్వేషన్,ఆర్టికల్ 370 రద్దు విషయాలు ప్రస్తావించారు.ఇటీవల మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం ప్రారంభించామని చెప్పారు. దేశ చరిత్రను వలస విముక్తి చేస్తామని, అంటే దాని అర్థం గతాన్ని తుడిచిపెట్టడం కాదని,ప్రపంచానికి చారిత్రక వాస్తవాలను భారతీయ దృక్కోణంలో ప్రామాణికస్థాయిలో తెలియజేస్తామన్నారు.
అవినీతి,కులతత్వం,వంశపారంపర్యరాజకీయాల నుండి దేశాన్ని దూరంగా తీసుకువెళ్ళి ''చేతల రాజకీయాలు'' అనే ఒక సరికొత్త శకానికి నరేంద్ర మోదీ పాలనలో తెర లేచిందని చెప్పారు.మోదీ దేశంలో అరుదైన విజయాలను సాధించారని,భద్రత,ఆర్థిక సామర్థ్యం విషయాల్లో ఒక ప్రపంచ శక్తికేంద్రంగా భారతదేశాన్ని పరివర్తన చెందేలా మోదీ చేతల రాజకీయాలు ప్రదర్శించి నవ శకానికి నాంది పలికారన్నారు. 'పనితీరు ఆధారిత రాజకీయ కొత్త శకానికి' నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారన్నారు.
ముంబైలో అమిత్ షా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం 2029 నాటికి 21 రాష్ట్రాలలో ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్‌కోడ్)ను ప్రవేశపెడుతుందని చెప్పారు.
దేశ రాజకీయ పాలనలో 2014కు ముందు అవినీతి,కులతత్వం,వంశపారంపర్య రాజకీయాలు రాజ్యమేలాయని, ఈ మూడు రుగ్మతలూ దేశాన్ని పట్టి పీడించాయని, వాటికి దూరంగా 2014 నుండి 2026 వరకూ ఆ తర్వాత కూడా దేశాన్ని,దేశ ప్రజలను చేతల రాజకీయాల నవ శకం దిశగా మళ్ళించామని, ఈ ఘటన మోదీకే దక్కుతుందని, ఈ చేతల రాజకీయాలకు,పనితీరు ఆధారిత రాజకీయాలకు దేశంలో మోదీ శ్రీకారం చుట్టారన్నారు. సెప్టెంబరు 17వ తేదీన నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా ఈ విషయాలపై దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.అక్టోబరు 17వ తేదీ వరకూ ఈ ప్రచార కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. దేశంలో విధానపరమైన అలసత్వం,విధానపరమైన స్తబ్దత,సంకీర్ణ రాజకీయాల ఒత్తిళ్ళు,నిర్ణయాలు తీసుకోవడంతో తీవ్ర బలహీనతలు వంటి రుగ్మతల నుండి మోదీ పరిపాలన దేశాన్ని విముక్తి చేసిందని చెప్పారు. దేశంలో అరుదైన విజయాలు సాధించిన మోదీ భద్రత,ఆర్థికసామర్థ్యం విషయంలో భారత్‌ను ప్రపంచశక్తికేంద్రంగా తీర్చిదిద్దారన్నారు. ప్రజలకు సేవల చేయడంకోసమే ఆయన ఎన్నికల్లో గెలుస్తూ వచ్చారని,ప్రజలక్షేమంకోసం, దేశ క్షేమంకోసం ఆయన కృషి చేశారని,సుదీర్ఘకాలం ఆయన దేశానికి సేవలు అందించారని చెప్పారు.

# జర్మనీలో ఎఎఫ్‌డి వ్యతిరేక ర్యాలీలు

**20 నగరాల్లో 1.50 లక్షల మంది వీధుల్లోకి**



**బెర్లిన్:** తూర్పు జర్మనీలో 81 సంవత్సరాల తర్వాత మితవాద,నాజీ హిట్లర్ వారసత్వ ఎ.ఎఫ్.డి (ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ)పార్టీ గతవారం సాక్సోనీ–అన్‌హాల్ట్ రాష్ట్ర ఎన్నికల్లో భారీ ఆధిక్యతావిజయం సాధించి అధికారానికి చేరువైంది. మూడు స్థానాలు తగ్గినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఆ తర్వాత జర్మనీలో ఆ పార్టీని వ్యతిరేకిస్తూ లక్షలమందిభారీ నిరసన ప్రదర్శనలు చేశారు. ఎ.ఎఫ్.డిపై నిషేధం విధించాలని కోరుతున్న ఫ్రూఎఫ్ సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ఇరవై నగరాల్లో 1.50 లక్షల మంది ప్రదర్శకులు ఎ.ఎఫ్.డి.ని వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వచ్చి నినాదాలు చేశారు. ముఖ్యంగా బెర్లిన్,మ్యూనిచ్,హాంబర్గ్ నగరాలలో భారీ ప్రదర్శనలు జరిగాయి. ''ఎ.ఎఫ్.డిని నిషేధించండి, ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం అవసరం లేదు...'' అని ప్రదర్శకులు నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. సాక్సోనీ–అన్‌హాల్ట్‌లో రాజ్యాంగ శత్రువులైన ఎఎఫ్‌డి అధికారం చేపట్టకుండా అడ్డుకునేందుకు అనేకమంది స్వచ్ఛందంగా వీధుల్లోకి వస్తున్నారు. అమెరికాలో ''మాగా'' ఉద్యమం తరహాలో ఎ.ఎఫ్.డి జర్మనీలో నాజీ నియంతృత్వ భావాలను విస్తరింపజేయడంతో ఆ దేశంలో ప్రధాన స్రవంతి పార్టీలు ఎ.ఎఫ్.డిని చీదరించుకుంటున్నాయి. కానీ ''ఓస్టాల్జీ''లో బ్రతుకుతున్న తూర్పు జర్మనీ ప్రజలు తమ మౌలిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈ నాజీపార్టీనే ఆశ్రయించి ఓటువేసి గెలిపించారు. ఐతే ఎ.ఎఫ్.డి.కి ఇంకా మూడుస్థానాలు తక్కువ అయ్యాయి. ఆ మూడు స్థానాల బలాన్ని సమకూర్చేందుకు జర్మనీపార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. వారితో కలిసి పనిచేసేందుకు తిరస్కరిస్తున్నాయి.

# 'ట్రాఫిక్ లైట్లు లేని కూడలి' (మొదటి పేజీ తరువాయి)

కృషిచేయాలని ఆయన 'బ్రిక్స్' కూటమి నాయకులకు పిలుపునిచ్చారు.'నియమాలు లేని ప్రపంచం ట్రాఫిక్ లైట్లు లేని కూడలి లాంటిది. అక్కడ గందరగోళం, అస్తవ్యస్థత దాదాపు ఖాయం.నిష్పక్షపాతం, న్యాయం అనేవి సార్వత్రిక ఆకాంక్షలు, అంతర్జాతీయ నియమాలను అన్ని దేశాలూ రూపొందించాలి' అని ప్రధాని మోదీ అన్నారు.'గ్లోబల్ సౌత్ దేశాలు సంయుక్తంగా 'అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ పాలనను పరిరక్షించాలి. సార్వభౌమ సమానత్వం, అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోకపోవడం, వివాదాల శాంతియుత పరిష్కారం వంటి అంతర్జాతీయ సంబంధాల ప్రాథమిక నిబంధనలను కాపాడాలి. అలాగే అంతర్జాతీయ చట్టం, అంతర్జాతీయ నిబంధనలు అందరికీ వర్తించేలా చూడాలి' అని జీ జిన్‌పింగ్ అన్నారు. ఈ సందర్భంగా, 'ద్వంద్వ ప్రమాణాలను విడనాడాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. అన్ని దేశాలు, వాటి పరిమాణం, బలం లేదా సంపదతో సంబంధం లేకుండా అంతర్జాతీయ సమాజంలో సమాన సభ్యులే' అని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిథ్యాన్ని పెంచేందుకు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. 'బ్రిక్స్' సహకారంపై దృష్టిని పెంచడానికి జీ జిన్‌పింగ్ యొక్క ఐదు సూత్రాల చొరవ, సమగ్ర కృత్రిమ మేధస్సు చట్రాన్ని ఏర్పాటు చేయడం, వాణిజ్యం, పెట్టుబడులను సులభతరం చేయడం, డిజిటల్ పరిశ్రమ సంబంధాలను పెంపొందించడం, 'తెలివైన తయారీ'ని అభివృద్ధి చేయడం, ఉమ్మడి శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించడం. పెద్ద భాషా నమూనాలను అభివృద్ధి చేయడంలో, వర్తింపజేయడంలో సహకారానికి మద్దతు ఇవ్వడానికి ప్రత్యేకమైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెమినార్లు, శిక్షణా కోర్సులను నిర్వహించడానికి, ఒక ఓపెన్ ఏఐ ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి బ్రిక్స్–ఏఐ ఓపెన్ సోర్స్ కమ్యూనిటీని స్థాపించడంలో చైనా మార్గదర్శిగా నిలుస్తుందని ఆయన మొదటి చొరవ గురించి చెప్పారు. ఇంజినీర్ల ఉమ్మడి అభివృద్ధి సామర్థ్య ప్రమాణాల పరస్పర గుర్తింపుకోసం 'బ్రిక్స్' ఇంజినీర్ల పెంపక కూటమిని ఏర్పాటు చేయాలని చైనా ప్రతిపాదిస్తోందని ఆయన అన్నారు. నా 'బ్రిక్స్' యువజన మార్పిడి కార్యక్రమాన్ని ప్రారంభిస్తుంది అని జిన్‌పింగ్ చెప్పారు.

# ఢిల్లీలోని గ్లోవ్స్ తయారీ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ:** వాయువ్య ఢిల్లీ స్వరూప్‌నగర్‌లో ఉన్న ఒక గోదాము, ఫ్యాక్టరీలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించి ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం జూడో దుస్తులు, బాక్సింగ్ గ్లోవ్స్ తయారు చేసే ఫ్యాక్టరీలోని గ్రౌండ్, మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన పక్క భవనంలోనివారు భయంతో కిందకు దూకడంతో ఆరుగురు గాయపడ్డారు. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించగా, వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. సమాచారం అందిన వెంటనే ఘటనాస్థలికి 15అగ్నిమాపక వాహనాలను పంపామని, సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారని ఢిల్లీ అగ్నిమాపక శాఖ పేర్కొంది. నష్టంపై అంచనా వేస్తున్నారు.





# సంఘటితమవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణానికి సహాయం అందిస్తుందని సిఎం చెప్పారు. ఆర్యవైశ్యులకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోందని, ఆర్యవైశ్యులకు ఒక కార్పొరేషన్ పదవి ఇచ్చామని, కొడంగల్‌లో ఒక మున్సిపాలిటీలో ఆర్యవైశ్య కులానికి చైర్మన్ పదవి ఇచ్చామని, రాజకీయాల్లో సైతం మీ వాటా మీరు తీసుకోవాల్సిందేనన్నారు. ఆర్యవైశ్యులకు ముందుచూపు, జాగ్రత్త అనేది వాళ్ల డిఎన్ఎలోనే ఉందని కొనియాడారు.

**రోశయ్యకు ప్రత్యేక గుర్తింపు**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దివంగత మాజీ గవర్నర్, మాజీ సిఎం రోశయ్యను గుర్తి చేసుకొంటూ ప్రశంసల వర్షం కురిపించారు.రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారే తప్ప ఎవరినీ ఎప్పుడూ దూషించరన్నారు. రాష్ట్రం విడిపోయినా రోశయ్య విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఉండాలని తాము నిర్ణయించామన్నారు. తాను సుదీర్ఘ కాలం రాజకీయాల్లో రాణిస్తానని రోశయ్య ఏనాడో గుర్తించారన్నారు.శాసనమండలిలో దూకుడుగా తాను మాట్లాడితే రోశయ్య కాస్త దూకుడు, ఆవేశం తగ్గించుకొంటే అనుభవంతో ముందుకు వెళుతానని తొలినాళ్లల్లోనే తనను ఆశీర్వదించారన్నారు. ఆర్థిక లావాదేవీల్లో రోశయ్యది ప్రత్యేక స్థానం ఉందని, ఆ కారణంగా చెన్నారెడ్డి, విజయభాస్కరరెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డిలు తమ ప్రభుత్వంలో రోశయ్యకే ఆర్థిక శాఖ అప్పచెప్పారన్నారు.

# చేయడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి లాంటి మాస్ లీడర్ కాంగ్రెస్‌కు అవసరమని చెప్పిన మొదటి వ్యక్తిని తానేనని కొండా సురేఖ తెలిపారు. రేవంత్‌రెడ్డి రైతుల కోసం పాదయాత్ర చేశారని, అదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందని, తనకు మంత్రి పదవి వచ్చిందన్నారు. ఎలాంటి తప్పులు చేయకుండా మంత్రి బాధ్యతలు నిర్వర్తించానన్నారు. మంత్రి పదవి నుంచి తొలగించినందుకు బాధ లేదని, కానీ అకారణంగా పదవి నుంచి తొలగించారని బాధ ఉందని కొండా సురేఖ అన్నారు. మంత్రి పదవి నుంచి తొలగించిన అనంతరం అల్లర్లు చేయాలని కొందరు ఫోన్ చేశారని కొండా సురేఖ వెల్లడించారు. కానీ తాను వారిని వారించానని వివరించారు. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కార్యకర్తలకు చెప్పానని, అండగా ఉన్నందుకు వారికి ధన్యవాదాలని చెప్పారు. తనకు పదవి ఉన్నా లేకపోయినా, తన భర్త కొండా మురళీతో కలిసి ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని ఆమె అన్నారు. తామిద్దరం ప్రజల సమస్యలపై పనిచేస్తూ, అభివృద్ధిని సాధించే దిశగా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానం తనను సంప్రదిస్తోందన్న వార్తల నేపథ్యంలో, తనకు ఫోన్ కాల్స్ వస్తున్నాయని, వేరే పార్టీలోకి మారవద్దని సూచనలు అందుతున్నాయని ఆమె తెలిపారు. 'మేము ఎక్కడికీ వెళ్లకూడదని (వేరే పార్టీలో చేరకూడదని), పార్టీనే మమ్మల్ని చూసుకుంటుందని మాకు చెబుతున్నారు. వేరే పార్టీలో చేరే ఉద్దేశం మాకు లేదని మేము వారికి చెబుతున్నాము. మేము కాంగ్రెస్‌లోనే కొనసాగుతాము. కచ్చితంగా కాంగ్రెస్ తరపునే పోటీ చేస్తాము. గెలిచి, కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువస్తాము' అని ఆమె అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుండి తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి తనకు టికెట్ లభిస్తుందని, మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికై తిరిగి మంత్రిని అవుతానని సురేఖ ధీమా వ్యక్తం చేశారు. పదవులు ఇవాళ ఉంటాయి, రేపు పోతాయి, ప్రజల్లో చిరస్థాయిగా ఉండటమే తమ లక్ష్యమన్నారు. ప్రస్తుతం అవకాశవాద రాజకీయాలు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము నమ్మిన రాజశేఖర్‌రెడ్డి కోసం గతంలో మంత్రి పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. మంత్రి పదవి పోయిందని ఇంట్లో కూర్చోబోమని, ప్రజల్లోనే ఉంటామని, మున్సిపల్ ఎన్నికల్లో అన్నీ సీట్లు గెలుస్తామని సురేఖ స్పష్టం చేశారు. వరంగల్ లో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చేసిన వ్యాఖ్యలపై కొండా మురళీ స్పందిస్తూ కొద్ది రోజుల్లో ఆయన ఎమ్మెల్సీ పదవి పోతుందని, మళ్లీ పదవీ రాదని అన్నారు. తాను పార్టీ మారినప్పుడు ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేశానని, దమ్ముంటే సారయ్య ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేయాలని అన్నారు. కొండా దంపతులు దాదాపు పది రోజుల తర్వాత బహిరంగంగా కనిపించడంతో హనుమకొండ రామ్‌నగర్‌లోని వారి నివాసం వద్ద కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొండా దంపతులను కలిసేందుకు ఉదయం నుంచే ముఖ్య కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున చేరుకున్నారు.

# ఆంక్షలు ప్రభావం

(మొదటి పేజీ తరువాయి)

మధ్య కొనసాగుతున్న సైనిక ఘర్షణల నడుమ టెహ్రాన్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని పెంచుతూ, అమెరికా ఇరాన్‌పై కొత్త ఆర్థిక ఆంక్షలు విధించిన కొన్ని వారాల తర్వాత ఇరాన్ నాయకుడి వ్యాఖ్యలు వెలువడ్డాయి. మరింత సమతుల్యమైన, సమ్మిళితమైన, న్యాయమైన అంతర్జాతీ వ్యవస్థను నిర్మించడంలో 'బ్రిక్స్' మరింత కీలకపాత్రను పోషించాలని మసౌద్ పెజెష్కియన్ పిలుపునిచ్చారు. స్థితిస్థాపకత, సహకారం, సుస్థిరతలను ఆచరణాత్మక చర్యలుగా మార్చాలని ఆయన నొక్కిచెప్పారు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ చేస్తున్న సైనిక దురాక్రమణను ప్రస్తావిస్తూ, భద్రత లేకుండా ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగించలేమని ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ తేల్చిచెప్పారు. ఇరాన్ ఆర్థిక, ఇంధన, అభివృద్ధి మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులు జాతీయ సరిహద్దులను దాటి, ప్రాంతీయ, ప్రపంచవ్యాప్త పరిణామాలకు దారితీయవచ్చని పెజెష్కియన్ అన్నారు. పౌరులు చనిపోవడం, దశాబ్దాలుగా నిర్మించిన మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో ఇరాన్ ప్రజలు భారీ మూల్యం చెల్లించుకున్నారని చెప్పారు. పౌరులను రక్షించడం, పౌర లక్ష్యాలపై దాడులు సాధారణీకరణ కాకుండా నిరోధించడం అంతర్జాతీయ సమాజం యొక్క బాధ్యత అని ఇరాన్‌అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ తెలియజేశారు. దేశాల గమ్యాలు అంతకంతకూ పరస్పరం ముడిపడి ఉన్న ప్రస్తుత తరుణంలో, 'స్థితిస్థాపకత', 'సహకారం', 'సుస్థిరత' అనే ఈ సదస్సు ఇతివృత్తం ప్రాథమి క ప్రపంచ అవసరాలను ప్రతిబింబిస్తోందని పేర్కొంటూ, ఈ సదస్సును నిర్వహించినందుకు భారతదేశానకి, ఆ దేశ ప్రజలకు , ప్రధానమంత్రి నరేంద్రమోదీకి పెజెష్కియన్ ధన్యవాదాలు తెలిపారు.

# ఆయుధంగా మార్చొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రెండు రోజుల బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ముగింపు సభలో ప్రధాని ప్రసంగిస్తూ, 'సాంకేతికత, కీలక ఖనిజాలకు ఆయుధాలుగా మార్చడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఉమ్మడి పురోగతి, శ్రేయస్సుకు ఆటంకం కలిగించవచ్చని ఆయన హెచ్చరించారు. వారి గొంతుకను వినడం, వారి అనుభవాలకు విలువ ఇవ్వడం, పరిష్కారాలను వారిపై రుద్దకుండా, వారితో భాగస్వామ్యంతో రూపొందించడం వల్ల, గ్లోబల్ సౌత్‌లోని అభివృద్ధి చెందుతున్న దేశాలు బ్రిక్స్‌ను ఎక్కువగా విశ్వసిస్తున్నాయని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచ జనాభాలో సుమారు 49.5 శాతం, ప్రపంచ జిడిపిలో 40శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 11 ప్రధాన ఆర్థిక వ్యవస్థల కూటమి అయిన బ్రిక్స్ వార్షిక శిఖరాగ్ర సమావేశం, లాజిస్టిక్స్, సరఫరా గొలుసులు, స్టార్టప్‌లు, అంటువ్యాధుల నియంత్రణ రంగాలలో కీలక ఫలితాలతో ముగిసింది. 'మనం వేర్వేరు వాస్తవాలలో పాతుకుపోయి ఉండవచ్చు. కానీ, కలిసికట్టుగా సహకారంతో ఎదిగి మానవాళి కోసం వికసిస్తాం. మన వైవిధ్యమే మన గుర్తింపుగా, మన సహకారమే మన స్ఫూర్తిగా, మన పురోగతి సకల మానవాళికి సేవగా నిలవాలి' అని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌లతో సహా ఈ కూటమిలోని అగ్రనాయకుల సమక్షంలో ప్రధానమంత్రి మోదీ అన్నారు.అస్థిరమైర భౌగోళిక—రాజకీయ వాతావరణాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాల స్థితిస్థాపకతను పెంచడం ఎంత ముఖ్యం అనే విషయాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఈ కూటమికి న్యూఢిల్లీ అధ్యక్షత వహించడం స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత అనే నాలుగు స్థంభాలపై కేంద్రీకృతమైందన్నారు.ఈ నాలుగు మూలస్థంభాల ఆధారంగా, 'బ్రిక్స్' ద్వారా భారతదేశం సమ్మిళిత ప్రపంచవృద్ధిని ప్రోత్సహించాలని కోరుకుంది.ఎందుకంటే ఈ కూటమిలో అభివృద్ధి చేసిన పరిష్కారాల ప్రయోజనాలు కేవలం భారతదేశానికే పరిమితం కాకూడదని అది విశ్వసిస్తుంది. 'మహమ్మారులు, వాతావరణ విపత్తులు, సరఫరా గొలుసు అంతరాయాలు వంటివి నేటి పరస్పర అనుసంధాన ప్రపంచంలో ఏ సంక్షోభమూ ఒకే ప్రాంతానికి పరిమితం కాదని నిరూపించాయి. అందువల్ల బ్రిక్స్ కూటమిలో మేం స్థితిస్థాపకతను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాం' అని ప్రధాని మోదీ జోడించారు. సవాళ్లను సకాలంలో గుర్తించడం, వాటికి సిద్ధఃగా ఉండటం, తక్షణ చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం అని మోదీ వాదించారు. బ్రిక్స్ పట్ల భారతదేశ వైఖరి స్నేహం, భాగస్వామ్యం, సహకారాన్ని పెంపొందించిందని ఆయన వివరించారు. మన నగరాల మధ్య ఉత్తమ పద్ధతులను పంచుకోవడాన్ని సులభతరం చేయడానికి 'బ్రిక్స్ అర్బన్ మొబిలిటీ హబ్'ను ఏర్పాటు చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# సమగ్ర విధానం

(మొదటి పేజీ తరువాయి)

ధరకు చమురును కొనుగోలు చేస్తే తప్ప రష్యా ముడి చమురును రవాణా చేసే ఏ ఓడకైనా బీమా చేయకుండా జి–7 దేశాలు, యురోపియన్ యూనియన్, యూకే పాశ్చాత్య కంపెనీలను నిషేధించాయి. బీమా రంగానికి సంబంధించిన ఈ ఆంక్షలు రష్యా ముడిచమురు ఎగుమతులపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి.'మూలధనం, శ్రమ, సాంకేతికతలను తరలించడానికి మాకు స్వతంత్ర మార్గాలున్నాయి. వాస్తవానికి, బాహ్య ఒత్తిడితో సంబంధం లేకుండా మేం పనిచేయగలం' అని ఇక్కడ జరిగిన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ముగింపు సభలో పుతిన్ అన్నారు. 'బీమా యంత్రాంగాన్ని, ధాన్యం మార్కెట్‌ను ఏర్పాటు చేయడం వంటి కొన్ని ఆశాజనకమైన కార్యక్రమాలను మేం ముందుకు తీసుకెళ్తున్నాం. ఇవి రష్యా ప్రతిపాదనలు. ఇతర సభ్యదేశాలన్నీ వీటిని ఉపయోగించుకోవాలని మేం ఆహ్వానిస్తున్నాం' అని మరింత లోతుల్లోకి వెళ్లకుండా పుతిన్ వివరించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) 140బిలియన్ డాలర్ల విలువైన ప్రాజెక్టులను నిర్వహిస్తోందని పుతిన్ దాని పనితీరును ప్రశంసించారు. ఎన్‌డిబి అనేది బ్రిక్స్ దేశాలచే స్థాపించబడిన ఒక బహుపాక్షిక అభివృద్ధి బ్యాంక్. 'ప్రపంచ సవాళ్లు తలెత్తుతూనే ఉన్నందున, వాటి లక్షణాలతో పాటు, మూల కారణాలను కూడా పరిష్కరించడానికి మనం ఒక సమగ్రమైన విధానాన్ని అవలంభించాలి' అని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. 'గ్లోబల్ సౌత్ దేశాలు కలిసికట్టుగా మరింత మెరుగ్గా (ప్రపంచవ్యాప్తంగా) పురోగమించాలి. పరిపాలనా వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడంతో పాటు, సాంప్రదాయ, అసాంప్రదాయ భద్రతాపరమైన ముప్పులను కూడా ఎదుర్కోవాలి' అని ఆయన అన్నారు. తీవ్రమైన ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, ఒక స్వతంత్ర మార్గాన్ని ఎంచుకోవడంపై బ్రిక్స్' దృష్టి సారిస్తున్నందున, దాని ప్రపంచ స్థాయి ప్రతిష్ఠ పెరుగుతోందని పుతిన్ ప్రస్తుతించారు. నేటి సమావేశంలో విస్తృత భాగస్వామ్యం, బ్రిక్స్ పట్ల అంతర్జాతీయ ఆసక్తి పెరుగుతూనే ఉందని ధృవీకరిస్తోంది.'స్వతంత్ర మార్గాన్ని అనుసరించాలనే మా నిబద్ధత, అంతర్జాతీయ చట్టం, ఐక్యరాజ్య సమితి ఛార్టర్‌లోని కీలక నిబంధనల మార్గదర్శకత్వంలో సమస్యలను సమష్టిగా పరిష్కరించుకోవాలనే మా ఆకాంక్షతో సహా, మా ప్రధాన విలువలు, ఆదర్శాలు ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి ఆకర్షణీయంగా ఉన్నాయి'అని కూటమిలోని పూర్తి సభ్య దేశాలతోపాటు, దాని భాగస్వామ్యదేశాలు కూడా హాజరైన సభలో పుతిన్ వివరించారు.

# మహిళల ఆసియా కప్ విజేత భారత్

మహిళల ఆసియా కప్‌ను ఎనిమిదోసారి ముద్దాడింది భారత జట్టు. అజేయంగా ఫైనల్ చేరిన టీమిండియా ఏకపక్ష పోరులో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. దెబ్బకు దెబ్బ అన్నట్టుగా గత సీజన్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. మెరుపు బ్యాటింగ్‌తో లంక బౌలర్లను హడలెత్తించిన ఓపెనర్లు షఫాలీ వర్మ(68), స్మృతి మంధాన(59) అర్ధ శతకాలతో భారీ స్కోరందించగా.. ఆపై శ్రీచరణి(4–20) తిప్పేసింది. నిరుడు స్వదేశంలో వన్డే ప్రపంచకప్ విజేతగా చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టు ఆసియా కప్‌ను ఒడిసిపట్టింది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్లో శ్రీలంకను ఓడించిన భారత్ తమకు తిరుగులేదని చాటింది. 184 పరుగుల ఛేదను డిఫెండింగ్ ఛాంపియన్‌ను 110 పరుగులకే పరిమితం చేసిన ఇండియా 72 రన్స్ తేడాతో గెలిచింది. రెండేళ్ల క్రితం టైటిల్ పోరులో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది.



**దీప్తి, చరణి మ్యాజిక్...** భారీ ఛేదనలో శ్రీలంకకు తొలి ఓవర్లోనే షాకిస్తూ ఓపెనర్ దులానీ(0)ని క్లీన్ బౌల్ చేసింది క్రాంతి. ఆపై క్రాంతి, నందినిలు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో లంక కెప్టెన్ చమరి ఆటపట్టు(36), విష్మి గుణరత్నే(30)లు తడబడ్డారు. పవర్ ప్లేలో లంక 31 రన్స్ చేసిందంతే. కాస్త కుదురుకున్నాక భారీ షాట్లతో భయపెట్టిన ఆటపట్టును దీప్తి శర్మ బోల్తా కొట్టించింది. దీప్తి సంధించిన బంతిని ఆడేందుకు క్రీజును వదిలిని లంక కెప్టెన్ అంచనా తప్పింది. అంతే.. బంతిని అందుకున్న రీచా ఘోష్ రెప్పపాటులో స్టంపింగ్ చేసింది. అదే ఓవర్లో గుణరత్నేసైతం బౌల్డవ్వగా లంక మూడో వికెట్ కోల్పోయింది. అక్కడ నుంచి లంక స్కోర్ వేగం తగ్గింది. నీలాక్షిక సిల్వ(22) దూకుడుగా ఆడే ప్రయత్నం చేసినా.. శ్రీ చరణి(420) ఒకే ఓవర్లో రెండు వికెట్లతో లంక ఆశలపై నీళ్లు చల్లింది.

**షఫాలీ, మంధాన దూకుడు..** ఫైనల్లో భారత ఓపెనర్లు చితక్కొట్టారు. ఎనిమిదో టైటిల్ లక్ష్యంగా టీమిండియాకు శుభారంభమిస్తూ.. ఇన్నింగ్స్ మొదటి బంతినే స్మృతి మంధాన(59) బౌండరీకి తరలించగా.. ఆ తర్వాత కవిశ దిల్హరి ఓవర్లో షఫాలీ వర్మ(68) రెండు ఫోర్లతో చెలరేగింది. వీరిద్దరి విధ్వంసంతో పవర్ ప్లేలోనే వికెట్ పడకుండా టీమిండియా 57 పరుగులు చేసింది. కాసేపటికే కవిశ ఓవర్లో బౌండరీతో అర్ధశతకం అందుకుంది షఫాలీ. 24 బంతుల్లోనే 8 ఫోర్లు, రెండు సిక్సర్లతో టీ20ల్లో 21వ ఫిఫ్టీ సాధించింది తను. లంక బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడిన ఈ జోడీ 129 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. ప్రబోధ ఓవర్లో షఫాలి వెనుదిరిగాక.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(14)తో సమన్వయం లోపంతో మంధాన రనౌటైంది. అనంతరం హర్మన్‌ప్రీత్ జతగా రీచా ఘోష్(17) ఉతికేసింది. ఓవర్లో 6, 4 తో రెచ్చిపోయింది రీచా. ధాటిగా ఆడే క్రమంలో ఇద్దరూ ఔటయ్యారు. ఆఖర్లో కమలిని(), భారతి పుల్మాలి() రాణించగా.. 20వ ఓవర్లో 16 రన్స్ వచ్చాయి. ఫలితంగా వెంటవెంటనే ముగ్గురు ఔటైనా టీమిండియా 5 వికెట్ల నష్టానికి పరుగులు చేసింది.

# అఫ్గన్‌తో తొలి టి–20.. భారత్ జయభేరి

స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో జరుగుతున్న మూడు టీ20ల సిరీస్‌లో భారత జట్టు జయభేరి మోగించింది. ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో అర్షదీప్ సింగ్(3–19) ధాటికి కాబూలీ బ్యాటర్లు చేతులెత్తేయగా.. స్వల్పఛేదనలో ఓపెనర్ అభిషేక్ శర్మ (82) అర్ధ శతకంతో విరుచుకుపడ్డాడు. అతడికి ఇషాన్ కిషన్(42) తోడవ్వగా టీమిండియా స్కోర్ పరుగులు తీసింది. ధనాధన్ ఆడిన ఈ ద్వయం ఔటయ్యాక.. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(8 నాటౌట్), తిలక్ వర్మ(3 నాటౌట్)లు లాంఛనం ముగించారు. ఏడు వికెట్ల విజయంతో సిరీస్‌లో బోణీ కొట్టింది భారత్. ఇటీవల వరసగా రెండు టీ20 సిరీస్‌లు కోల్పోయిన భారత జట్టు స్వదేశం లో పంజా విసిరింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో వైట్‌వాష్ నుంచి తేరుకున్న టీమిండియా మూడు టీ20ల సిరీస్ తొలి మ్యాచ్‌లో అఫ్గనిస్థాన్‌ను చిత్తు చేసింది. 157 పరుగుల ఛేదనలో శుభారంభం లభించకున్నా అభిషేక్ శర్మ(82) అర్ధ శతకంతో మెరిశాడు. సంజూ శాంసన్(82) ఔటయ్యాక ఇసాన్ కిషన్(42) జతగా అఫ్గన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇషాన్ సైతం బ్యాట్ ఝులిపించగా లక్ష్యం కరుగుతూ వచ్చింది. జట్టు స్కోర్ 139 వద్ద అభిషేక్ ఔటైనా.. ఇషాన్ ఉతికేశాడు. అర్ధ శతకానికి చేరువైన అతడిని వెనక్కి పంపినా అప్పటికే టీమిండియా విజయం ఖాయమైంది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(8 నాటౌట్), తిలక్ వర్మ(3 నాటౌట్)లు మరో వికెట్ పడకుండా చూసుకోగా 13.4 ఓవర్లోనే భారత్ గెలుపొందింది. టాస్ ఓడిన అఫ్గనిస్థాన్‌ను మొదటి ఓవర్లోనే వికెట్ తీసి బుమ్రా దెబ్బకొట్టాడు. ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్(0)ను అతడు డకౌట్ చేశాడు. కాసేపటికే కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్(11) రనౌటయ్యాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా.. అజ్మతుల్లా ఒమర్జాయ్(64), మొహమ్మద్ నబీ(33)లు బాధ్యతగా ఆడారు. వీరిద్దరి పోరాటంతో జద్రాన్ బృందం నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేయగలిగింది.




## ఆరోగ్యం

### 'స్కిన్ న్యూట్రిషన్'కు పెరుగుతున్న ఆదరణ

చర్మ సంరక్షణలో ఏళ్లుగా దాదాపు ఒకే విధానం కొనసాగుతోంది. క్లెన్స్‌చేయడం, టోన్ చేయడం, ట్రీట్ చేయడం, రక్షించడం, మళ్లీ అదే క్రమాన్ని కొనసాగించడం.. ఇది ఆనవాయితీగా మారింది. లక్షలాది మంది ఈ విధానాన్ని క్రమశిక్షణతో పాటిస్తూ, వివిధ సీరమ్‌లు, క్రీమ్‌లను సరైన క్రమంలో, సరైన సమయంలో ప్రతిరోజూ ఉపయోగిస్తున్నారు. అయినప్పటికీ, మరింత మంది వినియోగదారులు ఇప్పుడు ఫలితాలు ఒక స్థాయికి వచ్చి ఆగిపోతున్నాయని గుర్తిస్తున్నారు. ఎంత క్రమబద్ధమైన చర్మ సంరక్షణ పాటించినా ఆశించినంత కాంతివంతమైన చర్మం కనిపించకపోవడంతో సౌందర్య, వెల్నెస్ రంగంలో ఒక కొత్త మార్పు మొదలైంది. బయట నుంచి రాసుకునే ఉత్పత్తుల నుంచి లోపలి నుంచి చర్మ ఆరోగ్యాన్ని పోషించే 'డైలీ స్కిన్ న్యూట్రిషన్' వైపు దృష్టి మళ్లుతోంది. ఉత్తమ 'స్కిన్ కేర్' రొటీన్ కూడా ఒక పరిమితి వరకు మాత్రమే పనిచేస్తుంది. సీరమ్‌లు, క్రీమ్‌లు చర్మంపై పనిచేసి తేమను అందిస్తాయి, రక్షిస్తాయి. చర్మం నిస్తేజంగా కనిపించడం, రంగులో అసమానత వంటి కనిపించే సమస్యలను తగ్గించేందుకు అవి సహాయపడతాయి. అయితే చర్మ ఆరోగ్యం కేవలం పైపొరతో ముడిపడి ఉండదు. నిద్ర, ఒత్తిడి, ఆహారం, శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్ వంటి అంశాల ప్రభావం చివరకు చర్మంపై కనిపిస్తుంది. బాత్రూమ్లో ఎన్ని సీరమ్‌లు, క్రీమ్‌లు పెట్టుకున్నా వాటితో ఈ అంతర్గత ప్రభావాలను పూర్తిగా భర్తీ చేయలేం. ఇక్కడే స్కిన్ సప్లిమెంట్లుపై దృష్టి మళ్లుతున్నది. ఇవి సాధారణ 'స్కిన్ కేర్'రొటీన్‌కు ప్రత్యామ్నాయం కాదు. చర్మ ఆరోగ్యానికి శరీరం లోపలి నుంచి మద్దతు ఇవ్వడమే వీటి ఉద్దేశం. కణస్థాయిలో చర్మ ఆరోగ్యానికి అవసరమైన పోషణను అందించడం ద్వారా బయట నుంచి ఉపయోగించే ఉత్పత్తులకు మరింత సహాయక వాతావరణాన్ని కల్పించాలన్నది ఈ విధానం వెనుక ఉన్న ఆలోచన. వెల్నెస్ రంగంలో 'స్కిన్ హెల్త్' అనే భావన కొత్తది కాదు. అయితే ఇటీవల ఇది ప్రధాన స్రవంతి సౌందర్య సంరక్షణలోకి వేగంగా ప్రవేశిస్తోంది. చర్మం కూడా శరీరంలోని ఒక అవయవమే. ఇతర అవయవాల మాదిరిగానే అది కూడా శరీరానికి లోపలి నుంచి అందే పోషకాలు, జీవరసాయన పరిస్థితులకు స్పందిస్తుంది.





### వారానికోసారి ప్రక్షాళన

భూమిపై ఉన్న జీవజాలంలో మనిషికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అత్యంత ఆశ్చర్యం కలిగించే అంశాలు ఎన్నో మనిషి శరీరంలో చోటు చేసుకుంటూ ఉంటాయి. అలాంటి ఓ అద్భుతమే పేగుల్లోనూ దాగి ఉంది. పేగు గోడలోని కణజాలం ప్రతి ఐదు నుంచి ఏడు రోజులకోసారి పూర్తిగా నవీకృతం కావడం ఆశ్చర్యకరం. ఇది శరీరంలోని అత్యంత శ్రమాత్మకంగా పనిచేసే భాగాలలో ఒకటి. చాలా సంవత్సరాలుగా శాస్త్రవేత్తలు ఈ పునరుద్ధరణ 'స్టెమ్ సెల్స్' అనే ప్రత్యేక మాస్టర్ సెల్స్ వల్లనే జరుగుతుందని నమ్ముతూ వచ్చారు. అవే కొత్త కణాలను సృష్టిస్తాయని భావించారు. కానీ ఇటీవల నిర్వహించిన పరిశోధనలు మరింత అద్భుతమైన నిజాన్ని వెల్లడించాయి. అవసరమయ్యే సమయాల్లో, ఇప్పటికే ఉన్న సాధారణ, పూర్తిగా పెరిగిన కణాలు తిరిగి స్టెమ్ సెల్లులుగా మారగలవని గుర్తించారు. ఇది ఒక ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికుడు ఒక్కసారిగా ఆ ఫ్యాక్టరీని మళ్లీ రూపకల్పన చేసే ఆర్కిటెక్ట్‌గా మారడంగా చెప్పుకోవచ్చు. ఈ ప్రక్రియ సహజంగా శరీరంలో జరుగుతూ, ఒక జీవసంబంధ రీసెట్ బటన్‌లా పనిచేస్తుంది. అంతర్గతంగా, మన శరీరం లోపల నుండి నిరంతరం మరమ్మతులు చేసుకుంటూ, పునరుత్థానాన్ని సాధిస్తుంది. మనలోని ఈ అద్భుతమైన సంక్లిష్టత, పునరుత్థాన శక్తి మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఈ ప్రయోగ ఫలితం మన శరీరం ఎంత ప్రబలమైనదో, సహజంగా స్వీయ సవరణ శక్తితో నిండినదో గుర్తుచేస్తుంది.

### షుగర్ నియంత్రణకు

రక్తంలో షుగర్ నియంత్రణకు స్వీట్ పొటాటో (చిలకడదుంప/మొరంగడ్డ), పాలు విరగ్గొట్టి తయారు చేసిన కోవా ఎంతో ఉపయోగమని అంటున్నారు. అంతర్జాతీయ కథనాలను అనుసరించి, ఈ రెంటినీ కలిపి ఉపయోగించడం వల్ల రక్తంలో చక్కెర మొతాదులు నియంత్రణలో ఉంటాయి. స్వీట్ పొటాటోలు, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్ల దాదాపు ఒకే రీతిలో ఉంటాయి. వాటి గ్లైసెమిక్ ఇండెక్స్ (జిఐ) తెల్ల పొటాటోల కంటే తక్కువ ఉంటుంది. అంటే, వీటిని తినగానే రక్తంలో గ్లూకోజ్ స్థాయి ఒక్కసారిగా ఎక్కువగా పెరగదు. ఇక దాల్చిన కోవాలో ఇన్సులిన్ వంటి ప్రభావం చూపే రసాయనాలు ఉంటాయి. ఇవి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి, భోజనాల తర్వాత రక్తంలో షుగర్ స్థాయిలలో అధిక ఉత్పత్తిని తగ్గిస్తాయి. కోవా రక్తంలో గ్లూకోజ్‌ను కణాల్లోకి చేర్పించడంలో ఇన్సులిన్ ప్రభావాన్ని బలోపేతం చేస్తుంది. కడుపు నుంచి ఆహారం శీఘ్రంగా విడుదల కాకుండా అడ్డుకుంటుంది. అందువల్ల రక్తంలో గ్లూకోజ్ చేరిక నెమ్మదిస్తుంది. స్వీట్ పొటాటోలు కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు కాబట్టి, తిన్న వెంటనే రక్తంలో షుగర్ స్థాయిలను ఒక్కసారిగా పెంచవు. కోవాలోని కాంపౌండ్లు, స్వీట్ పొటాటోల ఫైబర్ కలసి పని చేయడం వల్ల, రక్తంలోని షుగర్ స్థాయిల నియంత్రణలో రెండు పదార్థాల కలయిక సమష్టిగా మరింత ఫలితప్రదంగా ఉంటుంది. వీటిని ఉడికించి తినడం మంది. కాల్చి లేదా ఫ్రై చేయడం కంటే, ఈ పద్ధతిలో తినడం వల్ల గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. పెరుగు, గోధుమ, వివిధ రకాల గింజలు ఆరోగ్యకరమైన ఫ్యాట్/ప్రోటీన్‌తో కలపడం రక్తంలో షుగర్ స్థాయిలను మరింత స్థిరంగా ఉంచుతుంది. అందుకని రక్తంలో షుగర్ శాతాన్ని నియంత్రించడానికి ఆహారంలో స్వీట్ పొటాటో, కోవాతోపాటు వీటిని కూడా చేర్చడం మంచిది. ఒకవేళ చిలకడదుంప లభించని పక్షంలో, దాల్చిన చెక్కను కలిపి తీసుకోవడం మంచిదని అంటున్నారు.



# సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయం

## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నైజం నవాబ్ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, ప్రాణాలను త్యాగం చేసిన తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలు చిరస్మరణీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత్‌రావు అన్నారు. ఖమ్మంరూరల్ మండలంలోని ఎం,వెంకటాయపాలెం గ్రామంలో ఆదివారం సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట యోధుడు గంగవరపు శ్రీనివాసరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే గంగవరపు విజయ్‌కుమార్‌కు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యపరిచి, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం అలుపెరగని పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే ప్రజల్లో నాటి నిజాం వ్యతిరేకంగా పోరాడేందుకు చైతన్యం పెరిగిందన్నారు. ఆ త్యాగధనుల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, అదే పోరాట పటిమతో నేటి ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు మరింత ఉధృతంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయకార్యదర్శి జుమ్మల జితేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషనర్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, నాయకులు ఎర్ర బాబు, మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, ఉన్నం రంగారావు, పాసంగుల చంద్రరావు, పగీళ్ల వీరభద్రం, ఎడ్లపల్లి శంకరయ్య, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, ఏలూరి భాస్కర్, మెట్ల యాదయ్య పాల్గొన్నారు.

**నేలకొండపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల భాగంగా నేలకొండపల్లిలోని కర్నాటి కృష్ణయ్య స్తూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్మల జితేందర్‌రెడ్డి, నాయకులు కర్నాటి భానుప్రసాద్, యర్ర బాబు, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, పాల్తియ శ్రీనివాసరావు, కాశబోయిన అయోధ్య, పాలపాటి అశోక్, చావ గణపతి, బాలిన కృష్ణంరాజు, ఎస్.కె.సలాం, కనకబండి రామయ్య, చిర్ర ప్రసాద్, తేజావత్ రూప్లా, పొలంపల్లి నారాయణ, పాలకూర్తి తిరుపతిరావు, బాలేబోయిన వెంకటేశ్వర్లు, ఆలేటి ఉమామహేష్, రావెళ్ల కృష్ణ, మూడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో...

### సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు : నెల్లికంటి

**నాంపల్లి :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి, ప్రజల హక్కుల కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఘనత కమ్యూనిస్టులదేనని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం స్ఫూర్తితో నేటి ప్రజా సమస్యలపై ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా నల్లగొండ జిల్లా నాంపల్లి మండలంలోని రేవెల్లి గ్రామంలో నిర్వహించారు. అమరవీరుడు బట్టు సత్తయ్య స్థూపానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్య చారి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బుడిగపాక జగన్, కలకోండ సంజీవ, రేవెల్లి సర్పంచ్ బట్టు శ్రీను, ఉపసర్పంచ్ వంగూరి సాయిలు, నాయకులు కోరె సత్తయ్య, ఊరిపాక వెంకటయ్య, పల్లె సైదులు, దండిగా వెంకటయ్య, నేరెళ్ల సైదులు, గిరి స్వామి, బూషిపాక యాదయ్య, వెంకటచారి, మొగుదాల సైదమ్మ, ప్రశాంత్, కొని రెడ్డి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతాంగ పోరాట స్ఫూర్తితోనే విముక్తి : కలవేణ శంకర్

**తాండూరు :** నిజాం నిరంకుశత్వం, భూస్వామ్య దోపిడీపై సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే పీడిత ప్రజలకు నిజమైన స్వేచ్ఛను ప్రసాదించిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ ఉద్ఘాటించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సాయుధ పోరాట వారోత్సవాల సభలో ఆయన మాట్లాడారు. చరిత్ర వక్రీకరణలను నిలువరించాలని, భవిష్యత్ తరాల కోసం అసలైన రైతాంగ పోరాట గాథను పాఠ్యపుస్తకాల్లో ముద్రించాలని డిమాండ్ చేశారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్ పాల్గొన్నారు.

### చరిత్రను వక్రీకరిస్తే సహించేది లేదు : రామడుగు

**బెల్లంపల్లి :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీపై సాగిన విముక్తి పోరాటమని, చరిత్రలను వక్రీకరిస్తూ సహించేది లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా పార్టీ జిల్లా సమితి చేపట్టిన జాతా పట్టణానికి చేరిన సందర్భంగా స్థానిక భగత్ సింగ్ చౌరస్తాలో సభ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, ఆడెపు రాజమౌళి, మేకల దాస్, రేగుంట చంద్రశేఖర్, చిప్ప నరసయ్య, అక్కపెల్లి బాపు, బొంతుల లక్ష్మీనారాయణ, గుండా చంద్రమాణిక్యం, మేకల రాజేశం, రత్నం రాజ్యం, వనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రైతాంగ సాయుధ పోరాటం చరిత్రాత్మక ఉద్యమం : బెజవాడ

**కోదాడ(చిలుకూరు):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలో అమరవీరుల స్తూపాల వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పూలమాలలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చరిత్రాత్మక ప్రజా ఉద్యమమన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తాళ్లూరి వెంకటయ్య, నాయకులు జనార్ధన్, దొంతగాని మల్లయ్య, ఎస్‌కె.ఖాజామియా, తాళ్లూరి పెద్ద మల్లయ్య, బత్తిని బిక్షం, బెజవాడ నాగేశ్వరరావు, నేలపట్ల జానయ్య, పాశం గోపి, కట్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### నిజాం ప్రభుత్వాన్ని కూల్చిన ఘనత కమ్యూనిస్టులదే : సాబీర్ పాషా

**భద్రాద్రికొత్తగూడెం :** నాటిదొరలు దేశ్ ముఖ్‌ల రజాకారుల మూకలను తిరిమికొట్టి తెలంగాణకు విముక్తి కలిగించిన ఘనత కమ్యూనిస్టులేదనని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఆదివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవనం ఎదుట అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఈ సేవ సెంటర్ వద్ద సాయుధ పోరాట యోధులు ఉషారాణి రామకోటయ్యల స్థూపం, సిద్ధి వెంకటేశ్వర్లు ఉప్పుశెట్టి ఖాదర్ బాబు దేవభక్తుని రమేష్ చంద్రశేఖర్ పాశం శ్రీనివాస్ స్మారక స్థూపాల వద్ద పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల విశ్వనాధం, మేయర్ మూడ్ గణేష్ అడుసుమిల్లి సాయిబాబా, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్ తో పాటు వీశంశెట్టి విశ్వేశ్వరరావు గుర్రం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**నిర్మల్ రూరల్ :** నిర్మల్ పట్టణంలో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సిపిఐ కార్యాలయంలో పార్టీ జెండాను రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.విలాస్ ఆవిష్కరించారు. కోరన్నపేటలోని వేయి ఉరుల మర్రి స్మారక స్థూపం వద్దకు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బూక్యా రమేష్, ఎస్.ఎన్.రెడ్డి, కైలాష్, నాయకులు పుండలీక్, బదర్, శివాజీ, దేవన్న, తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ...నాంపల్లిలో...



ఖమ్మం..నేలకొండపల్లిలో..



సూర్యాపేట జిల్లా మునగాలలో...



భద్రాద్రిలో...



తాండూరులో...





బెల్లంపల్లిలో...





నిర్మల్‌లో...


# దళితులకు కెసిఆర్ క్షమాపణ చెప్పాలి

- దళిత ఆత్మగౌరవ మహాధర్నాలో వక్తలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** అసెంబ్లీతో పాటు ఎర్రవెల్లి ఘటనలను నిరసిస్తూ మాలమాదిగ ఉప కులాల ఆధ్వర్యంలో ఆదివారం ధర్నాచౌక్ వద్ద దళిత ఆత్మగౌరవ మహాధర్నా జరిగింది. మహాధర్నాలో పలువురు రాజకీయ, మేధావులు పాల్గొని స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు, దళితులు వెళ్లిన మార్గంలో పసుపు నీళ్లు చల్లి శుద్ధీకరణ చేశారన్న ఆరోపణపై ఆందోళన వ్యక్తం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలు, ఎర్రవెల్లి శుద్ధీకరణ ఘటనల విషయంలో దళితులకు కెసిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటనలపై నిస్పాక్షిక విచారణ జరిపి పూర్తి నిజాలు బయటపెట్టాలని వారు డిమాండ్ చేశారు. బాధ్యులుగా తేలిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మహాధర్నాకు సంఘీభావం తెలిపిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... దళితులను చిన్నచూపు చూసే వారికి కఠిన శిక్ష పడాలని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలు ఎవరూ సహించేది కాదని.. బిఆర్‌ఎస్ కూడా ఆ వ్యాఖ్యలను సహించకూడదన్నారు. దళితులు అడుగుపెట్టిన భూమిని పసుపునీళ్లతో శుద్ధి చేయడం అంటే.. మనం నిజంగా ప్రజాస్వామ్యంలో ఉన్నామా? అని ప్రశ్నించారు. పార్టీ నాయకత్వం క్షమాపణ చెప్పాల్సింది పోయి దళితులు వెళ్లిన భూమిని పసుపు నీళ్లతో కడిగారని.. ఇంతకన్నా క్రూరమైన చర్య ప్రజాస్వామ్యంలో ఉందా అన్నారు. దళితులను చిన్నచూపు చూసే వారికి కఠిన శిక్షపడాలని.. దళితుల్లో ఐక్యత ఉంటే అందరి పని పట్టవచ్చన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మీ బలమేంటో చూపించవచ్చని సూచించారు. ధర్నాలో పాల్గొన్న టిజెఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ... అసెంబ్లీ ముందు జరిగిన ఘటన కేవలం ఒక కులానికి సంబంధించింది కాదని... ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరిగిన ఘటన అన్నారు. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 15కి ఇది వ్యతిరేకమన్నారు. అస్పృశ్యతను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. అంటరానితనం అంటే కేవలం మనుషులని భౌతికంగా కించపరచడం మాత్రమే కాదని.. మాటలపరంగా కించపరిచినా అది చాలా అన్యాయం చేసినట్లు అవుతుందన్నారు. స్పీకర్ స్థాయిలో ఉన్న మనిషిని అలాంటి మాటలు అంటే కిందిస్థాయి మనుషుల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా బిఆర్‌ఎస్ నేతలు మేలుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా ఎంపి మల్లు రవి మాట్లాడుతూ... కుల వివక్ష ఘటనలపై పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులపై వివక్ష, అవమానాలను సహించబోమని, రాజ్యాంగం కల్పించిన సమానత్వం, సామాజిక న్యాయ పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధులు, సామాజిక సంఘాలు కలిసి పోరాడాలని కోరారు. ధర్నాలో ఎమ్మెల్యే వేముల వీరేశం, మందుల సామెల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ప్రొఫెసర్ హరగోపాల్, పురుషోత్తం, నాగరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులకు బ్రేక్!

- 33 వేల క్యాబ్ డ్రైవర్ల బహిష్కరణ.. ఓలా, ఉబర్, రాపిడోపై ఆగ్రహం
- ప్రభుత్వ ఆదేశాల అమలుకు డిమాండ్.. నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఆందోళన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో క్యాబ్ సేవలకు డ్రైవర్లు షాక్ ఇచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన ఛార్జీలను అమలు చేయకుండా ఓలా, ఉబర్, రాపిడో యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయంటూ సుమారు 33 వేల మంది క్యాబ్ డ్రైవర్లు ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను బహిష్కరిస్తున్నారు. సెప్టెంబర్ 10న ప్రారంభమైన ఈ బహిష్కరణ ఆదివారం నాటికి వరుసగా నాలుగో రోజుకు చేరింది. డ్రైవర్ల డిమాండ్లను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యూయు) తేల్చిచెప్పింది. డ్రైవర్ల ఆందోళనకు ప్రధాన కారణం ఎయిర్‌పోర్ట్ ప్రీపెయిడ్ క్యాబ్ ఛార్జీల అమలు. 2022 డిసెంబర్ 9న జారీ చేసిన జిఒ 46 ప్రకారం ఆర్‌జిఐఎ ప్రీపెయిడ్ మోటార్ క్యాబ్ ఛార్జీలను అమలు చేయాలని కార్మిక శాఖ ఇప్పటికే సంస్థలకు సూచించినట్లు టిజిపిడబ్ల్యూయు తెలిపింది. ఆగస్టు 31న రంగారెడ్డి జోన్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం ఓలా, ఉబర్, రాపిడో యాజమాన్యాలకు ఈ మేరకు సూచనలు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని యూనియన్ ఆరోపించింది. డ్రైవర్లపై విధిస్తున్న రూ.500 జరిమానాలను వెంటనే రద్దు చేయాలని టిజిపిడబ్ల్యూయు డిమాండ్ చేస్తోంది. ఎయిర్‌పోర్ట్‌లో ఉచిత డ్రాప్‌ఆఫ్ సమయాన్ని 8 నిమిషాల నుంచి 10–15 నిమిషాలకు పెంచాలని, పారదర్శకమైన ఛార్జీల విధానాన్ని అమలు చేయాలని కోరుతోంది. అలాగే ఆర్‌జిఐఎ పరిధిలో అనధికారిక ప్రయాణికుల ప్రలోభాలు, అక్రమ క్యాబ్ కార్యకలాపాలను అరికట్టాలని డిమాండ్ చేసింది.టిజిపిడబ్ల్యూయు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికే జిఒ.46 ప్రకారం ఛార్జీలను అమలు చేయాలని సంస్థలకు సూచించినప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోకపోవడం వల్లే డ్రైవర్లు ఎయిర్‌పోర్ట్ ట్రిప్పులను బహిష్కరించాల్సి వచ్చిందన్నారు. డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్ట్ ట్రిప్పుల బహిష్కరణకు వెంటనే తెరదించేందుకు ఆర్‌జిఐఎ యాజమాన్యం, ఓలా, ఉబర్, రాపిడో సంస్థలు టీజీపీడబ్ల్యూయూతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని యూనియన్ డిమాండ్ చేసింది.

# ఎస్‌పికి పోలీస్ సంక్షేమ సంఘం మద్దతు

- నిరాధార ఆరోపణలను ఖండించిన నిర్మల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్‌పి డాక్టర్ జి.జానకి షర్మిలపై కొంత మంది చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని నిర్మల్ జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. పోలీసుల పేరుతో జరుగుతున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఎస్‌పికి సంఘం పూర్తి మద్దతు ప్రకటించింది. సిబ్బంది సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు గ్రీవెన్స్ డే నిర్వహించడం, హోంగార్డుల సంక్షేమం, సిబ్బందికి సహకార రుణాల మంజూరు, బదిలీలు, విధుల కేటాయింపుల్లో నిబంధనలను పాటిస్తున్నారని సంఘం తెలిపింది. సిబ్బంది ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కోఆపరేటివ్ లోన్ సబ్‌స్క్రిప్షన్‌ను రూ.975 నుంచి రూ.500కు తగ్గించడంతో పాటు అర్హులైన వారికి రూ.3 లక్షల వరకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొంది. అలాగే బాసర ఐఐఐటి విద్యార్థుల భద్రత, సంక్షేమంపై ఎస్‌పి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపింది. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నందున కొందరు వ్యక్తులు ఎస్పీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది.

పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం ఎన్నికలు రహస్య బ్యాలెట్ ద్వారా పారదర్శకంగా జరిగాయని, వాటికి కుల, మతరంగు పులమడం సరికాదని సంఘం స్పష్టం చేసింది. అనామక లేఖలు, సోషల్ మీడియా ప్రచారాలను నమ్మకుండా ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని కోరింది. ఎలాంటి ఆధారాలు లేకుండా పోలీస్ శాఖ, అధికారులపై తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. ప్రజా భద్రతే లక్ష్యం.. పోలీస్ సిబ్బంది సంక్షేమమే బాధ్యత.. ప్రజల విశ్వాసమే మా బలం అని సంఘం అధ్యక్షుడు దండేకర్ సాయి కుమార్ తెలిపారు.

# సిఎం వినాయక చవితి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రజలకు సిఎం రేవంత్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యం చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వాడవాడలా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని సిఎం కోరారు. గణపతి నవరాత్రుల సందర్భంగా హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే గణేష్ మండపాల వద్ద తగిన భద్రతా, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాల మండపాలకు ఈ ఏడాది కూడా ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తోందని సిఎం తెలిపారు.

# ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పొన్నం కుటుంబం ఆదర్శం

- కొత్త తరానికి కుటుంబ విలువలు అందించాలి
- పొన్నం సత్తయ్య పురస్కారాల కార్యక్రమంలో పలువురు వక్తలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** "ఆస్తులు తరాలకు అందుతాయి. కానీ విలువలు తరాలను కలుపుతాయి. కుటుంబ బంధాలు క్రమంగా బలహీనపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రేమ, ఆప్యాయత, పరస్పర సహకారంతో ముగ్గురు అన్నదమ్ములు ఐక్యంగా కొనసాగుతున్న పొన్నం ఉమ్మడి కుటుంబం సమాజానికి ఆదర్శం" అని పలువురు వక్తలు కొనియాడారు. వ్యవసాయం, రైతు సంక్షేమం, మానవ సంబంధాలు, కుటుంబ విలువలకు జీవితాంతం ప్రాధాన్యం ఇచ్చిన పొన్నం సత్తయ్య గౌడ్ ఆశయాలను ఆయన కుటుంబ సభ్యులు కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం పొన్నం సత్తయ్యగౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారాలు 2026ను ఎం.కోదండరెడ్డి (వ్యవసాయం), వెలిచాల కొండల్‌రావు (సాహిత్యం), గొట్టె కనకవ్వ (జానపద) ప్రధానం చేశారు. ఒక్కొక్కరికి రూ.50వేల నగదు పురస్కారం అందజేశారు. అనంతరం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి విలువనిస్తూ, రైతు జీవితాన్ని గౌరవించిన వ్యక్తిగా పొన్నం సత్తయ్య నిలవడం స్ఫూర్తిదాయకమన్నారు. కుటుంబ విలువలను కొత్త తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పొన్నం కుటుంబంతో తనకు ఆత్మీయ అనుబంధం ఉన్నదన్నారు. ఆయన కుమారుడు మంత్రి పొన్నం ప్రభాకర్ ఎప్పుడూ ప్రేమ, ఆప్యాయతలతో అందరినీ పలకరిస్తూ ఉంటారని అన్నారు. పొన్నం కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయతలు, పరస్పరసహకారం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఢిల్లీలో కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవటంలో పొన్నం ప్రభాకర్ కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి, ప్రజల పట్ల నిబద్ధతలో పొన్నం సత్తయ్య విలువల ప్రభావం కనిపిస్తుందన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కుటుంబాల్లో ప్రేమ, గౌరవం, సహకారం పెరిగితే సమాజంలోనూ శాంతి, సామరస్యం పెరుగుతాయని అన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పొన్నం సత్తయ్య ముగ్గురు కుమారులు వివిధ రంగాల్లో రాణించడం ఆయన పడ్డ కష్టం, విలువలకు ప్రతిఫలమని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తన తండ్రి పొన్నం సత్తయ్య జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారిని గుర్తించి, సత్కరిస్తున్నామని తెలిపారు. తమ తల్లిదండ్రులు పెద్దగా చదువుకోకపోయినా తమకు విద్య, క్రమశిక్షణ, విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పించారని గుర్తుచేశారు. తండ్రి పేరిట పురస్కారలివ్వడం ద్వారా ఆయన ఆశయాలను భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి మాట్లాడుతూ తనకు దక్కిన పురస్కారం వ్యక్తిగత గౌరవం కాదని, తెలంగాణ రైతులకు దక్కిన గౌరవమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, నవీన్ యాదవ్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయదేవి, సీనియర్ జర్నలిస్టు దిలీప్ రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, పొన్నం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్‌గా రామ్‌రెడ్డి

- వైస్ చైర్మన్‌గా వెంకట్ యాదవ్
- బీసీఐ సభ్యుడి జి.కిరణ్‌కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ పదవులకు ఆదివారం జరిగిన ఎన్నికల్లో సాముల రామ్‌రెడ్డి చైర్మన్‌గా, చలకాని వెంకట్ యాదవ్ వైస్ చైర్మన్‌గా, జి.కిరణ్‌కుమార్ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎనిమిదేళ్ల తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో మూడు కీలక పదవులకు హోరాహోరీ పోటీ నెలకొంది. చైర్మన్ పదవికి రామ్‌రెడ్డి సాములు, పొన్నం అశోక్‌గౌడ్, టి.హన్మంత్‌రెడ్డి పోటీ చేయగా.. రామ్‌రెడ్డికి 12, అశోక్‌గౌడ్‌కు 11, హన్మంత్‌రెడ్డికి 3 ఓట్లు లభించాయి. దీంతో అశోక్‌గౌడ్‌పై ఒక్క ఓటు ఆధిక్యంతో రామ్‌రెడ్డి విజయం సాధించారు. అశోక్‌గౌడ్ కాంగ్రెస్ నాయకుడైన మంత్రి పొన్నం ప్రభాకర్ సోదరుడు. ఆయన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వైస్ చైర్మన్ పదవికి చలకాని వెంకట్ యాదవ్, జకీర్ హుస్సేన్ జావెద్, రామారావు గోకుల్ పోటీ చేశారు. వెంకట్ యాదవ్‌కు 13, జకీర్ హుస్సేన్ జావెద్‌కు 10, రామారావు గోకుల్‌కు 3 ఓట్లు వచ్చాయి. దీంతో సమీప ప్రత్యర్థిపై మూడు ఓట్ల ఆధిక్యంతో వెంకట్ యాదవ్ ఎన్నికయ్యారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడి పదవికి జి.కిరణ్‌కుమార్, డి.జగదీశ్వర్‌రావు, పాశం సుజాత, ఆకుల అనంతసేన్‌రెడ్డి, అనిల్ కిరణ్‌కుమార్ పోటీ చేశారు. జి.కిరణ్‌కుమార్‌కు 10, జగదీశ్వర్‌రావుకు 7, పాశం సుజాతకు 4, అనంతసేన్‌రెడ్డికి 3, అనిల్ కిరణ్‌కుమార్‌కు 2 ఓట్లు లభించాయి. దీంతో జగదీశ్వర్‌రావుపై మూడు ఓట్ల ఆధిక్యంతో జి.కిరణ్ కుమార్ విజయం సాధించారు.

హుజూర్‌నగర్‌కు చెందిన సాముల రామ్‌రెడ్డి 1964 జూన్ 6న జన్మించారు. బీఏ, బీఎల్ పూర్తి చేసి 1992లో బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. హుజూర్‌నగర్, సూర్యాపేట జిల్లా కోర్టుల్లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. సివిల్, క్రిమినల్ కేసులతోపాటు, కింది స్థాయి కోర్టు నుంచి హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో కేసులు వాదించారు. హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 1998 నుంచి 2006 వరకు, 2007 నుంచి 2015 వరకు చేశారు.

# మల్లేష్‌ను విచారించేందుకు పోలీసుల కస్టడీ పిటిషన్

- సిద్ధం చేసిన బొల్లారం పోలీసులు
- మిలిటరీ ఆయుధాల చోరీ కేసులో కీలక మలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ బొల్లారంలోని 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ ఆయుధాగారం నుంచి భారీగా తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీ చేసిన కేసులో దర్యాప్తు మరింత కీలక దశకు చేరుకుంది. కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టయి జైలులో ఉన్న మాజీ ఆర్మీ హవల్దార్ ఉప్పుతోళ్ల మల్లేష్‌ను విచారించేందుకు దర్యాప్తు అధికారులు పోలీసు కస్టడీ పిటిషన్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మల్లేష్ నుంచి ఇప్పటికే చోరీకి గురైన ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు వివిధ ప్రాంతాల్లో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో ఆయుధాలను ఎందుకు చోరీ చేశాడు? వాటిని ఎవరికి అప్పగించాలనుకున్నాడు? ఆయుధాల వెనుక మరెవరైనా ఉన్నారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడమే పోలీసుల కస్టడీ విచారణలో ప్రధాన లక్ష్యంగా మారింది.

ఆగస్టు 30 అర్ధరాత్రి తరువాత బొల్లారం 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్‌లోని కోటే, మ్యాగజైన్ గదుల్లోకి మల్లేష్ ప్రవేశించి తాళాలు పగులగొట్టి ఆయుధాలను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. చోరీకి గురైన వాటిలో నాలుగు ఎకె203 రైఫిళ్లు, ఒక ఇన్‌సాస్ రైఫిల్, ఆరు 9 ఎంఎం పిస్టళ్లు, ఒక సివిలియన్ పిస్టల్, నైట్ విజన్ బైనాక్యులర్, మ్యాగజైన్లు, భారీగా మందుగుండు సామగ్రి ఉన్నాయి. సుమారు 1,900 రౌండ్లకు పైగా మందుగుండు సామగ్రి చోరీకి గురైంది. పోలీసుల దర్యాప్తులో మల్లేష్ ముందుగానే ఆర్మీ ప్రాంగణాన్ని పరిశీలించినట్లు తేలింది. ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద భద్రతా ఏర్పాట్లు, లైటింగ్, సీసీ కెమెరాల పని తీరును గమనించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత ఆగస్టు 30 రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఆయుధాగారంలోకి వెళ్లినట్లు దర్యాప్తులో బయటపడింది.

చోరీ అనంతరం ఆయుధాలను ఒకేసారి ఒకే ప్రాంతంలో ఉంచకుండా వివిధ ప్రాంతాలకు తరలించినట్లు దర్యాప్తులో తేలింది. కౌకూర్, యాప్రాల్ ప్రాంతాలతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పరిసరాల్లో కూడా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు గుర్తించారు. మల్లేష్ తన స్వస్థలానికి సమీపంలోని ప్రాంతంలో వాటిని దాచిపెట్టాడు.

**అసలు టార్గెట్ ఎవరు?**

ఇదే ఇప్పుడు పోలీసుల ముందున్న ప్రధాన ప్రశ్న. మల్లేష్ స్వయంగా ఆయుధాలను ఉపయోగించుకోవడానికి చోరీ చేశాడా? లేక వాటిని అక్రమంగా విక్రయించేందుకు లేదా మరెవరికైనా అప్పగించేందుకు ప్రణాళిక రూపొందించాడా? అన్న కోణంలో దర్యాప్తు సాగుతోంది. అయితే ఇప్పటివరకు పోలీసులు అధికారికంగా ఆయుధాలను ఎవరికి ఇవ్వాలని మల్లేష్ భావించాడో వెల్లడించలేదు. అతడి కస్టడీ విచారణలో ఈ విషయం తేలే అవకాశముంది. అతడి ఫోన్, కాల్ డేటా, పరిచయాలు, ఆన్‌లైన్ కార్యకలాపాలు, గతంలో ఎవరితో సంబంధాలు కొనసాగించాడన్న అంశాలపై కూడా దర్యాప్తు సంస్థలు దృష్టి పెట్టాయి.

**మరెవరైనా సహకరించారా?**

ఇంతటి భద్రత ఉన్న సైనిక ప్రాంగణంలోకి వెళ్లి ఆయుధాలను బయటకు తీసుకురావడం వెనుక మరెవరైనా సహకరించారా? అన్న అనుమానాన్ని పోలీసులు మొదటి నుంచీ పరిశీలించారు. ఆర్మీ సిబ్బంది, కాంట్రాక్టర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ఇటీవల రిటైర్ అయిన వారు, సెలవులో ఉన్న సిబ్బంది తదితరులను విచారించారు. అయితే ప్రాథమిక దర్యాప్తులో మల్లేష్ ఒక్కడే ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నప్పటికీ, కస్టడీ విచారణ పూర్తయ్యే వరకు ఇతరుల ప్రమేయాన్ని పూర్తిగా కొట్టివేయలేమని అధికారులు భావిస్తున్నారు.

# రియల్ ఎస్టేట్ మోసంపై అప్పీలేట్ ట్రిబ్యునల్ తీర్పు

రిజిస్ట్రేషన్ చేయాల్సిందేనని ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి, రిజిస్ట్రేషన్ చేయించుకోకుండానే విక్రయాలు చేపట్టిన డెవలపర్లపై తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పీలేట్ ట్రిబ్యునల్ కీలక ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ ఎ.సంతోష్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం (జ్యుడీషియల్ మెంబర్ పి.ప్రదీప్ కుమార్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మెంబర్ వేముల శ్రీకర్‌లతో కూడిన బెంచ్) ఈ మేరకు తీర్పు వెలువరించింది. వికారాబాద్ జిల్లా తుమ్మనపల్లి గ్రామంలోని 'పీకాక్ అవెన్యూ' పేరిట ఎస్ ఎస్‌ఎల్ ఇన్‌ఫ్రా డెవలపర్స్, దాని భాగస్వామి శివపురం సురేందర్ కుమార్ నిర్వహించిన ప్రాజెక్టులో వౌడేల అన్నపూర్ణ అనే మహిళ 4 గుంటల స్థలాన్ని రూ.16,94,000కు కొనుగోలు చేశారు. '100 నెలల ఆర్గానిక్ లీజు ఆదాయం', '8 ఏళ్ల తర్వాత రెట్టింపు బైబ్యాక్' వంటి ఆకర్షణీయ హామీలతో డెవలపర్లు ఆమెను ఒప్పించారని, రూ.16 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించగా, సేల్ డీడ్‌లో మాత్రం కేవలం రూ.10,000 విలువగా చూపి రిజిస్ట్రేషన్ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏటా రూ.1,92,000 లీజు మొత్తం చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నా, 2023 ఆగస్టు నుంచి చెల్లింపులు నిలిపివేశారని తెలిపారు. రెరా అథారిటీ ముందు ఫిర్యాదు చేయగా, పెట్టుబడి వాపసు కోరిన అభ్యర్థనను తిరస్కరించిన అథారిటీ, ప్రాజెక్టును సెక్షన్ 3 కింద తప్పనిసరిగా రిజిస్టర్ చేయించుకోవాలని మాత్రమే ఆదేశించింది. దీనిపై అభ్యర్థి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

**ట్రిబ్యునల్ ఏమి చెప్పింది?**


వాదనలు విన్న ధర్మాసనం, భూమిని 88 ప్లాట్లుగా విభజించి, రోడ్లు, ఇతర సదుపాయాలు కల్పించి విక్రయించడం రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) చట్టం, 2016లోని సెక్షన్ 2(జెడ్ఎన్) నిర్వచనం ప్రకారం 'రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు' కిందకే వస్తుందని, కేవలం వ్యవసాయ భూమి అని చూపించడం ద్వారా చట్ట నిబంధనల నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేసింది. 500 చదరపు మీటర్ల పరిమితిని మించి ప్రాజెక్టు అభివృద్ధి చేసినందున తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేసింది. రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా టైటిల్ చెల్లుబాటుగా బదిలీ అయినందున, సేల్ కన్సిడరేషన్ వాపసు కోరే హక్కు లేదని, అలాంటి వివాదాలు సివిల్ కోర్టు పరిధిలోకి వస్తాయని పేర్కొంటూ ఆ కోరికను తిరస్కరించింది. కానీ లీజు ఒప్పందం చెల్లుబాటు అయ్యేదేనని, డెవలపర్లు 2023 సెప్టెంబర్ నుంచి బకాయి ఉన్న నెలవారీ రూ.16,000 లీజు మొత్తాన్ని 10.70 శాతం వడ్డీతో సహా 60 రోజుల్లో చెల్లించాలని ఆదేశించింది. అంతేకాక, సెక్షన్లు 3, 4, 12, 13 ఉల్లంఘనలకు తగిన జరిమానా విధించేందుకు కేసును తిరిగి రెరా అథారిటీకి పంపింది. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఫామ్‌హౌస్ ప్లాట్ లేఔట్‌లను గుర్తించి, రిజిస్ట్రేషన్ చేయించే చర్యలు తీసుకోవాలని రెరా కార్యదర్శిని ఆదేశిస్తూ, 8 వారాల్లో నివేదిక సమర్పించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# పెరుగుతున్న అణుప్రమాదం, సంఘర్షణలు

- పౌర అణుకేంద్రాలపై చట్ట విరుద్ధ దాడులు
- అణ్వస్త్రరహిత దేశాలకు అణు భయం లేని భరోసా ఉండాలి
- ఆందోళన ప్రకటించిన బ్రిక్స్ 18వ సదస్సు తీర్మానం

**న్యూఢిల్లీ:** ప్రపంచంలో పెరుగుతున్న అణు ప్రమాదం,సంఘర్షణలపై బ్రిక్స్ 18వ సదస్సు మొదటిరోజు చేసిన ఏకగ్రీవ తీర్మానం తీవ్ర ఆందోళన ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో అంతర్జాతీయ అణుశక్తిసంస్థ (ఐఎఇఎ) పూర్తి రక్షణలతో ఏర్పాటుచేసిన పౌర అణువిద్యుత్ కేంద్రాలు, మౌర అణు మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరుగుతున్నాయని, అదేవిధంగా సంఘర్షణలు పేట్రేగాయని "బ్రిక్స్ డిక్లరేషన్" పేర్కొంది. ఈ ఏకాభిప్రాయ తీర్మాన పత్రాన్ని మోదీ మొదటి రోజు సదస్సులో చదివి వినిపించారు. అమెరికా ప్రస్తావన లేకుండా పశ్చిమాసియాలో యుద్ధాన్ని, ఏకపక్ష దాడులను కూడా ఈ తీర్మానం వ్యతిరేకించింది. విభేదాలు ఉన్నప్పటికీ వాటిని అధిగమించి ఈ ఏకగ్రీవ తీర్మానం చేయడం భారత్‌కు దౌత్యవిజయం. ఈ నేపథ్యంలోనే ప్రపంచంలో పౌర అణు సదుపాయాలు సురక్షితంగా ఉన్నప్పటికీ, ఐఎఇఎ రక్షణ ఉన్నప్పటికీ ఏదో ఒక వంకతో దాడులు జరుగుతున్నాయని, ఈ దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని తీర్మానం ఆందోళన వ్యక్తం చేసింది. పర్యావరణ హాని నుండి ప్రజలను కాపాడాలని, చట్టవిరుద్ధంగా పౌర అణు స్థావరాలపై దాడులను అరికట్టాలని, రక్షణ ఉండాలని తీర్మానం పేర్కొంది. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో అణ్వాయుధ రహిత దేశాలు పోషిస్తున్న పాత్రను కూడా ఈ తీర్మానం గుర్తించి ప్రశంసించింది. అణ్వాయుధాలు లేని దేశాలపై అణు దాడులు చేస్తామంటూ చేస్తున్న బెదిరింపులను తీర్మానం ప్రస్తావిస్తూ,ఆయా దేశాలకు లభించే భద్రతా హామీకి సదస్సు తన మద్దతును ఉద్ఘాటించింది.

# పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



- హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణేశ్ ఉత్సవాల సందర్భంగా పర్యావరణహిత విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా హెచ్‌ఎండిఎ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా మొత్తం 1,33,000 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసింది. ఈ పంపిణీ ప్రక్రియలో 8 అంగుళాల పరిమాణం కలిగిన 80,000 విగ్రహాలు, 1 అడుగు పరిమాణం కలిగిన 53,000 విగ్రహాలను ప్రజలకు అందించారు. భక్తులు పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వినాయక ఉత్సవాలను బాధ్యతాయుతంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతోనే హెచ్‌ఎండిఎ ఈ ఉచిత మట్టి విగ్రహాల పంపిణిని చేపట్టింది. ఉత్సవాల సమయంలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఒపి) విగ్రహాలకు బదులుగా పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలను వినియోగించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సంస్థ పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్టించి పండుగను జరుపుకోవాలని హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. నగరవాసులంతా ఈ హరిత చొరవలో భాగస్వాములై హైదరాబాద్‌ను మరింత పరిశుభ్రమైన, పచ్చని నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.

# గీత కార్మికులపై ఈగల్ ఫోర్స్ దాడులు ఆపాలి

- అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి : గాజుల ముకేశ్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గీత కార్మికులపై ఈగల్ ఫోర్స్ దాడులు వెంటనే నిలిపివేయాలని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గాజుల ముకేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. కల్తీ కల్లు తయారు చేస్తున్నారన్న నెపంతో గీత కార్మికులపై అక్రమ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపడం దుర్మార్గమన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ కల్లు డిపోలు, దుకాణాలపై దాడులు చేసి గీత కార్మికులను వేధించడం సరికాదన్నారు. మహబూబ్‌నగర్, నిజామాబాద్, బోధన్, నిర్మల్ తదితర ప్రాంతాల్లో దాడులు చేసి కేసులు నమోదు చేశారని తెలిపారు. గీత కార్మికులు మాదకద్రవ్యాలు కలుపుతున్నారనే ఆరోపణలు చేసే ముందు కల్లు నాణ్యతను పరిశీలించాలని ఆయన కోరారు. మద్యం మాఫియా ఒత్తిళ్లతో కల్లు అమ్మకాలను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కల్లు వృత్తిపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 లక్షల మంది గీత కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని వృత్తిని రక్షించాలని కోరారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ప్రమాదవశాత్తు మరణించే గీత కార్మికుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కల్లు గీత సొసైటీకి తాటి, ఈత వనాల పెంపకం కోసం ఐదెకరాల భూమి కేటాయించాలని కోరారు. కోకాపేటలో ప్రభు త్వం కేటాయించిన స్థలంలో గౌడ భవన్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ సమీపంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ముకేశ్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

## నవోదయ పారిశ్రామికవాడ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి పరిధిలోని నవోదయ ఇండస్ట్రీయల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం పారిశ్రామికవాడ కార్యాలయంలో ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా జె ఆనంద్‌కుమార్,ఉపాధ్యక్షులుగా మురళీ కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా తిరుపతిరావు,కోశాధికారిగా కె సాయిరాం, సంయుక్త కార్యదర్శులుగా ఎం వెంకటష్,ఎ మోహన్‌రెడ్డి,కార్యవర్గసభ్యులుగా వై జనార్ధన్‌రావు,ఆర్ శ్రీనివాస్‌రెడ్డి,కె శ్రీనివాస్‌రావు, బి దేవ్‌బాలలు ఎన్నికైనట్లు అధికారులు కె.క్రిష్టారావు,మక్దూమ్‌లు తెలిపారు. ఎన్నకైన సభ్యులు ప్రజాప్రతినిధుల సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు.

## నాగారంలో మట్టి గణేశ్ విగ్రహల పంపిణీ



**ప్రజాపక్షం/చర్లపల్లి :** వినాయక చవితిని పురస్కరించుకుని నాగారం మాజీ కౌన్సిలర్ కౌకుట్ల అనంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ 1500 మట్టి వినాయకుల విగ్రహలను నాగారం శిల్పానగర్, రాంపల్లిలలో ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమానికి మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్,మాజీ కౌన్సిలర్లు గూడురు ఆంజనేయులుగౌడ్,కృష్ణారెడ్డి,సురేష్‌ల చేతుల మీదుగా అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహలను ప్రతిష్టించి వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహల పంపిణీ



**ప్రజాపక్షం/చర్లపల్లి :** పిఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనిమణిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కమలానగర్‌లో వారి నివాసంలో భక్తులకు వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని వినాయక విగ్రహలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహలను పూజించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పెంచాల సురేందర్ రావు,కరిపే ప్రవీణ్‌వంజరి,ప్రొద్దుటూరు గోవర్ధన్,మదన్‌మోహన్,చౌదరి,ఉమేష్,అరుణ్,ప్రకాష్,సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మంటపం ప్రారంభించిన మాజీ కౌన్సిలర్




**ప్రజాపక్షం/చర్లపల్లి :** నాగారం డివిజన్ పరిధిలోని నాగారం సాయి నివాస్ నగర్ కాలనీలో వినాయక మండపాన్ని మాజీ కౌన్సిలర్ గూడురు సబితా ఆంజనేయులుగౌడ్ ప్రారంభించారు.వినాయక చవితి సందర్భంగా మండపాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని,వారికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు గూడురు ఆంజనేయులుగౌడ్,కాలనీ ప్రతినిధులు ఎం గోవింద్‌రావు,వి రవి,శ్రీహరి,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి కృప భక్తులందరిపై ఉండాలి



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 130 సుభాష్ నగర్ డివిజన్ సుభాష్ నగర్ లోని అయిమాత దేవాలయంలో సిర్వీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయిమాత అమ్మవారి 611వ జయంతి దేవాలయ 23వ వార్షికోత్సవ వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆయి మాత కృపా కటాక్షాలు, సిర్వి సమాజ్ సంపూర్ణ మద్దతుతో నన్ను భారీ మెజార్టీతో గెలిపించిన మీకు అందరకీ నా ధన్యవాదాలు, సమాజ సభ్యులకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం సిర్వి సమాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిర్వి సమాజ్ అధ్యక్షులు రావత్ రాంజీ బర్ఫా, ఉపాధ్యక్షులు సోహన్ లాల్జీ పరిహార్ , దుర్గా రాంజీ ములేవా, కార్యదర్శి ప్రేమ్ పావార్, జాయింట్ సెక్రెటరీ మంగల్ పావార్, ట్రెజరర్ పవర్ లాల్ ఖగ్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మంటపాల నిర్వాహకులకు ఉచితంగా ఎల్ఇడి లైట్ల పంపిణీ



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గణేష్ మండపాల నిర్వాహకులకు ఉచితంగా ఎల్ఇడి లైట్లను పంపిణీచేశామని, గణేష్ మండపాలకు సిఎం రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్ అందిస్తున్నారని, విద్యుత్ శాఖ అధికారుల నిబంధనలు పాటిస్తు ఎల్ఈడి లైట్లను బిగించుకోవాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లో మొత్తం 146 గణేష్ మండపాలకు 946 ఎల్ఈడి లైట్లను టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి తన సొంత నిధులతో గణేష్ మండప నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలోని దేవరయాంజాల్, శివశివాని కాలనీ, మలన్న తాండ, హకింపేట, సింగాయిపల్లి, హకింపేట ఫేస్ 2, పోతాయిపల్లి, మందాయిపల్లి, తూంకుంట, ఎలిగలగూడెం, ఉప్పర్‌పల్లి, బొమ్మరాశిపేట, శామీర్‌పేట, జగ్గంగూడ, గౌడవెల్లి, కొంపల్లి, బహదూర్‌పల్లి, జవహార్ నగర్ ప్రాంతాలకు చెందిన గణేష్ మండపాలకు ఎల్ఈడి లైట్లను అందజేయడం జరిగిందన్నారు.

# సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

సెప్టెంబర్ 17 నాంపల్లి బహిరంగ సభను జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పిలుపు



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 17న నిర్వహించనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలకు సిపిఐ భారీ బహిరంగ సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు తాండోపతండాలుగా తరలివచ్చి జయప్రదం చేయాలని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేష్ పిలుపునిచ్చారు. కాప్రా మండల సిపిఐ కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన జవహర్‌నగర్‌లోని గిరిప్రసాద్ నగర్‌లో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ, గిరిప్రసాద్ నగర్‌లో దీర్ఘకాలంగా వేధిస్తున్న వీధిలైట్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఇక్కడ ఇండ్లు నిర్మించుకున్న వారికి, గతంలో అందించిన విధంగానే నోటరీ రిజిస్ట్రేషన్ ప్రాతిపదికన విద్యుత్ మీటర్లు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు, సీనియర్ నాయకులు సీహెచ్ దశరథ, కాప్రా మండల ఎఐటీయూసి అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య, గిరిప్రసాద్ నగర్ శాఖ కార్యదర్శి, కొండా సత్యం సాగర్, మండలం సహాయ కార్యదర్శి మోతె రాజేశ్వరి, రైతు సంఘం నాయకులు పి.నరసింహ, కే.జయమ్మ, మాధవి, కురుమయ్య, నాని, స్వామిదాస్, రాజు నాయక్, లింగయ్య, జయ, అనసూయ, సిహెచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓటు కోల్పోకుండా ప్రతి ఒక్కరికీ అండగా నిలవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** ఎస్ఐఆర్ ఓటు నమో దు కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు ఎదురవుతు న్న సమస్యలను పరిష్కరించేందుకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ఓటు నమోదు, పరిశీలన ప్రక్రియలో పలువురు ఓటర్లు తమ ఓటు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా సరైన అవగాహన లేకపోవడం వల్ల నోటీసులు అందుకున్న వారు ఇ బ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రతి నాయకు డు, కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, వారికి సంబంధించిన గుర్తింపు కార్డులు, ఇతర అవసరమైన పత్రాలతో సంబంధిత అధికారులను సంప్రదించేలా సహకరించాలని దిశానిర్దేశం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఓటు విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి, అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా కోల్పోకుండా కాపాడేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఓటు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, ఆ హక్కును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు పేర్కొన్నారు. ఓటు ప్రక్రియపై అవగాహన లేని ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించి, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులపై ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, సాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు రవి యాదవ్, సురేందర్ యాదవ్, కలిదిండి రోజాతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం



**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** పర్యావరణ పరిరక్షణతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కెపిహెచ్‌బి కాలనీ వసంత్‌నగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో మట్టి వినాయకు విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ చేతుల మీదుగా సర్దార్ పటేల్ నగర్, భగత్‌సింగ్ నగర్, వసంత్‌నగర్, మలేషియన్ టౌన్‌షిప్, గోపాల్ నగర్, విశ్వాంబరి, శీలా పార్క్ కాలనీలలో భక్తులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయ చవితి సందర్భంగా మట్టి గణనాథులను ప్రతిష్టించి పూజించడంతో పాటు మన సంప్రదాయాలను కాపాడినవారమవుతామని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతను నిర్వర్తించినవారవుతారని తెలిపారు. భక్తిశ్రద్ధలతో వినాయకుడిని పూజించడంతో పాటు పర్యావరణ హితంగా పండుగను నిర్వహించాలని బండి రమేష్ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి కుటుంబం మట్టి వినాయక విగ్రహాలను పూజించేలా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మట్టి వినాయక విగ్రహాలను ఇంట్లోనే స్వచ్ఛమైన నీటిలో నిమజ్జనం చేసి, అనంతరం ఆ మట్టిని మొక్కలకు వినియోగించాలని సూచించారు. మట్టి మొక్కలకు సహజ ఎరువుగా ఉపయోగపడుతుందని, తద్వారా ఈ కార్యక్రం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మందలపు సా యిబాబు చౌదరి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిలారి బాబు, మలేషియన్ టౌన్‌షిప్ అధ్యక్షులు కాకర్ల సురేష్ చౌదరి, మాజీ కౌన్సిలర్ లయ్య, చావా శ్రీనివాసరావు, కొదపరామారావు, కాజా నవీన్, చిలుకూరి గోవింద రాజు, రామ్ చౌదరి, లెక్షరర్ శ్రీనివాస్, నల్ల మోతు ఫణి, శేషారావు, సురేష్, గంటా భీమేశ్వరారవు తదితరులు పాల్గొన్నారు.

## సంఘం బలోపేతానికి కృషి చేస్తా

బిజెఆర్ నగర్ గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా దుబ్బాక రవీందర్ గౌడ్



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** బిజెఆర్ నగర్‌తో పాటు పరిసర కాలనీల గౌడ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తలు, సభ్యుల సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గౌడ కులస్తులందరి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. సంఘం అధ్యక్షుడిగా దుబ్బాక రవీందర్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మెరుగు బిక్షపతి గౌడ్, తండా ప్రభాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బండకింది భరత్ గౌడ్, కోశాధికారిగా దంతూరి శివకుమార్ గౌడ్, సహాయ కార్యదర్శిగా దుబ్బాక నవీన్ గౌడ్ నియామకమయ్యారు. సంఘం సలహాదారులుగా వడ్లకొండ వెంకటేష్ గౌడ్, మొక్తల శంకరయ్య గౌడ్, పుట్ట బిక్షపతి గౌడ్, వ్యవహరిస్తారు. కార్యవర్గ సభ్యులుగా బి.ఈశ్వర్ గౌడ్, బి.కృష్ణ గౌడ్, ఎన్.వెంకన్న గౌడ్, దంతూరి రజినీకుమార్ గౌడ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు దుబ్బాక రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘంలోని ప్రతీ ఒక్కరి సలహాలు, సూచనలు తీసుకుంటూ, అందరినీ కలుపుకొని సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. ఈ పదవిని ఒక బాధ్యతగా స్వీకరించి బిజెఆర్ నగర్ గౌడ సంఘం బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ప్రజాపక్షం/చర్లపల్లి :** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి ఇండస్ట్రీయల్ వెంకటేశ్వర ఇండస్ట్రీస్‌లో పనిచేస్తున్న డొక్కు రత్నరాజు(19),రాజేష్(22),పీత ప్రభాకర్(19)లు ద్విచక్ర వాహనంపై బిఎన్‌రెడ్డి నగర్ వైపు నుండి చర్లపల్లి వైపు వెళ్తుండగా ఇసీ నగర్ కమ్యూనిటీ హాలు సమీపంలో ఎదురుగా వచ్చిన కారు(ఎంహెచ్ 42 బిబి 6998) నిర్లక్ష్యంగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది.తీవ్ర గాయాలైన వారిని గాంధీ ఆసుపత్రికి తరలించగా తెల్లవారుజామున రత్నరాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.రాజేష్,ప్రభాకర్‌లను మెరుగైన చికిత్స కోసం శ్రీకర ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



**ప్రజాపక్షం / కూకట్‌పల్లి :** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని పిఎసి చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సూచించారు. ఆదివారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అంబిర్ చెరువు వద్ద వినాయక నిమజ్జనానికి చేపట్టాల్సిన ఏర్పాట్లను, నిమజ్జన కొలను వద్ద జరుగుతున్న పనులను ఆయన సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం, వివిధ శాఖల అధికారులు, సీఐ విజయ్ కుమార్, ట్రాఫిక్ సీఐ రాజు, తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్ గౌడ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను పూజించి, ప్రకృతికి హాని కలగకుండా పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల చెరువులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున మట్టి విగ్రహాలనే వినియోగించాలని కోరారు. వినాయక పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గాంధీ ఆదేశించారు. వినాయక మండపాల వద్ద ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో భక్తులు పండుగను నిర్వహించుకునేలా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అంబిర్ చెరువు వద్ద నిమజ్జన కొలను నుంచి నీటిని పూర్తిగా తొలగించి శుభ్రపరిచి, రంగులు వేసినట్లు అధికారులు గాంధీకి వివరించారు. నిమజ్జనానికి ముందుగా కొలను మంచినీటితో నింపాలని, నిమజ్జనం కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## దళితుల పట్ల నేటికీ వివక్షత



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** స్వతంత్ర వచ్చి 80 ఏళ్లు దాటుతున్నా దళితుల పట్ల నేటికీ వివక్షత కనపరుస్తూనే ఉన్నారని, దేశానికి రాజ్యాంగాన్ని అందించిన బిఆర్ అంబేద్కర్ దళితుడే అన్న విషయాన్ని మరువవద్దని టిపిసిసి ఎస్సీ విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందుల సూర్యకిరణ్, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మ కిరణ్ కుమార్, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డిలు తెలిపారు. రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయటం పట్ల ఆ పార్టీ అధినేత సిగ్గుపడి దళితజాతికి క్షమాపణలు చెప్పి తప్పిదాన్ని సరి చేసుకోవాలని డి మాండ్ చేసారు. బోడుప్పల్ సర్కిల్‌లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తి మైసయ్య ఆధ్వర్యంలో బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి 395వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ అత్యున్నత స్థానంలో ఉన్న స్పీకర్ దళితుడన్న భావంతోనే అవమానకరంగా మాట్లాడారని, దళితులతో ఎవరైనా పెట్టుకొంటే కొరివితో తల గోక్కున్నట్లే అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం బోడుప్పల్ అధ్యక్షుడు గరుగుల యాకయ్య, రొయ్య లక్ష్మి నారాయణ, రాపోలు వెంకటేష్, యేసురాజు, గుంజి శ్రీనివాస్, అంజయ్య, నరసింహ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కండ్లకోయలో నూతన జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** న్యాయ సేవలను మరింత సులభత రం చేసే లక్ష్యంగా నూతన జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్‌లోని కండ్లకోయ గ్రామంలో ఏర్పాటు చేయనున్న సమగ్ర కోర్టు సముదాయ నిర్మా ణ పనులకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మ ణ్, జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి,జస్టిస్ నందికొండ నర్సింగరావు, జిల్లా కలెక్టర్ మనుచౌదరిలతో కల్సి శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని అవిష్కరించారు.నూతన భవనంలో ఆధునిక మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా కేసుల విచారణ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాల భాస్కరరావు,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంతరెడ్డి, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కాడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ భూ బాధితులను న్యాయం చేయాలి


మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి



**ప్రజాపక్షం/పరిగి :** వికారాబాద్ జిల్లాలోని పరిగి మండల కాడ్లాపూర్ ఇండస్టియల్ పార్క్ భూబాధితలను పరామర్శించడానిఇ వెళ్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డిని బిఆర్ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు, పోలీసులకు, బిఆర్ఎస్ నాయకుల మధ్య కొంత ఉద్రిక్తత ఏర్పాడింది,ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్నా చేస్తున్న రైతులను నిర్బందించి రాత్రి అంతా వికారాబాద్ ట్రైనింగ్ సెంటర్లో ఉంచి ఎక్కడపడితే అక్కడ రైతులను తిప్పడం ఏమిటని ప్రశ్నించారు. భూ బాదిత రైతులను పరామర్శించడానికి వేళ్తుంటే అరెస్టు చేయడం ఏమిటని అన్నారు. గతంలో కాలపూర్ రైతుల భూములు తీసుకోమని చెప్పి ఇప్పుడు తీసుకుంటున్నామనడం ఎంతవరకు సరైనది అన్నారు.గతంలో కాలాపూర్ రైతుల భూములు తీసుకోమని చెప్పి అసెంబ్లిలో ఎమ్మెల్యే భూములు తీసుకుంటున్నామనడం ఎంతవరకు సరైనదన్నారు. భూములు పోకండా ఎల్లప్పుడు రైతుల పక్షాన పోరాతామన్నారు.

## మున్నూరు కాపులకు అండగా ఉంటాం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మున్నూరుకాపులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని శామీర్‌పేట మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్‌పటేల్ అన్నారు. అలియాబాద్ మున్సిపాలిటికి చెందిన వేల్పుల భూషణం పటేల్ ఇటీవల మృతి చెందారు. ఆదివారం అలియాబాద్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు తోట లక్ష్మన్ పటేల్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ పటేల్ సమక్షంలో మున్నూరుకాపు సభ్యుల సహకారంతో బాధిత కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆపద లో ఉన్న మున్నూరుకాపులను ఆదుకోవడానికి సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం సభ్యులు వైల ఎల్లయ్య, వైల నర్సింగరావు, కరుణాకర్, శ్రీనివాస్, రాజేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.




## ముగిసిన జిల్లా గౌడ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా గౌడ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగిందని ,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధి రాష్ట్ర గోపాఅధ్యక్షులు బండిసాయన్న గౌడ్ హాజరై మాట్లాడుతూ ,జిల్లా గోపా అధ్యక్షులుగా సత్యనారాయణ ,ప్రధన కార్యదర్శి సతీష్ గౌడ్ , కోశాధికారిగా జి.వెంకటేష్ గౌడ్ , ఎన్నుకోవడం జరిగిందన్నారు.అనంతరం మిగత కార్యవర్గ సభ్యులను జిల్లా కమిటి ఎన్నుకోవాలని సూచించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను మానం అదర్శకంగా తీసుకొని ముందుకు వెళ్లాల్లని కోరారు. గౌడ్ కులంలో చాలా మంది వెనుకబడి ఉన్నారని ,కొందరు ,చదువులకు దూరం అయ్యారని వాపోయారు. విద్యా ఉద్యోగపరంగా వెనుకబడిన గౌడ్‌లకు సహకారం అందించాలని తెలిపారు.ఈసమావేశంలో మీరయ్య గౌడ్ ,చంద్రశేఖర్ గౌడ్ ,యాదగిరిగౌడ్ , బండెప్పగౌడ్ , శ్రీహరి ,రమేష్ గౌడ్ ,రాజేందర్‌గౌడ్ ,బాలరాజు గౌడ్,ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గోన్నారు.

## మట్టి వినాయకులను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడాలి


**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వినయక చవితిని పురస్కరించుకుని ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్‌రెడ్డి లు అన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం వద్ద మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ ఆద్వర్యంలో మట్టి గణపతులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కరుగుతాయని చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులు కలుషితం కాకుండా ఉంటాయని పేర్కొన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ ఆద్వర్యంలో మట్టి వినాయకుల విగ్రహాలను పంపిణి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్‌లు గోపాల్‌రెడ్డి లక్ష్మి నారాయణ, బిజెపి నాయకుడు పట్నం నర్సింహారెడ్డి, ప్రకాష్‌గౌడ్, సూపర్‌వైజర్‌లు ఆనంద్, రజిని, తదితరులు పాల్గొన్నారు.



రీల్

'దివంగత నటి పావలా శ్యామల కూతురు మాధవిని రమణాచారి ఫౌండేషన్‌లో జాయిన్ చేస్తున్నామని 'మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్)' ట్రెజరర్ శివ బాలాజీ తెలిపారు. ఆమె సంక్షేమం కోసం సీనియర్ నటుడు నరేష్, మురళీ మోహన్ తదితరులు యాభై వేల చొప్పున ఆర్థిక విరాళాన్ని అందించారు.'

## యాక్షన్ నేపథ్యంలో 'స్వయంభు'




నిఖిల్ సిద్ధార్థ్ 'స్వయంభు' సినిమాతో ప్రేక్షకులను చారిత్రక ప్రపంచంలోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. భారీ అంచనాలతో రూపొందుతున్న ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాకు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. మల్టీ లాంగ్వేజ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. 'స్వయంభు' కోసం ఏకంగా 175 రోజుల పాటు షూటింగ్ నిర్వహించారు. ఫైనల్ ప్రొడక్ట్‌లో సుమారు 2,500 వీఎఫ్ఎక్స్ షాట్స్‌ను పొందుపరుస్తున్నారు. ఈ నెంబర్స్ సినిమా ఏ స్థాయిలో తెరకెక్కుతోందో, ఎంత భారీ టెక్నికల్ వర్క్ జరుగుతోందో తెలియజేస్తున్నాయి. తాజాగా విడుదల చేసిన బిహైండ్ ది సీన్స్ పిక్చర్ సినిమా మేకిన్గ్ ఆసక్తిని పెంచుతోంది. ఇందులో నిఖిల్ ఇంటెన్స్ వారియర్ అవతార్లో యాక్షన్ సీక్వెన్స్‌కు సిద్ధమవుతున్నట్లు కనిపించారు. సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ విజువల్స్ అందిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్లు ఎం. ప్రభాహరన్, రవీందర్ ఈ సినిమా కోసం భారీ ప్రపంచాన్ని క్రియేట్ చేస్తున్నారు. నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## కొత్త కంటెంట్‌తో పిఠాపురంలో... అలా మొదలైంది'

### ప్రీ రిలీజ్‌లో డా. రాజేంద్రప్రసాద్


డా. రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో ప్రముఖ దర్శకులు 'ప్రేయసి రావే' ఫేమ్ మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పిఠాపురంలో& అలా మొదలైంది'. ఈ సినిమాని మహేష్ చంద్ర సినిమా టీమ్, ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనుంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది . ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు సుమన్ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ 'చంద్ర మహేష్‌తో నాకు 25 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. ఆయన క్లారిటీతో ఉండే అద్భుతమైన దర్శకుడు. 'పిఠాపురంలో& అలా మొదలైంది' మంచి విజయం సాధించాలి. కొత్త కంటెంట్‌తో, ఫ్రెష్ సబ్జెక్ట్‌తో ఆయన తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను అని అన్నారు.డా. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నా 49 సంవత్సరాల సినిమా జీవితంలో నాకు దొరికిన అదృష్టం ఏమిటంటే, నాకు దొరికిన మంచి పాత్రలు. ఈ అదృష్టమంతా నాకు ఆ పాత్రలవల్లే దక్కింది. చంద్ర మహేష్ ఎలాంటి దర్శకుడో నాకు ముందు నుంచీ తెలుసు. ఈ కథ చెప్పినప్పుడే నా పాత్ర తాలూకు డెప్త్ ఏమిటో అర్థమైంది. చంద్ర మహేష్ అంటే ఏమిటో ఈ సినిమా చూపిస్తుంది. ఎన్నో కష్టనష్టాలు భరించి ఈ సినిమా తీశాడు తను. ప్రపంచంలో వున్న తెలుగువారందరూ కనెక్ట్ అయ్యే కంటెంట్ ఇది. ఎందుకంటే, ఇది అందరి ఇళ్లలో వుండే కథ. ఈ సినిమా చూసిన ప్రతి ప్రేక్షకుడూ పది మందికి గొప్పగా చెబుతాడు. మై హార్ట్ ఫెల్ట్ థాంక్స్ టు చంద్రమహేష్. క్లైమాక్స్ సీన్‌లో ఆర్టిస్ట్‌లు కూడా కన్నీరు పెట్టుకున్నారు. అంతటి ఎమోషన్ వుంది. దాంతోపాటే ఈ జనరేషన్‌కు నచ్చే అన్ని మసాలాలూ ఈ సినిమాలో వున్నాయి. ఒక సీనియర్ నటుడుగా మీ అందరికీ దణ్ణంపెట్టి చెబుతున్నా. దయచేసి ఒక మంచి సినిమాని థియేటర్‌కు వెళ్లి చూడండి అన్నారు. దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడారు. సినిమా బాగా నటి మణిచందన మాట్లాడుతూ .. ''పిఠాపురంలో& అలా మొదలైంది' చిత్రంలో మంచి కథ, మంచి ఎమోషన్ ఉంటుందని చెప్పారు





ఇరుముడి సినిమా సూపర్ హిట్టయిన సందర్భంగా హీరో రవితేజ, దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాతలను అభినందించిన మెగాస్టార్ చిరంజీవి

## 18న ఉపేంద్ర రీ రిలీజ్



రెండు దశాబ్దాల క్రితం కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర స్వయంగా దర్శకత్వం వహించి నటించిన చిత్రం ఉపేంద్ర. రీరిలీజ్‌ల ట్రెండ్ నడుస్తున్న ఈ సమయంలో ఉపేంద్ర సినిమాను రీ రిలీజ్ చేస్తున్నారు. 1999లో విడుదలై సంచలనం విజయం సాధించింది . ఈ సినిమా ఇప్పుడు కొత్త తరానికి కూడా వినోదం పంచేందుకు సిద్ధమైంది. 'ఉపేంద్ర' పుట్టినరోజు సందర్భంగా ఉపేంద్ర సినిమాను సెప్టెంబర్ 18న ఎంజీ మూవీస్ బ్యానర్‌పై ఎం అచ్చిబాబు ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఉపేంద్ర ఈ సినిమాను తీసిన అప్రోచ్‌కు అప్పట్లో అభిమానులు ఫిదా అయ్యారు. ఈ సినిమాలో రవీనా టాండన్, ప్రేమ, దామిని కీలక పాత్రల్లో నటించారు. శిల్పా శ్రీనివాస్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రానికి సంగీతాన్ని గురుకిరణ్ అందించారు. అప్పట్లో పాటలు ట్రెండ్ సెట్ చేసాయి. బుక్ మై షో, డిస్ట్రిక్ట్ యాప్స్ లో బుకింగ్స్ ఓపెన్ అయ్యాయి.

## 'ది ప్యారడైజ్'లో యాక్షన్ కొత్తగా ఉంటుంది

### ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్



నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. . ఈ చిత్రం 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ మీడియా తో చిట్ చాట్ నిర్వహించారు. మేము, నవకాంత్, రియల్ సతీష్ పనిచేశాం. ఇందులో మేం రెండు భారీ యాక్షన్ బ్లాక్స్ కంపోజ్ చేశాం. నాని క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ కొత్తగా డిజైన్ చేశారు. రెండు జడలు వేసుకున్న హీరోను ఇండియన్ స్క్రీన్‌ప్లే ఇప్పటివరకు చూడలేదు. మాకు కూడా అది చాలా కొత్తగా అనిపించింది. నాని ప్రేక్షకులకు కొత్తదనం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. నాని ఈ స్థాయిలో యాక్షన్ చేయడం ఇదే మొదటిసారి. ఇందులో యాక్షన్ సీన్స్ చాలా హెవీగా ఉంటాయి. 'దసరా' కంటే మూడు రెట్లు ఎక్కువ యాక్షన్ ఉంటుంది. జడలతో యాక్షన్ సీక్వెన్స్ చేయడం మామూలు విషయం కాదు. యాక్షన్ చేస్తున్నప్పుడు ఆ జడలు రోప్లకు, ముఖానికి తగులుతుంటాయి. అలాంటి యాక్షన్ సీక్వెన్స్ చేయడం మాకు కూడా కొత్త అనుభవమే. మా అసిస్టెంట్‌కు కూడా అలాంటి జడలు వేయించి అందులో ఉండే కష్టం తెలుసుకుని మరీ యాక్షన్‌ను కంపోజ్ చేశాం.

నాని బేర్ బాడీతో చేసే యాక్షన్ సీక్వెన్లు ఉంటాయి. అవి స్క్రీన్‌ప్లే చేయడం అంత ఈజీ కాదు. బాడీ బిల్డింగ్ చేయాలి. డైటింగ్లో ఉండాలి. ఇందులోనూ దర్శకుడు శ్రీకాంత్ తనకు అనుకున్నది వచ్చేంతవరకు రాజీపడరు. శ్రీకాంత్ తీసుకున్న విజన్కు నాని వంద శాతం న్యాయం చేశారు. అందులో మేం భాగమవడం అదృష్టంగా భావిస్తున్నాం.మా యాక్షన్ బ్లాక్స్ పూర్తి చేయడానికి దాదాపు పది రోజులు పట్టింది.

ఇందులో కొత్త మనుషులు, కొత్త బాడీ లాంగ్వేజ్.. అంతా కొత్తగానే ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఎంచుకున్న కథ సహజంగానే యాక్షన్ను డిమాండ్ చేస్తుంది. ఇందులో తప్పించుకోవడానికి అవకాశం ఉండదు.. ఫైట్ చేయాల్సిందే. అలాంటి పరిస్థితిని శ్రీకాంత్ క్రియేట్ చేశారు. యాక్షన్‌ను కంపోజ్ చేయడానికి చాలా సమయం తీసుకున్నాం. ఎందుకంటే ఇలాంటి బాడీ లాంగ్వేజ్ తో సినిమా ఇంతకుముందు రాలేదు. అందుకే చాలా కేర్ తీసుకుని చేశాం. ఇందులో చాలా రిస్కీ యాక్షన్ ఉంటుంది. షూటింగ్ సమయంలో మా యూని ట్లో ఒకరికి గాయం కూడా అయింది. మోహన్ బాబు చాలా సినిమాలు చేశారు. కానీ ఇందులో చాలా కొత్తగా కనిపిస్తారు. ఆయనకూ యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. కాంపిటీషన్ ఉన్నప్పుడే క్రియేటివిటీ పెరుగుతుంది. ఇంకా ఎలా కొత్తగా చేయాలనే తపన వస్తుంది. మేం ప్రతిరోజూ తొలి సినిమా చేస్తున్న ఫైట్ మాస్టర్స్‌లా భయంతో, వృత్తి పట్ల నిజాయితీతో, ఏకాగ్రతతో పనిచేస్తుంటాం. మా అబ్బాయి కూడా 'ప్యారడైజ్'లో పనిచేశాడు. తనకు అన్ని భాషల సినిమాలపై మంచి పట్టు ఉంది. సుధాకర్ ఎక్కడా రాజీపడకుండా భారీగా ఖర్చు పెట్టి ఈ సినిమాను నిర్మించారు. నాని, దర్శకుడిపై పూర్తి నమ్మకంతో ముందుకెళ్లారు. నాని, నిర్మాత, దర్శకుడు కలిసి 'ప్యారడైజ్'ను బిగ్ స్కేల్ లో చేశారు. ఈ సినిమాకి అద్భుతమైన విజయం తప్పకుండా దక్కుతుందని మేం నమ్ముతున్నాం.

## 'హ్యాపీ జర్నీ ట్రైలర్ లాంచ్

హ్యాపీ' జర్నీ'లో అదే ఆలోచనను ఏడుగురు మహిళల జీవితాలు, అనుభవాల ద్వారా ఆసక్తికరంగా చూపించారు. ఏ డు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న 'హ్యాపీ జర్నీ' చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ను లాంచ్ చేశారు ఈ చిత్రం 18న థియేటర్లలోకి రానుంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అభిరామ్ నాయుడు మాట్లాడుతూ పేరెంట్స్ మీద మనకి చాలా ప్రేమ ఉంటుంది. ఎమోషన్స్ అన్నీ ఈ సినిమాలో చూపిస్తాం. నిజంగా జనాభా పెరిగితే ఒకరికొకరు తోడు పెరగాలి. కానీ మనం వంటరి అవుతున్నాను. ఫోన్ నెం బర్లు ఉంటాయి కానీ ఎవరికీ ఫోన్ చేయలేని పరిస్థితి. ఒకరికొక రు తోడుగా ఉంటే ఎంత అందంగా ఉంటుందనేది ఈ సినిమా లో చూపించబోతున్నాం. ఇందులో ఏడుగురు విభిన్న నేపథ్యాల నుంచి వచ్చే మహిళల జర్నీని మీరు చూస్తారు. సినిమా అంతా చాలా ఫన్ ఉంటుంది. చివర్లో చాలా మంచి పాయింట్ కూడా ఉంటుంది. అది మీ అందరికీ నచ్చుతుంన్నారు. పాయల్, జెనీ వా, రమ, సుజాతను, ఎడిటర్ ఛోటా కె. ప్రసాద్ పాల్గొన్నారు.



## ఇంజనీర్లు, శాస్త్రవేత్తలకు ఘన సత్కారం

ప్రజాపక్షం/హైదరాబాద్: సమాజంలో జాతి నిర్మాణకర్తల పాత్ర అత్యంత కీలకమని పలువురు వక్తలు అన్నారు. 'ఇంజనీర్స్ డే' సందర్భంగా 'బ్రహ్మకుమారీస్ సైంటిస్ట్స్, ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్స్ విభాగం, బ్రహ్మకుమారీస్ పీస్ హౌస్, హైదరాబాద్ సహకారంతో ''జాతి నిర్మాణకర్తలకు గౌరవం'' అనే థీమ్‌తో హైదరాబాద్‌లోని బి.ఎం. బిర్లా సైన్స్ సెంటర్ కాంప్లెక్స్‌లోని అడ్మిరల్ గోపాల్ రావు బిర్లా కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం సుమారు రెండు వందల మంది ఇంజనీర్లు, శాస్త్రవేత్తలను ఘనంగా సత్కరించారు. కార్యక్ర మానికి ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డా.రమణ నాయిక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు బ్రహ్మకుమారీస్ చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. రాజయోగ ధ్యానం, ఆధ్యాత్మిక విలువల ప్రయోజనాలను ఇంజనీర్లకు పరిచయం చేయాలని కోరారు. తెలంగాణ స్టేట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఇ ఎస్ జి కమిటీ చైర్‌పర్సన్ జి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం పరివర్తనకు సమయం వచ్చిందన్నారు. ఏం చేయగలమనేది కాదని, ఏం చేయాలన్నదే ప్రస్తుతం ఆలోచించాల్సిన విషయం అని సూచించారు. ఆధ్యాత్మికత మనలో జ్ఞానాన్ని పెంపొందించి, జీవితానికి సరైన దిశను చూపుతుందని సూచించారు. అర్బన్ ఆర్ట్స్ డైరెక్టర్ దేవయాని ప్రమోద్ షిండే స్వాగతోపన్యాసం చేయగా, సైంటిస్ట్స్ అండ్ ఇంజనీర్స్ వింగ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ బి కె అంజలి ముఖ్యఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో .ఆల్ ఇండియా రేడియో, ఎన్‌జిఆర్ఐ, ఎన్‌టిపిసి, విసిటి, ఉస్మానియా యూనివర్సిటీ, అవంతి ఇంజనీరింగ్ కాలేజ్,డిఆర్‌డిఒ,ఎస్‌సిసిఎల్ కొత్తగూడెం, సెయింట్ మేరీస్ గ్రూప్, జిహెచ్ఎంసి, ఆర్‌టిసి, ఇసిఐఎల్ తదితర సంస్థలకు చెందిన ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవజీవన్ అనాథాశ్రమానికి చెందిన చిన్నారుల స్వాగత నృత్యం చేశారు. కాగా బి.కె. మీనాక్షి ఆధ్వర్యంలో రాజయోగ ధ్యానం చేశారు.

## వర్షాలు (మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఈ నేపథ్యంలో ఉత్తర, మధ్య తెలంగాణలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆది, సోమవారాల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించారు. ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందన్నారు. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. మంగళ, బుధవారాల్లో ఆదిలాబాద్, కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలకు హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం నుంచి ఆదివారం వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతంగా ఉండటంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.


## కేటాయింపులు (మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థుల పరిశీలన ప్రక్రియను కూడా ఈ వారంలోనే పూర్తి చేస్తామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనల ప్రకారం అర్హత సాధించిన లబ్ధిదారులకు ఈ వారంలోనే అధికారిక కేటాయింపు పత్రాలను అందజేస్తామన్నారు. లక్కీ డ్రాలో ఎంపికైన వారు తమకు ఇల్లు కేటాయింపుపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రక్రియ అంతా పూర్తి పారదర్శకంగా జరుగుతోందని కమిషనర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన దళారులు, మధ్యవర్తుల పట్ల హెచ్చరిక జారీ చేశారు. ఇళ్లు మంజూరు చేయిస్తామని చెప్పి అమాయకుల నుంచి డబ్బులు గుంజేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, గృహాల కేటాయింపులో ఎలాంటి మధ్యవర్తులకు ప్రవేశం లేదని స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఎవరికీ లంచాలు కానీ, కమీషన్‌లు కానీ చెల్లించవద్దని కోరారు. కేటాయింపు పత్రంతో పాటే చెల్లించాల్సిన మొదటి విడత మొత్తం, అధికారిక బ్యాంకు ఖాతా వివరాలు, గడువు తేదీ సమాచారాన్ని అందిస్తామన్నారు. నిర్ణీత మొత్తం సొమ్మును అధికారిక ఖాతాలో మాత్రమే జమ చేయాలని, ఎలాంటి వ్యక్తిగత ఖాతాలకు డబ్బులు పంపవద్దని సూచించారు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే హౌసింగ్ బోర్డు అధికారులకు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. తదుపరి సమాచారం కోసం లబ్ధిదారులు అధికారిక వెబ్‌సైట్ tghb.telangana.gov.in ను కానీ, కాల్ సెంటర్ నెంబర్ 04024603572 ను కానీ సంప్రదించాలని సూచించారు.

## పూజలకు ఖైరతాబాద్

# బడా వినాయకుడు సిద్ధం

**భక్తులకు దర్శనమివ్వనున్న 70 అడుగుల పంచముఖ సంకటహర మహాగణపతి**
**నేడు 11 గంటలకు గవర్నర్ దంపతుల చేతుల మీదుగా తొలిపూజ**



ప్రజాపక్షం/ఖైరతాబాద్ (హైదరాబాద్)

విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి సందడి మొదలయ్యింది. ఏ వీధిలో చూసినా వినాయక విగ్రహాల ఏర్పాటు కోలాహలం కనిపిస్తున్నది. క్యూర్ పరిధిలో ఏర్పాటయ్యే వేలాది వినాయక విగ్రహాల కోసం మండపాలు అందంగా ముస్తాబయ్యాయి. ఈ క్రమంలోనే చారిత్రక ఖైరతాబాద్ వినాయకుడు ఈ ఏడాది పంచముఖ సంకటహర మహాగణపతిగా దర్శనమివ్వనున్నాడు. ఆదివారం దర్శనార్థం మహాగణపతి విగ్రహం తెరను తీయడంతో భక్తులు భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. భక్తులు గణపతిని దర్శించుకుని తన్మయం పొందారు. 70 అడుగుల ఎత్తులో దర్శనమిస్తున్న విఘ్నేశ్వరున్ని కనులారా వీక్షించి కోర్కెలు తీర్చాలని మొక్కుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తూ సెల్‌ఫోన్లలో గణపతిని సెల్ఫీలు తీసుకున్నారు. ఈనెల 14 నుంచి 24 వరకు జరిగే మహా క్రతువును ఎటువంటి విఘ్నాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలతో పాటు భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి సన్నాహాలు చేసింది. సోమవారం ఉదయం 11 గంటలకు ఖైరతాబాద్ మహాగణపతికి రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్ల తొలి పూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదిలాఉండగా.. ఖైరతాబాద్, బాలాపూర్ గణేశ్ దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ సాఫీగా సాగేలా పోలీసులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడపనుంది. నవరాత్రుల వేళ ఈ రెండు ప్రాంతాల్లోని గణేష్‌ను భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఖైరతాబాద్, బాలాపూర్ వరకు సెప్టెంబర్ 14 నుంచి 24 వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు సంస్థ ప్రకటించింది. జంట నగరాల నలుమూలల నుంచి వచ్చే భక్తులు ఈ సేవలను ఉపయోగించుకుని స్వామివారిని దర్శించుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ ప్రత్యేక బస్సులు జేబీఎస్, ఎంజీబీఎస్ వంటి ప్రధాన బస్ స్టేషన్లను అనుసంధానిస్తూ నడుస్తాయి.

## హౌతీల దాడి (మొదటి పేజీ తరువాయి)

జులై నుండి ఇప్పటివరకూ హౌతీలు–యెమెన్ సైన్యాలమధ్య యుద్ధం వల్ల 76,000 మంది ప్రజలు ఇళ్ళు వదలి వెళ్ళిపోయినట్లు అంతర్జాతీయ వలస సంస్థ ఆదివారం ప్రకటించింది.2022 కాల్పుల విరమణకు ముందు 1.50 లక్షలమంది హత్యకు గురికావడంతో ఇళ్ళకు తిరిగి వెళ్ళడానికి అనేకమంది భయపడుతున్నారు.యెమెన్ సైనికులు కూడా వెనుదిరిగి తీర ప్రాంతాలను ఖాళీ చేస్తున్నారు.

సౌదీ అరేబియా ప్రాంతాలపై క్షిపణులు, డ్రోన్లతో హౌతీ తిరుగుబాటుదారులు దాడులు చేశారు. దీంతో ప్రజలకు సౌదీ ప్రభుత్వం ముందస్తు హెచ్చరికలు చేసింది. సురక్షిత పద్ధతులు పాటించాలని కోరింది. ఎర్రసముద్రం వెంబడి యెమెన్ సరిహద్దుల్లోని అల్ త్వాల్ గవర్నరేట్‌లో క్షిపణి దాడి వల్ల ఇద్దరు గాయపడ్డారని, ఒక మసీదు, ఇతర భవనాలు దెబ్బతిన్నాయని సౌదీ పౌర రక్షణ విభాగం ప్రకటించింది. హౌతీలు క్షిపణి, డ్రోన్ దాడులతో షరూరా ప్రాంతంలో సైరన్లు మోగించి ప్రజలను అప్రమత్తం చేసింది.

నజ్రాన్ ప్రాంతం షరూరా రాష్ట్రంలో ఉన్న సైనిక స్థావరమే లక్ష్యంగా దాడులు చేసినట్లు హౌతీల సైనిక ప్రతినిధి, బ్రిగేడియర్ యాహ్యా సరీ చెప్పారు. ఎర్ర సముద్ర తీర ప్రాంతాన్ని హౌతీలు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ముందుకు దూసుకుపోతున్నారు. సౌదీ నౌకలను,వాణిజ్యాన్ని అడ్డుకుంటున్నారు. బాబ్ అల్‌మందెబ్ కీలక ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకోవడంతో సౌదీ అరేబియా ప్రత్యామ్నాయ నౌకా వాణిజ్యానికి విఘాతం కలుగుతోంది. హౌతీలు దాడులు చేస్తున్నప్పటికీ సౌదీ ప్రభుత్వం ప్రతిఘటించలేదు. సౌదీ అరేబియా నౌకలకు తప్ప ఇతర వాణిజ్య నౌకలకు ఎలాంటి ముప్పులేదని హౌతీలు ప్రకటించినప్పటికీ, అంతర్జాతీయ వాణిజ్యానికి విఘాతం కలుగుతోంది. చమురు ధరలు మళ్ళీ పెరిగాయి. మార్కెట్లుఅప్రమత్తత పాటిస్తున్నాయి.

మరోవైపు హౌతీల దాడులతో యెమెన్ ప్రజలు పారిపోతున్నారు. ఈ వీడియోలు వస్తున్నాయి. ఎర్ర సముద్ర తీర ప్రాంతాలను హౌతీలు స్వాధీనం చేసుకోవడంతో సౌదీ అరేబియా మద్దతు గల యెమెన్ ప్రభుత్వ దళాలు ఆ ప్రాంతాల నుండి వెనుదిరిగాయి. ఈ అవమానకర పరిస్థితుల్లో తాము హౌతీలతో పోరాటం చేస్తామని యెమెన్ ప్రభుత్వం ప్రకటించింది.

యెమెన్ పాలకమండలి సభ్యుడు సుల్తాన్ అల్ అరాదా మాట్లాడుతూ, మోఖా ఓడరేవు,ఆ ప్రాంతం హౌతీల స్వాధీనంలోకి వెళ్ళడం, యెమెన్ బలగాలు ఓడిపోవడాన్ని బాధాకరమైన విషయాలుగా పేర్కొన్నారు. యెమెన్ సైన్యానికి, దానికి అనుబంధ మిలీషియాకు ఉన్న సమన్వయ లోపమే హౌతీలకు విజయంగా మారిందన్నారు. సౌదీ వైమానికదళం మోఖాను స్వాధీనం చేసుకోకుండా మౌనంగా ఉండటం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు చెప్పారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వం గడచిన 12 సంవత్సరాలుగా హౌతీ తిరుగుబాటుదారులతో పోరాటం చేస్తోంది. ఈ విడత జరిగిన యుద్ధంలో యెమెన్ దళాలు ఘోరంగా ఓడిపోతున్నాయి. మోఖా ఓడరేవును హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. ఇది యెమెన్ దళాలకు అత్యంత అవమానకరంగా మారింది. ఇది యెమెన్ దళాలకు అతిపెద్ద ఎదురు దెబ్బ. ఈ తాజా ఉద్రిక్తతలు 2022లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఉల్లంఘన.ఇదిలా ఉండగా, ఆదివారం తెల్లవారుజామున హోర్ముజ్ జలసంధిలోని హెంగామ్ ద్వీప సమీపంలో ఒక గుర్తు తెలియని ప్రొజెక్టైల్ చేసిన దాడిలో ఇరాన్ వాణిజ్య నౌక ధ్వంసమైంది. ఈ ఘటనలో ఒకరు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. ఈ దాడి ఎవరు చేశారనే విషయంపై ఇరాన్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

### సౌదీ పైప్‌లైన్ దాడి వెనుక ఇరాన్ : ట్రంప్ ఆరోపణ

సౌదీ అరేబియా ఈస్ట్–వెస్ట్ ప్రధాన పైపులైన్‌పై దాడి, ముందస్తు భయంతో పైపులైను మూసివేత భయం వెనుక ఇరాన్ హస్తం ఉండి ఉంటుందని ట్రంప్ ఆరోపించారు.ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ, ఇరాన్ దీనికి కారణమై ఉంటుందన్నారు. హౌతీలతో తమ యంత్రాంగం చర్చలు జరుపుతోందని చెప్పారు. వారు మాతో మాట్లాడారని, వారు అమెరికాతో పోరాటం చేయడానికి సిద్ధంగా లేరని చెరప్పారని అన్నారు. వారు కేవలం తమ పొరుగున ఉన్న సౌదీ అరేబియా నౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారన్నారు.సౌదీ యువరాజు తనకు మంచి స్నేహితుడన్నారు. ఇదిలా ఉండగా, సౌదీ అరేబియా కీలక పైపులైపుపై తమ భూభాగం నుండే దాడి జరిగిందని ఇరాక్ అంగీకరించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ప్రధాన మంత్రి అలీ అల్ జైదీ చెప్పారు. దీనికి ఆగ్రహించి ఒక కమాండర్‌ను కూడా పదవి నుండి తొలగించినట్లు ఇరాక్ ప్రధానమంత్రి చెప్పారు.పైపులైనుపై దాడి జరిగినాగానీ సౌదీ అరేబియా ప్రతీకార దాడులు చేయలేదని చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com